# పరిశుద్ధాత్మ అభిషేక అభ్యాసము

"కాగా ఆయన దేవుని కుడి పార్శ్వమున హెచ్చింపబడి, పరిశుద్ధాత్మను గూర్చిన వాగ్దానమును తండ్రివలన పొంది, మీరు చూచుచూ వినుచున్న దీనిని కుమ్మరించియున్నాడు."

**అపో.కార్య. 2:33.**

గ్రంథకర్త

**యం. దేవదాసు అయ్యగారు**

గుంటూరు-2005

వెల:10.00

Bible Mission HQ Guntur

# ఆరోహణ పండుగ - గురువారము

కీర్తన 68:18; లూకా 24:50,51; అపో.కార్య. 1:8-11.



**ధ్యాన ప్రార్థన:-** **దయగల తండ్రీ! మహోన్నతుడవైన ఓ తండ్రీ! ఆకాశములు పట్టని తండ్రీ! అన్ని సింహాసనములకు పైనున్న సింహాసనముపైనున్న దయగల తండ్రీ! స్తోత్రము. ఇప్పుడు స్తోత్రము, ఎల్లప్పుడు స్తోత్రము. యుగయుగముల పొడవున నీకే స్తోత్రములు, ఆమేన్. దయగల ప్రభువా! మా జన్మమునుబట్టి, మా జీవితమునుబట్టి నీ కృపను పొందుటకు అయోగ్యులము. అయినను నీవు ద్వారము తెరచినందున కృప వెంబడి కృప పొందుచున్నాము. గనుక నీ కుమారునిబట్టి వేడుకొంటున్నాము. హల్లెలూయ. ఆకాశమందు మా తండ్రికి హల్లెలూయ, భూమియందంతటా హల్లెలూయా. ఆకాశవాసుల వల్ల నీకు స్తుతులు. దేవదూతల వల్ల నీకు స్తుతులు. భూమిమీద ఉన్న మావల్లను నీకు స్తుతులు కలుగును గాక! ఆమేన్.**

**వాక్యము కొరకైన ప్రార్థన:-** సృష్టిద్వారా బయలుపడిన ఓ దేవా! నీ కుమారునిద్వారా బయలుపడిన దేవా! త్రియేక దేవుడవైన దేవా! అనుదిన ప్రార్థన, వాక్యపఠన, పాటలలో బయలుపడుచున్న దేవా! నీకు వందనములు. నిన్నుగూర్చి, పరలోకమును గూర్చి తెలుసుకొనేటందుకు వాక్యమిచ్చిన తండ్రీ! స్తోత్రములు. ఈ దినము నీ కుమారుని ఆరోహణము, మా కొరకు వ్రాయించిన తండ్రీ! వందనములు. **మేము నీకు, నీవు మాకు కావలసి ఉన్నాము. నీ వాక్యము మాకు కావలసి యున్నది.** నీకు వందనములు. పండుగలలోనే కాక, అనుదిన వాక్యపండుగలలోను మాకు బయలుపడుమని నీ కుమారునిద్వారా వేడుకొంటున్నాము ఆమేన్. యేసుప్రభువా! నీతిసూర్యుడవైన నీకు అనేక వందనములు. సూర్యునిలోనుండి వచ్చు కిరణములు అపవిత్రమైన స్థలములోకూడ ఎట్లు అనుదినము పడుచున్నవో, మంచి స్థలముమీద ఎట్లు పడుచున్నవో, వివక్షత లేకుండా ఎట్లు పడుచున్నవో, అట్లే కృపాక్షేమమైన నీ వాక్యవివరము ద్వారా నీవాక్య కిరణము మామీద పడేటట్లు కృప దయచేయుము. అవిశ్వాసములో ఉన్నా, దుఃఖస్థితిలో ఉన్నా, పాపస్థితిలో ఉన్నా; అట్టివారి హృదయములలోనే నీ వాక్యోపదేశ కిరణములు పడునట్లు చేయుము. నీ వాక్యసేవ కొరకై ఉంచిన హృదయములో ఆ కిరణములు పడునట్లు చేయుము. ఎవరి

Bible Mission HQ Guntur

హృదయములో ఏమి పనిచేయవలసి ఉన్నదో, అట్లు పనిచేయునట్లు చేయుము. క్రిస్మసు, సిలువమరణ, పునరుత్థాన వర్తమానములు దయచేసినట్లును, నీ భూలోక జీవిత చరిత్ర వర్తమానము దయచేసినట్లును, నీ ఆరోహణ వర్తమానము దయచేయుము. కొండమీద ఆరోహణ వర్తమానము, ఆరోహణ ప్రదర్శన దయచేసినట్లు మాకును దయచేయుము. రావలసిన వారిని రప్పించి, రాకూడని వారిని అడ్డగించుము. రాదలచి ఆటంక-పరచబడినవారిని దీవించుము. ***ఈ ఆరాధనలో ఉన్నవారికి నీ ఆరోహణ స్వరూపము చూపించుము.*** ఆలయములో ఉన్న అందరిని దీవించునట్లు వర్తమానము దయచేయుము. లోకములో ఉన్న అందరికి వర్తమానము పంపించుము. నిన్ను రమ్మన్నా, రమ్మనక పోయినా; నమ్మినా, నమ్మకపోయినా వర్తమానము అందించుము. అపవిత్ర స్థలములు సూర్యకిరణములను కోరవు. అయినను సూర్యుడు పంపుచున్నట్లు పంపుము. ***ఇక్కడున్న అందరికి మనోనిదానము దయచేయుము.*** నీవు వెళ్ళుచుండగా నీ శిష్యులు నీవైపు, ఆకాశమువైపు తేరిచూచినట్లు, మా హృదయములు నీవైపు త్రిప్పుము. మా మనస్సులను ఇంటివైపుగాని; కష్టములు, శోధనలు, చింతలవైపుగాని మరలనీయక, నీవైపు చూచునట్లు; మా విశ్వాసమును నీవైపే త్రిప్పివేయుమని ఆరోహణ రక్షకుడవైన నిన్ను వేడుకొంటున్నాము. ఆమెన్. తండ్రీ, కుమార, పరిశుద్ధాత్మ నామమందు మనము ఈ ఆరోహణ దినమందు ఆరాధన ఆరంభించుచున్నాము.

**ధ్యానవాక్యము :** విశ్వాసులైన, ప్రియులైన వారలారా! ఈ రోజు పండుగలో పండుగ; ఆరోహణములో ఆరోహణము; ఆరాధనలో ఆరాధన; సేవలో సేవ; చందాలో చందా; అలాగే దేవుని వాక్యమంతా మనము అనుభవించవలసినదే. ఆ వరుసలోనివే ఈరోజు వివరించెదను.

**1) ప్రార్థనలో ప్రార్థన:** బోధకుడు ఇక్కడ ప్రార్థన చేయుచుండగా నీవు అక్కడ ప్రార్థన ఆలకిస్తుండగా, నీ మనస్సులో ప్రార్థన ఊరుచుండును. బోధకుడు మా దేశమును కాపాడుమనగా, 'మా దేశమునే కాదు, అన్ని దేశములను కాపాడుమని' నీకు ప్రార్థన వచ్చునుగదా! అదే ప్రార్థనలో ప్రార్థన. ***జబ్బు మనిషినిగూర్చి బోధకుడు ప్రార్థిస్తుండగా, ఇంకొక రోగిని గూర్చి నీ మనస్సులోనికి రావడము పరిశుద్ధాత్ముని పని.*** ఇదికూడ ప్రార్థనలో ప్రార్థనే. నీ ప్రార్థన బోధకునికి తెలియదు గాని ఆయన ప్రార్థన నీకు తెలుసు. అదే ప్రార్థనలో ప్రార్థన. బోధకుని ప్రార్థనలో ఏకీభవించి, అప్పుడప్పుడు నీ మనస్సులోనికి వచ్చేది చేయుటే ప్రార్థనలో ప్రార్థన.

**2) బైబిలులో బైబిలు:** నీవు బైబిలు చదువుచుండగా లేదా వినుచుండగా ఇంకొక సంబంధ వాక్యము జ్ఞాపకమునకు వచ్చుచుండును. ఒక వాక్యము చదువుచుండగా, మనోనిదానము చెడకుండా దాని అన్వయ వాక్యము వచ్చుచుండును. ఉదా: 'ఎక్కడ ఇద్దరు ముగ్గురు నా నామమున కూడియుందురో, అక్కడ నేను ఉన్నాను' అని ప్రభువు చెప్పినది బోధకుడు చదువుచుండగా, అదే సమయమందు యోహాను 14:14లోని వాక్యము, బోధకుడు కాదుగాని ఆత్మతండ్రి నీకు జ్ఞాపకము చేయును. అదే బైబిలులో బైబిలు.

**3) బోధలో బోధ:** బోధకుడు నిలువబడి ప్రసంగించుచుండగా, అనగా పరలోకము వెళ్ళిన పిదప పాపములవల్ల, రోగములవల్ల బాధలేదని బోధించుచుండగా; నీ మనస్సులోనికి 'అక్కడే కాదు ఇక్కడకూడా నీకును, వాటికిని సంబంధము లేకుండా యేసుప్రభువు చేయునని' ఆత్మ అందించును. నీకును, బోధకునికి ఆత్మ అందించు-చుండును. ఒకరికి అందనివి మరొకరికి అందించును. ఇది నేను చెప్పిన బోధలో బోధ. ప్రార్థనలో ప్రార్థన; పఠనములో పఠనము. ఈలాగు క్రొత్త విషయములు ఊరుచుండును.

**4) చందాలో చందా:** గుడిలో చందా వేసేటప్పుడు, తన మనస్సులో ఎవరు క్రొత్తగా ఎక్కువగా చందా వేసిరో, వారినిగూర్చి బోధకుడు వినిపించుచుండగా; నీ మనస్సులో– 'సొమ్ము ఉంటే ఆమెవలె నేనును వేసేదానినిగదా! ప్రభువా నాకెక్కువ సొమ్ము ఇమ్ము. ఇంతకంటే ఎక్కువ ఇస్తాను, అని అనుకొనుటలేదా! సంఘములో వచ్చిన చందా విషయములో, మీ ఆత్మలోనికి వచ్చినదే చందాలో చందా.

**5) ఉపన్యాసములో ఉపన్యాసము:** మీరు వీధిలోనికి వెళ్ళి బోధిస్తుండగా, అందరూ వింటూ ప్రశ్నలు వేస్తుండగా, దానికి జవాబు మీరు ఇచ్చుచుండగా, 'ఆ జవాబుకాదు, ఇంకొక జవాబు' అని మనసులోనికి వచ్చును. ఇంకొకరు మోటు ప్రశ్నవేయగా అయ్యో! అది ఎవరు చెప్పగలరు అని అందరూ అనుకొనుచుండగా, నీ మనసులో 'నన్ను చెప్పమంటే చెప్తుతాను' అనుకుంటావు. అదే ఉపన్యాసములో ఉపన్యాసము.

**6) సేవలో సేవ:** *'నాకే ధనము ఉంటే లోకమంతా తిరిగి అందరికి ప్రకటిస్తానని'* నీ మనసులోనికి రావడమే సేవలో సేవ. ఈ ప్రకారముగా క్రైస్తవుని జీవితములో అనేక అంశములు ఉన్నవి. అంశములలో అంశములు చాలా ఉన్నవి.

**7) ఆరోహణములో ఆరోహణము:** యేసుప్రభువు ఆరోహణమాయెను. రేపు సంఘము ఆరోహణమగును. నేను ఆ రాకడలో పాల్గొని, నేనును ఆరోహణమగుదును. గుర్తులు జరుగుచున్నవి. బోధకులు సిద్ధపడమంటున్నారు. అలాగే నీ మనసులో రాకడ జ్ఞాపకము వస్తున్నది. ఇదే ఆరోహణములో ఆరోహణము. ఆరోహణ కథలో ఈ సంగతి ఉన్నది. ఇద్దరు వ్యక్తులు నిలువబడి, 11 మంది శిష్యులతో ఆయన తిరిగి సంఘాన్ని తీసికొని వెళ్ళుటకు వస్తాడని చెప్పిరి. అదే ప్రభువుకూడ చెప్పెను. ఇదే ఆరోహణములో ఆరోహణము.

**8) రాకడలో రాకడ:** యేసుప్రభువు ప్రాణముతో వెళ్ళినట్లు, మరణముతో సంబంధము లేకుండా వెళ్ళినట్లు; మనమును వెళ్ళతాము. ఎంత ధన్యత! అలాగే ఆయన ఆరోహణములో మన ఆరోహణమును; ఆయన రాకడలో మన పోకడ; ఆయన పునరుత్థానములో మన పునరుత్థానమును ఇమిడియున్నవి.

**9) పునరుత్థానములో పునరుత్థానము:** మీరు చనిపోయినవారై ఉన్నారు. అయినను ప్రభువుతో లేచినవారై ఉన్నారని పౌలు వ్రాసెను. మనము చనిపోయినవారమై ఉండగా, క్రీస్తు పునరుత్థానమువలన లేచినవారము. పునరుత్థానానికి ఆరోహణానికి సంబంధము ఉన్నది. ***పునరుత్థానము అనగా సమాధిలోనుండి లేచుట. ఆరోహణము అనగా భూమిమీద ఉన్న సర్వ కష్టాలలో నుండి లేచుట. "అనుదినము పాపములలో నుండి పునరుత్థానమగుచుంటే ఎప్పుడో ఒకప్పుడు ఆరోహణమగుదుము."*** ఈలాగు మనము ఆరోహణమునకు సిద్ధపడుదుము. అట్టి శిష్యుల మనోనిదానము మనకును ఉండునుగాక. శిష్యులు, ఆయన సిలువ మరణములో ఏడ్చిరి. అయితే, పునరుత్థానమప్పుడు, ఆరోహణమప్పుడు ఏడువక, మేడగదిలో సంతోషముతో ఆత్మకొరకు కనిపెట్టుచుండిరి. మనమును ఏడువక, సంతోషించే ఒక గడియ వస్తున్నది. సిద్ధముగా ఉన్నప్పుడు మన ఆరోహణము వచ్చును.

**10) గొలుసులో గొలుసు:** క్రిస్మస్‌కు మనము రంగు కాగితములు అతికించునపుడు, మెరుపు తీగెలు అల్లునపుడును, ఒక దానిలో ఒకటి అతికించినట్లు, మనము ప్రభువును తెలుసుకొన్న నిమిషము మొదలు, పరలోకము వెళ్ళే నిమిషము వరకు ఒక గొలుసు. ప్రార్థన, బైబిలు చదువుట మరొక గొలుసు. సేవా పరిచర్య ఇంకొక గొలుసు. ఇదే గొలుసులో గొలుసు.

**11) అనుభవములో అనుభవము:–** ఇదికూడ ఒక గొలుసే. అలాగే బ్రతుకంతా గొలుసే. ***ఆయన నిర్విచారముగా బ్రతికి జయశీలుడై పరలోకము వెళ్ళినట్లు మనమును***

**వెళ్ళుదుము.** కొందరు మృతులై పరలోకము వెళ్ళతారు. కొందరు సజీవులై వెళ్ళతారు. అయ్యో వారికి మృతులగుంపు ఎందుకు? వీరికి ఇది ఎందుకు! అనకూడదు. అందరము ఒక్క వరుసలోనే ఉంటాము. ఆయన మన కన్నీళ్ళు తుడుచుననేది ఎంతగొప్ప ధన్యతగును![1]

## ఆరోహణ చరిత్ర

1) చేర్చుకొనబడుట, 2) సింహాసనముదగ్గరకు వెళ్ళుట, (3) ప్రత్యేకింపబడుట. 4) ఆరోహణమగుట 5) మేఘము ఆయనను కొనిపోవుట. ఆయన (1) ప్రత్యేకింపబడుట, (2) ఆరోహణమగుట, (3) కొనిపోబడుట, (4) చేర్చుకొనబడుట, (5) సింహాసనమెక్కుట జరిగెను.

1. ఒక చరిత్ర యేసుప్రభువు పరలోకమునకు కొనిపోబడిన చరిత్ర. 2. భూమిమీద ఆయన సంఘము ఉండిపోయిన చరిత్ర.

**1. ప్రత్యేకింపబడుట:-** యేసుప్రభువు ఆరోహణ చరిత్రలో 5 మెట్లు గలవు. భూమిమీద ఉన్న సంఘమునుండి ఆయన ప్రత్యేకింపబడెను. 11మంది శిష్యులనుండి, ఆయనను ఎరిగినవారి దగ్గరనుండి, ఆయన విశ్వాసుల దగ్గరనుండి, ఆయన ప్రత్యేకింపబడెను. మనుష్యులను రక్షించుటకు ఆయన ఏయే పనులు చేయనిశ్చయించు-కొన్నాడో, ఆ పనులలో ఇది ఒక ముఖ్యమైన పని. రక్షించేవాడు, ఎక్కడనుండవలెను? వారి దగ్గరనే ఉండవలెను. గాని ఈ చరిత్రలో ఆయన దూరముగా ఉండుట అవసరము. రక్షణ చరిత్రలో ఆయన దూరమవుట, ప్రత్యేకింపబడుట అవసరము. ఎమ్మాయి శిష్యులతో వారి దగ్గర ఆయన రొట్టె విరుచుచుండగా, శిష్యులు ఆయనను యేసుప్రభువని గ్రహించిరి గాని అప్పుడు ప్రభువు వారి ఎదుట ఉండలేదు. ఆయన అదృశ్యుడయ్యెను. మనము ప్రార్థనలో ఉన్నప్పుడు ప్రభువు దర్శనములో కనబడి మాయమైపోతే మనకెంతో విచారము. ప్రభువు రక్షణ చరిత్రలో ఇట్టిపనులుకూడ చేస్తారు. ఈలాగు ప్రత్యేకింపబడుట అనునది, క్రైస్తవ అనుభవములో అనగా రక్షణ చరిత్రలో ఒక ముఖ్య విషయము. దేవుడెప్పుడును కనబడకూడదు. అప్పుడప్పుడు కనబడవలెను. ఎందుకనగా, ఆత్మలో పని చేయుటకు గాని చోద్యమునకు కాదు. మనము ప్రార్థనలో ఉండగా ఆయన మనకు సంతోషము కలిగించును. అదికూడ ఆయన ప్రత్యక్షతయే. ఆయన కొందరిని ఒక రీతిగా, మరికొందరిని ఇంకొక రీతిగా నడిపించును. ఇట్టివాటినిచూచి మనము ఆశ్చర్యపడకూడదు. విశ్వాసము కుదరకపోయినా, గందరగోళమువలన కుదరక పోయిననూ, ప్రార్థన కుదరకపోయిననూ, ప్రభువు కనబడకపోయిననూ, సంతోషించండి'

అని పౌలు వ్రాయుచున్నాడు. గనుక మీకు కలుగుచున్న శ్రమను చూచి ఆశ్చర్యపడవద్దు. యేసుప్రభువు ప్రత్యేకింపబడినప్పుడు శిష్యులు మహానందముతో వెళ్ళిరి. **విశ్వాసులు విచారపడరు. దుఃఖించరు.** ఒక్కొక్కప్పుడు ప్రభువు పిశాచి పనులు జరగనిచ్చును. చివరకు ఆయన ఇవ్వవలసిన మహిమ ఇచ్చును. యేసుప్రభువు చేతులెత్తి శిష్యులను దీవించెను. దీవించి, దీవించి, వారికి ఎడమైపోయెను. ఆరోహణమంటే వారిలోనుండి ప్రత్యేకింపబడి పైకి వెళ్ళిపోయెను.

**2. ఆరోహణము:-** 11మందే యేసుప్రభువు ఆరోహణమైనప్పుడు చూచినారు. ఆరోహణమనగా ఈలోకములో ఉండే ఆయన పరలోకమునకు ప్రయాణమగుట. ఆయన భూమిమీద ఉన్నప్పటికిని, ఆయన ప్రత్యేకముగానే ఉండెను. పాపులతో కలసి ఆయన ఉన్నను, ఆయన పాపిగా ఉండలేదు. పరిశుద్ధుడుగానే ఉండెను. ఆయన శరీరముతో ఉండి, భూమిమీద చేయవలసిన పనియంతయు పూర్తిచేసెను. భూలోకమును విడిచిపెట్టుట, పరలోకమునకు వెళ్ళుట ఆరోహణమనబడును. ఆయన జన్మచరిత్ర మొదలు, పునరుత్థానమువరకు ఆయన ప్రత్యేకముగానే ఉన్నాడు గాని ఇప్పుడు ఆయన తన్నుతాను ప్రత్యేకించుకొనెను గనుక వేరుగానుండవలెను. ఆయన పునరుత్థానమై ఏమిచేసెను? 40 దినములు ఆయన గలిలయ దెకపొలి మొ॥లగు ప్రదేశమందలి విశ్వాసులను దర్శించుచుండెను. ***వీరందరిని ఎట్లు దర్శించెను? ఆరోహణమై దర్శించెను.*** ఈ 40 దినములు ఆయన ఆరోహణమగుచూనే వచ్చెను. ***ఆరోహణము ప్రతి దినము జరుగవలెను.*** మనము అన్ని స్థితులలోనుండి ఆరోహణము కావలెను. ఇది భూలోక ఆరోహణము. గోతిలోకి దిగి పైకి ఎక్కుట. ఇది అవరారోహణము. ఇదియు మనము కలిగియుండవలెను. పడిన వెంటనే లేవలెను. (1) యేసుప్రభువు తల్లి గర్భమున ప్రవేశించినది మొదలు ఆయన మరణము వరకు దీనస్థితి. (2) ఆయన పునరుత్థానము మొదలుకొని ఆరోహణము వరకు మహిమస్థితి. పండితులు ఈ రెండు భాగములుగా ఆయన చరిత్రను భాగించిరి. 1) దీనస్థితి- ఆవరోహణము. 2) మహిమస్థితి - ఆరోహణము.

**1) దీనస్థితి:-** ఆకలికి, నిద్రకు, తల్లికి, శత్రువులకు, మరణమునకు మొ॥లగు పరిస్థితులన్నిటికిని లోబడినాడు.

**2) మహిమస్థితి:-** దేనికిని లోబడడు. సృష్టిలో ఎండకుగాని, గాలికిగాని మొ॥లగు వాటికి లోబడనట్టి స్థితి, దేవుడు మనకును ఇచ్చును. ఇక ఎప్పటికిని పడడమనేది ఉండదు. సంఘముకూడా యేసుప్రభువువలె ప్రత్యేకింపబడవలెను, ఆరోహణము కావలెను.

**3) కొనిపోబడుట:-** యేసుప్రభువు నరలోకము విడచి పరలోకమునకు వెళ్ళిపోవలెను. గనుక ఆయనను ఎదుర్కొనుటకు పరలోక వాస్తవ్యులు రావలెను. మొదట మేఘము వచ్చెను. ఏలీయా వెళ్ళినప్పుడు అగ్ని రధములువచ్చెను. ప్రభువును తీసికొని వెళ్ళుటకు మహిమ మేఘము వచ్చెను. మనము రేపు పరలోకమునకు వెళ్ళునప్పుడు మనలను తీసికొని వెళ్ళుటకు మహిమ మేఘము వచ్చును. ప్రత్యేకింపబడుట అనగా ఒకరివల్ల ప్రత్యేకింపబడుట కాదు. విశ్వాసులు, అవిశ్వాసుల నుండి ప్రత్యేకింపబడవలెను. అంతమాత్రమేకాదుగాని విశ్వాసులు, విశ్వాసులనుండికూడ ప్రత్యేకింపబడవలెను.

**4. చేర్చుకొనబడుట:-** ఆకాశమును, మేఘమండలమును, సూర్య చంద్ర నక్షత్రములును దాటి, ఎన్నోకోట్ల మైళ్ళుదాటి, దూతలలోకమును దాటి, పరలోకమునకు వెళ్ళుట. పరలోకములో చేర్చుకొనబడుట.

అనగా Welcome, Receive. సందేహము చాలా చెడ్డది. "నేను ప్రభువు బిడ్డను, ఆయన నన్ను రక్షించినాడు" అని ఎప్పుడునూ సంతోషించవలెను గాని 'నేను పాపిని' అనకూడదు. *'ప్రయాసపడి భారము .......నాయొద్దకు రండి'* అని *యేసుప్రభువు* చెప్పినప్పుడే మోక్షద్వారము తెరువబడెను.

**5. దేవుని కుడిపార్శ్వమున, సింహాసనమున కూర్చుండుట:-** మనము ఇక్కడే ప్రత్యేకింపబడుట, ఆరోహణమగుట, కొనిపోబడుట, చేర్చుకొనబడుట జరుగవలెను. ఇక్కడే మనము ఆ అలవాటు చేసికొంటే, మనము తప్పక సింహాసనము ఎక్కుదుము. తప్పకుండా ఇవన్ని అనుభవించగలము. ***ప్రభువు ఇవన్ని చేసినాడు గనుక ఇవన్ని చేయుట మనకు చాలా సులువు.*** ఆ మహా గొప్పభాగ్యము విశ్వాసులు అందరికిని కలుగునుగాక! ఆమేన్[2].

---

**1. 19.5.1955వ సం॥లో దేవదాసు అయ్యగారు బేతేలుగృహములో చేసిన ప్రసంగము.**

**2. 2.5.1946వ సం॥లో దేవదాసు అయ్యగారు చేసిన ప్రసంగము.**

## ఆత్మ కుమ్మరింపు కూటములలోని మొదటిదినము - శుక్రవారము

## ఆత్మ కుమ్మరింపు వరుసలు

**సలహా:-** ఎవరూ కదలవద్దు, మెదలవద్దు. ముగింపువరకు ఈ స్థలము విడువవద్దు, శబ్ధము వదలవద్దు. పరలోకమునుండి వచ్చిన శబ్ధము తప్ప నరలోకము నుండి వచ్చిన శబ్ధము లోపలవద్దు, వెలుపలవద్దు.

**1వ ప్రార్థన:-** అనాది దేవుడవైన తండ్రీ! నీకు వందనములు. అనంత దేవుడవైన తండ్రీ! నీకు నమస్కారములు. తండ్రివిగాను, కుమారుడవుగాను, పరిశుద్ధాత్ముడవుగాను, త్రియేక దేవుడవుగాను మాకు బయలుపడిన తండ్రీ! నీకు అనేక స్తోత్రములు. ఆకాశమును సృష్టించుటద్వారా బైలుపడిన తండ్రీ! స్తోత్రములు. భూమిని కలుగజేసినందువలన దానిద్వారా బైలుపడిన తండ్రీ! స్తోత్రములు. నీ వాక్యమును వ్రాసి దానివలన బైలుపడిన తండ్రీ! ముఖ్యముగా బెత్లేహేములోనుండి మానవ జన్మములో బైలుపడిన తండ్రీ! స్తోత్రములు. అటుతర్వాత పెంతెకొస్తు సమయమందున నీ సంఘముమీద పరిశుద్ధాత్ముడవుగా కుమ్మరింపై బైలుపడిన తండ్రీ! నీకనేక సంస్తుతులు.

నీవు పరిశుద్ధుడవు. అయితే మేము అపరిశుద్ధులము. అయినప్పటికిని నీవు మమ్మును ఆరాధించుటకును, సేవించుటకును ఏర్పర్చుకొన్నందులకై నీకు అనేక ప్రణుతులు. మేము అయోగ్యులము, శిక్షకు మాత్రమే పాత్రులము. నీ వాక్యగ్రంథము చదువుటకు మేము తగము. అది బంగారు వాక్యముగల పవిత్ర గ్రంథము. మేము మంటివారము. మేము దానిని ముట్టుకొనకూడదు. కాని నీవు మాకు ఇచ్చినందువలన మా ఇంటిలో బల్లమీద పెట్టుచున్నాము. మాపెట్టెలలో పెట్టుకొంటున్నాము. చేతులలో ఉంచుకొనుచూ, మంచములమీద పెట్టుచూ, ఏలాగుపడితే అలాగు వాడుకొనుచున్నాము. చదువుకొను-చున్నాము. ఇంత గొప్ప ధన్యత దయచేసినందుకు నమస్కారములు.

ఓ దేవా! ఓ రక్షకా! ఓ సృష్టికర్తా! ఈవేళ మేము ఆత్మకుమ్మరింపు పాఠము చదువుకొని దాని గురించి కొన్ని మాటలు మాట్లాడుకొని, గొప్ప మేలు పొందవలెనని వచ్చియున్నాము. మేము రాగల కృప మాకు కలిగించినందుకు అనేక నమస్కారములు. మా శరీరమును పవిత్రపరచుము. మా శరీరమందున్న సమస్తమును నీ నామఘనత నిమిత్తము శుద్ధీకరించుము. మా జ్ఞానమును వెలిగించుము. ***మోషేకు గొప్ప విధేయత కలదని వ్రాయించినావు. అట్టి విధేయత మా మనస్సాక్షికికూడా దయచేసి అంగీకరించుము.***

గతకాలము యొక్కయు, నేటికాలము యొక్కయు మా జీవితకాలమును దీవించుము. ఇకముందుకు మేము జీవింపవలసిన జీవితమునుకూడా దీవించుము. ఈ దినమందు దేవదూతల మధ్యను, పరలోకమందున్న వాస్తవ్యుల మధ్యను, భూలోకమందున్న విశ్వాసుల మధ్యను సంతోషము కలిగించుము. వారుకూడా మాతో ఏకీభవించే గొప్పతనము దయచేయుము. ఇప్పుడే కూటములో ఉన్న ఒక్కొక్కరిని వారివారి అక్కరకొలది దీవించుము. ఆమేన్.

బాల్యమునుండి మీకు పెంతెకొస్తు కథ, ఆత్మ కుమ్మరింపు కథ, బాగా తెలిసినను ఏమియు తెలియనట్లు చెబుతాను. నేను చెప్పునప్పుడు అది మాకు తెలిసినదే అని అతిశయింపక సంతోషించండి. ***మీలో ఎవరికైనా 1) అనుమానముకాని, 2) విచారముకాని, 3) దురితేచ్ఛకాని ఉన్నయెడల మీరు ఇక్కడ ఉన్నను లేనివారితో సమానము.*** ఈ మూడు లేకుండా మనోనిదానముతో ఉండండి.

**మొదటి వరుస :** 1) పరిశుద్ధాత్మ కుమ్మరింపు వేరు, 2) పరిశుద్ధాత్మ నివాసము వేరు, 3) పరిశుద్ధాత్మ కొలత వేరు, 4) పరిశుద్ధాత్మ వశము వేరు. ఈ నాలుగును నేర్చుకొన్న ఈ వరుసలో మీరు ఉన్నారా?

**రెండవ వరుస :** 1) ఊదుట వేరు, 2) వ్రాలుట వేరు. మొదటి వరుసలో కుమ్మరింపు అన్నాము. అది ఒక ప్రత్యేకమైన సమయము. పరిశుద్ధాత్మను కోరుము....అనుపాట. ఒక బిందె ఉన్నది. దానినిండా నీళ్ళున్నవి. ఆ బిందెడు నీళ్ళలోనుండి చెంబుడు నీళ్ళు తీసి ఒకరి శిరస్సుమీద పోసినాము. వారు ఇంకొక చెంబుడు తీసి, పోయుమనగా, మరొక చెంబుడు పోసి ఇంకనూ చూస్తున్నందున బిందెడూ దిమ్మరించాము. ***అదే కుమ్మరింపు.*** ఆదాము మొదలుకొని పెంతెకొస్తు దినమువరకు ఎన్ని సం॥లు ఉన్నవో, వాటికి అనగా అన్ని సం॥లకు ఒక గీత గీస్తున్నాను. ఆ గీతమీద పరిశుద్ధాత్మ లేడా? ఉన్నారు. 1) పూర్వకాల ప్రవక్తలు, 2) భక్తులు ఆత్మలేకుండా ఉన్నారా! లూథరుమిషను వారు అదే అడుగుచున్నారు. అడుగవలసిందే. (1) హేబెలు ఆత్మ సహాయము లేకపోతే బలి ఇస్తాడా? (2) హనోకుకు ఆత్మ సహాయము లేకపోతే ఆరోహణము కాగలడా? (3) ఆత్మ సహాయము లేకపోతే అగ్ని రథములమీద ఏలీయా ఎట్లు వెళ్ళ గలిగెను? (4) ఆత్మ సహాయము లేకపోతే, ప్రవక్తలు గ్రంథములెట్లు వ్రాసిరి?

ఆదాము మొదలు పెంతెకొస్తు వరకు 1) ఆత్మపని, 2) ఆత్మ సహాయము, 3) ఆత్మ ఉద్రేకము, 4) ఆత్మ జ్ఞానము ఉన్నది. ఆ కాల భక్తులు వాటిని కలిగియున్నారు. ***అప్పటివారు ఆత్మను కలిగియున్నట్టుగాకాక, ఇక ముందుకు ఆత్మ కుమ్మరింపే కలిగించుకొనే ఒక సంఘము బయలుదేరనై ఉన్నదని యోవేలుద్వారా దేవుడు ప్రవచింప చేసినందున (యోవేలు 2:28,29),*** పాతనిబంధన భక్తులు ఆ కుమ్మరింపుకొరకు కనిపెట్టిరి. చెంబుతో నీళ్ళు పోసినట్లుగా కాదుగానీ, బిందెతో దిమ్మరించినట్లు కుమ్మరింపు. యోవేలులో కుమారులను, కుమార్తెలను, వృద్ధులను అని ఉన్నది. అనగా కుటుంబాన్ని విడువలేదు. వయస్సుమళ్ళినవారిని, వయస్సుగలవారిని ఎవరినీ విడిచిపెట్టలేదు. ముసలివారు అనగా "నాకు ఇంకేమి ఇస్తారు, నా కాలమంతా అయిపోయినదని" అనుమానించకుండా ఉండుటకు వారికికూడా ఇస్తానని ఆదరణ చెప్పెను. 1) కుమార్తెలకు, 2) పనివారికి, 3) పనికత్తెలకు కుమ్మరిస్తానన్నారు. ఇప్పుడు, ఈ పని భూమిమీద జరుగుచున్నది. దీనిని తర్వాత ఆలోచించెదము. పెంతెకొస్తునాడు అందరికి కుమ్మరింపు రాలేదు. యూదులకే వచ్చినది. అన్యులు మిగిలిపోయిరి. వీరికి తర్వాత జరుగును. యూదులనుచూచి అన్యులును అడుగుతారు. గనుక ప్రభువు వారికిని దయచేస్తారు.

1. ఆదాము మొదలుకొని పెంతెకొస్తు వరకు. అపో.కార్య. 2:1-4. మధ్యకాలములో చెంబుతో నీళ్ళు పోసినట్లు ఎందరికి ఎంతవరకు కావలెనో అంత వరకు ఇచ్చిరి కాని పెంతెకొస్తునాడు కుమ్మరింపు ఇచ్చిరి. ***ఆలాగే కోరినవారందరికి రాకడకాలం వరకు కుమ్మరిస్తారు.*** రేపో, మాపో ప్రభువు వచ్చి కోరిన వారందరికి కుమ్మరిస్తారు. రెండవ రాకడలో సంఘమే వెళ్ళిపోవును. మిగిలిన వారికి ఏడు సం॥లు శ్రమ. ఇప్పుడు ఉన్నవారుకూడ "ప్రభువా 1) పాత నిబంధన కాలములో భక్తులకును, 2) పెంతెకొస్తునాడు యూదులకును, 3) రాకడకాలములో అందరికినీ ఎక్కడపడితే అక్కడ ఇస్తావు" అని అడిగితే; అయ్యా! ఇప్పుడు శ్రమకాలములో ఉన్నామని ఆశతో అడిగినట్లయితే, ప్రభువు తన ఆత్మను ఇవ్వగా ఘొల్లుమని ఏడ్చెదరు. ప్రధమ పుత్రుడు చనిపోతే ఏలాగు ఏడ్చెదరో అలాగు ఏడ్చెదరు. ***ఎవరి హృదయములు చెకుముకి రాయివలె ఉండునో, దేవుడు ఆత్మనివ్వగా వారి హృదయములు మెత్తబడును.*** అంత్యదినము అని అనక, అంత్యదినములలో అని చెప్పిరి. అవే ఈ నాలుగు కాలాలు, వాటి కుమ్మరింపులు. దేవుడు అన్ని కాలములలోనూ తన ఆత్మను ఇచ్చెను. భక్తులకేకాదు. కఠినమైన పాపులకుకూడా ఇస్తారు. ప్రపంచ చరిత్ర నాలుగు కాలాలుగా ఉన్నది.

గనుక నాలుగు చరిత్రలుగా అన్ని వయస్సులలో ఉన్నవారికి ఆయన తన ఆత్మను ఇస్తారు. కుమారులని పిల్లలను, వారు చిన్నవారుగా ఉన్నప్పుడు అంటూ ఉంటాము గనుక నీ చిన్నపిల్లలకు ఆత్మను ఇస్తాననే మర్మము యోవేలు 2:28లో ఉన్నది. **అక్కరలేని వారిచేతకూడ కావాలని అనిపించి ఇస్తారు.** ఇది దేవుని వాక్యములో చాలా వివరముగా ఉన్నది గనుక వాక్యాన్ని లోకువ కట్టకుండా, నీ చిత్తమంటే ఆత్మను ఇస్తారు.

1) 'ఎవరిని నరకములోనికి వెళ్ళనీయవద్దు' అనేది నా ప్రార్థనైయున్నది. అయితే వాక్యములో నిత్య నరకములోనికి వెళ్ళుదురని ఉన్నది. గాని ఆలాగు జరుగకూడదు. 2) నీవు శక్తి కలవాడవు. అనగా భూమిని, ఆకాశమును కలుగచేసిన శక్తిగలవాడవైనందున; తప్పిపోయిన దూతకు, వాని అనుచరులకు క్షమాపణ ఇచ్చి రక్షించుమని ప్రార్థించుట అవసరమే. 3) నరకమే లేకుండా చేయుమని ప్రార్థించుటచే దేవుడు నాశనము చేయవలసినది కాని ఆలాగు చేయలేదు. ఎందుకనగా వాక్యమును తెలిసికొని, వాక్య విరోధముగా ప్రార్థనచేస్తే, సొదొమావలె నాశనము కావలసినదే గాని ఆయన ప్రేమ అట్లు కానీయలేదు. దేవుడు కాపాడారు. అయితే, (1) **దేవుడు ఎవరిని విడిచిపెట్టడు. *(2) కాని మనిషే దేవుని విడిచిపెడతాడు. ఈ రెండునూ బైబిలులోనుండి లాగిన కథలే. గనుక ప్రభువును ఎవరూ విడువవద్దు.*** ఎందుకనగా ఆయన మనలను విడిచిపెట్టలేదు. 'అయ్యగారు చిన్నతనములో తెలుగు కాంపోజిషన్‌లో చివర యేసునామము' అని వ్రాసేవారట. 1) ఆత్మను పొందండి, 2) సేవ బాగా చేయండి, 3) బైబిలు బాగా చదివి, ప్రార్థించండి. ఆత్మను పొందిన సౌలు తప్పిపోలేదా? యూదా, అననీయ, సప్పీరాలు తప్పిపోలేదా? ఇంగర్‌సాల్ తప్పిపోలేదా? అట్టి గొప్పగొప్పవారే తప్పిపోగా మేము ఎంతమాత్రపువారము? మేమునూ తప్పిపోవచ్చేమో కదా! అని అనుకోవద్దు. వారిని హేడెస్సులోపెట్టి, ఆఖరు ఛాన్సు ఇచ్చి, ఆయన రక్షిస్తాడు. అక్కడకూడా మారకపోతే ఏంచేస్తాం? ప్రియులారా! ఆత్మ కుమ్మరింపు కొరకు ప్రార్థన చేయండి. ఛార్లెస్ బ్రాడ్లీ. ఈయన ఒక బిషప్. ఈయన అందరి దగ్గరకు వెళ్ళి కుమ్మరింపు నిజమని వాదించినాడు. ఎవరూ ఆయనను ఓడ గొట్టలేకపోయిరి. గనుక అందరూ ఆత్మను పొందండి.

**2వ భాగము:-** ప్రభువు ఊదుట వేరు, కుమ్మరింపు వేరు. కుమ్మరింపు సమయమందు ఆయనే వారిమీద వ్రాలినారు. ఊదుట అనగా 120మందిని, వారి

జీవితకాలమును జీవముతో నింపుట కొరకు ఊదెను. వ్రాలుట అనగా సేవ నిమిత్తమై కుమ్మరింపుగా దిగివచ్చుట. వారి జీవితకాలమును ఊపిరితో నింపునట్లు కుమ్మరింపుతో సేవకొరకు వారిని నింపెను. ఇంటిలో భక్తిగా ఉండుటకు ఊదెను. కుమ్మరింపు బయటవారికి సువార్త ప్రకటించుట కొరకు. **వాక్యము నమ్మినా సరే, నమ్మకపోయినా సరే, చెప్పుటకు కుమ్మరింపు.** ఇంటింటికి వెళ్ళి రక్షణ పొందండని చెప్పండి. **చేతకాని వారుకూడా వెళ్ళి చెప్పండి.** 15 నిమిషాలలో చెప్పండి. ఏమని అనగా దేవుడు మన కొరకు ఏమి చేసెనో, అది చెప్పండి. మన రక్షణార్ధమై చనిపోయెనని చెప్పండి. ఆకాశము, భూమి దేవదూతలను కలుగజేసి, ఆయనయే మనిషై వచ్చి, యేసుక్రీస్తు అనుపేరు పెట్టుకొని బోధించెను. శ్రమపడి రక్తము కార్చి, ప్రాణము పెట్టి సమాధి చేయబడి, లేచి పరలోకానికి వెళ్ళి రేపో మాపో వచ్చి ఆయనకిష్టమైన వారిని తీసికొని వెళ్ళును అని చెప్పండి. ఇష్టమైతే నమ్మండి లేకపోతే ఊరుకొనండి అని చెప్పండి. మీకు 1) దేవుడు కనబడి, 2) దేవుడు మాట్లాడి, 3) దేవుడు జవాబు ఇచ్చి, 4) ప్రభు భోజనము ఇచ్చును.

ఇందుకు పాదుర్లు అంటున్నారు: 'మా పాదిరి పని వదిలించుకొనవలసినదేనా' అని అంటున్నారు. దానికి జవాబు: 'నీ పనిని స్థిరపరచుటకు ప్రభువు ఇచ్చుచున్నారు'.

5. ఆయన నీ ఎదుట చేయి చాపుతాడు. అనగా ఆకాశము, భూమి, దేవదూతలు, గ్రంథము, కుమారుని, ఆత్మను ఇచ్చి నీవు నాకు ఏమి ఇస్తున్నావు అంటున్నాడు. "నీకు ఏమి ఇవ్వగలము" అని ఇప్పటికి ఆత్మను పొందినవారు ఉన్నారు. గనుక పొందనివారికి వస్తాది. మోకరించి ప్రార్థించండి. కదిలింపు వస్తుంది. ***కదిలింపే రుజువు. తర్వాత కుమ్మరింపు వచ్చును.*** క్రొత్తగా దర్శనవరము కొంతమందికి వచ్చింది.

అట్టి అనుభవములతో ప్రభువు నేడు మిమ్మును అలంకరించునుగాక! ఆమేన్[1].

---

**1. 28.8.58వ సం॥లో దేవదాసు అయ్యగారు బేతేలు గృహములో చేసిన ప్రసంగము.**

# ఆత్మకుమ్మరింపు కూటములలోని రెండవ దినము-శనివారము

## పరిశుద్ధాత్మ నిండి ఉండుట

అపో.కార్య. 2:1-36.



**ప్రార్థన:- మా ప్రియుడవైన తండ్రీ, ఆత్మ తండ్రీ! మీకు వందనములు. మీరు లేని స్థలము లేదు, మీ జీవములేని మనిషిలేడు. ఈలాగు నీ సృష్టిని, మమ్ములను ఆవరించుకొన్న తండ్రీ! వందనములు. మీరు మాలో ఏ స్థితిలో ఉన్నారో, మా అనుభవమునకు స్పష్టముగా తెలియునట్లు, నేటిదిన నీ వర్తమానమిమ్మని యేసు నామమున వందించుచున్నాము. ఆమేన్.**

'పెంతెకొస్తు' అనుమాటకు అర్థమేమనగా 50 దినములు లేక 7 వారముల పండుగ. 7 వారములు అనగా పండుగ దినముతో కలుపుకొని 50 దినములు. యూదుల పెంతెకొస్తు పండుగ అనగా వారు దేవునికి ఇచ్చుట. మన పెంతెకొస్తు పండుగ అనగా మనము పుచ్చుకొనుట అనగా ఆత్మను పొందుట. 1. సృష్టి, 2. కుమారుడు, 3. బైబిలు, 4. పరిశుద్ధాత్మ; ఇవన్నీ ఆయన మనకు ఇచ్చినవై ఉన్నవి. ఆయన ఎల్లప్పుడు ఇచ్చేవాడైయున్నాడు. ఈ దినము మనము పరిశుద్ధాత్మను పొందవలెను. అప్పుడు ఈ దినము పండుగ అవుతుంది. పరిశుద్ధాత్మను పొందితే దేవునిని పొందినట్టే.

పెంతెకొస్తు పండుగ అనగా పరిశుద్ధాత్మ పండుగ, పరిశుద్ధాత్మ పండుగ, పరిశుద్ధాత్మ పండుగ. అనగా తండ్రి పరిశుద్ధాత్ముడే, కుమారుడు పరిశుద్ధాత్ముడే, పరిశుద్ధాత్మ పరిశుద్ధాత్ముడే. ***త్రియేక దేవుడు పరిశుద్ధాత్ముడే గనుక. ప్రతి ఆదివారము మనకు పరిశుద్ధాత్మ పండుగే.*** క్రిస్టమస్ పండుగ రోజున పరిశుద్ధాత్ముడైన తండ్రి పండుగ. మంచి శుక్రవారమున పరిశుద్ధాత్ముడైన కుమారుని పండుగ. ఈవేళ పరిశుద్ధాత్మ పండుగ. వచ్చే ఆదివారము త్రిత్వపండుగ అనగా పరిశుద్ధాత్ముడైన తండ్రియొక్కయు, పరిశుద్ధాత్ముడైన కుమారునియొక్కయు, పరిశుద్ధాత్ముడైన పరిశుద్ధాత్మయొక్కయు పండుగ. అక్కడనుండి క్రిస్టమస్ వరకు 27 ఆదివారములు ఉన్నవి. అడ్వెంటువరకు ప్రతి సం॥ము 27 ఆదివారములు రావు. ఎందుకంటే చంద్రబింబమునుబట్టి (పౌర్ణమి) అవి తక్కువ కావచ్చునుగాని 27కంటె ఎక్కువ రాలేవు.

ఈవేళ పరిశుద్ధాత్మ తండ్రియొక్క పండుగ. అయితే అపో.కార్యములలో నేటి పండుగ వివరముగా (2వ అధ్యా॥లో) వ్యాఖ్యానముకాక మిక్కిలి స్పష్టముగా

Bible Mission HQ Guntur

యున్నది. పాతనిబంధనలోని ప్రవక్తలయొక్క గ్రంథములు ఇంత స్పష్టముగాలేవు. నాలుగు సువార్తలలో క్రీస్తు చరిత్ర ఎంత స్పష్టముగా ఉన్నదో, ఈ 2వ అధ్యాయములో పరిశుద్ధాత్మ పండుగ అంత స్పష్టముగా ఉన్నది. ఈ రెండవ అధ్యాయమంతయు తేటగా ఉన్నది. అపో.కార్య 2వ అధ్యాయము దాటితే, బైబిలు చివరి గ్రంథములో కేవలము మర్మములే ఉన్నవి. అందులోనైతే కష్టము ఉన్నదిగాని సువార్తలయొక్కయు, అపోస్తలుల కార్యములయొక్కయు వివరము చిన్నపిల్లలకు కూడా తెలియును. ఇప్పుడు పరిశుద్ధాత్మను గురించి కొన్ని సంగతులు వినండి. ఈ పరిశుద్ధాత్మను గురించి కొన్ని సంగతులు విమలాత్మ ప్రోక్షణలో వ్రాసితిని. అపో.కార్య. 2వ అధ్యాయములో వేగముగా వీచుగాలి ఆ ఇల్లంతయు నిండెను అని వ్రాయబడినది. ఇల్లంతా నిండితే ఇంట్లోని మనుష్యులలో నిండదా? అయితే కొంతమంది పరిశుద్ధాత్మ పొందుటకు ప్రయాసపడుదురు. ముఖ్యముగా పెంతెకొస్తు వారు కష్టపడతారు. ***రేపు అందరును దగ్గరికి రండి. అందరము నింపబడుదుము.*** తెల్లనిబట్టలు కట్టుకొని దీక్షగా చేస్తారు. మోకాళ్ళమీద ఉంటారు. పరిశుద్ధాత్మ కుమ్మరింపు కొరకు అందరు పరిశుద్ధాత్మా! దిగిరా! అని కేకలు వేస్తారు. నీ వశము చేసికో! అంటారు. అల్లరిగా ఉండును. క్రమముగా ఉండదు. కార్యముల గ్రంథములో ఏ అల్లరిలేదు. అందరూ నిశ్శబ్ధముగా ఉన్నారు. అప్పుడు ఆత్మ వచ్చి వారిలో ప్రవేశించింది. కేకలు వేయలేదు. బలవంతముగా పిలువలేదు. అది అజ్ఞానము. ***అయినప్పటికిని వారి అజ్ఞానమును కనికరించి, ఆశను మెచ్చుకొని, పద్ధతి బాగాలేక-పోయినను, కుమ్మరింపు ఇచ్చుచున్నారు.*** అందులో 1) పరిశుద్ధాత్మ మనలో ఉంటే మనకు బాగుగా తెలియునా? 2) ఎవరిలో ఉంటే వారికే తెలుస్తుంది. ఇంకొకరికి తెలియదు మీకు ఏ ఆత్మ కావాలి? తెలిసేటట్టుగా ఉండేది కావాలా? లేక తెలియకుండా ఉండేది కావాలా? ***కొంత మందికి ఉన్నను, ఉన్నట్టు తెలియదు. విశ్వాసమునుబట్టి తెలియును.*** నమ్మును మన అందరిలో ప్రాణమున్నదా? ఉన్నది. మనలో ప్రాణమున్నట్టు తట్టుచున్నదా? ఇప్పుడు అన్నము తిని నీళ్ళు త్రాగుచున్నాము. ఆ అన్నము కడుపులో ఉన్నట్టు తెలియును. అది ఉన్నట్టు తెలియును. ఆ అన్నము ఉదరములో ఉన్నట్టు స్పర్శ తెలుసును. అలాగే కొంతమందికి పరిశుద్ధాత్మ ఉన్నట్టు తట్టును, తెలియును. మనలో ప్రాణము ఉన్నదిగాని తట్టదు. అన్నము తట్టినట్టు ప్రాణముతట్టదు. అనగా అన్నమంత స్పష్టముగా తెలియదు. అయితే, అన్నము ఉన్నట్టు చెప్పగలము, ప్రాణము ఉన్నట్టు చెప్పగలము గనుక పరిశుద్ధాత్మ మనలో ఉన్నదని చెప్పగలము. అట్లు చెప్పగలిగితే అది గొప్ప ధన్యత!

Bible Mission HQ Guntur

మన శరీరములో ప్రాణమున్నది. అలాగే ఎముకలున్నవి. ఆ ఎముకలను పట్టుకొన్నప్పుడు అవి తెలియును. ఇదివరకే మనకు జ్ఞానమున్నది. గనుక తెలియును. కండ ఉన్నట్టు మనకు తట్టుచున్నదా? అయితే అది మాత్రమేకాక శిరస్సు మొదలు అరికాలు వరకు రక్తము ప్రవహించుచున్నది. అది ఏలాగు జరుగునో తెలియదు. ప్రవహించుచున్నదని తెలుసుగాని తట్టదు. ప్రాణము, ఎముకలు, కండరములు, రక్తము ఇవి తప్పక ఉన్నవి. ఉన్నవిగాని మనమనుకొన్నంతగా అన్నమువలె తట్టవు. గనుక **"పరిశుద్ధాత్మ నాలో ఉన్నాడు"** అని ఎవరనుకొందురో వారిలో ఆయన తప్పకుండా ఉన్నాడు. నీ విశ్వాసమునకు ఉన్నట్టు తెలుసును. గాని నీ జ్ఞానమునకు తెలియదు. ***నీ జ్ఞానముకంటే విశ్వాసము గొప్పది.*** మనము రంగులేని నీళ్ళు, తెల్లని పాలు త్రాగుచున్నాము. అయితే అవి రక్తముగా మారుచున్నవి. రక్తము ఏలాగుండును. ఎఱ్ఱగా ఉండును. అలాగే పరిశుద్ధాత్మ ఉన్నట్టు మనలో ఏలాగు చెప్పుదుము? మనలో ఎఱ్ఱని రక్తమున్నట్టు చెప్పగలము. ఆ రక్తము ఏలాగు ఎఱ్ఱగా అయినదో చెప్పలేము. అలాగే ఇప్పుడు పరిశుద్ధాత్మ నాలో ఉన్నాడు అని నమ్మాలి. నమ్మకపోతే లేదు. నమ్మడము ఇష్టమా? కాదా? ***పరిశుద్ధాత్మ నీలోకాకుండా ఎక్కడున్నాడు?*** పరిశుద్ధాత్మ అనే వ్యక్తి మనలో ఉన్నాడు. పరిశుద్ధాత్మ శక్తి లోకమంతట ఉన్నది. ఒక చెట్టున్నది ఆ చెట్టులో జీవమున్నదా? లేదా? ఆ జీవము పరిశుద్ధాత్మ దగ్గరనుండి వచ్చిన ఒక శక్తి. జీవముంటే అది పరిశుద్ధాత్మ శక్తియే. సూర్య, చంద్రులలో జీవమున్నదా? లేదా పిల్లలనడిగితే చటుక్కున లేదంటారు. వాటికే జీవము లేకపోతే అవి గాలిలో క్రిందపడకుండ ఏలాగున్నవి? క్రిందకి పడిపోవా? మనము నివసించు భూమి గుండ్రముగా ఉన్నది. పైన గాలి ఉన్నది. అడుగునకూడా గాలి ఉన్నది. అది కోట్లమైళ్ళ వరకున్నది. ఆకాశములో (శూన్యంలో) గోళములు, భూమి వ్రేలాడుచున్నవి. అవి దేవుడు ఇచ్చిన ఆజ్ఞ ప్రకారము తిరుగుచున్నవి. వాటిలో జీవమున్నది గనుక అవి తిరుగుచున్నవి. ఆ జీవమే పరిశుద్ధాత్మ శక్తి.

అపో.కార్య. 2వ అధ్యా॥లో 'గాలి ఇల్లంతా వ్యాపించెను' అని వ్రాయబడియున్నది. అనగా పరిశుద్ధాత్మ తన శక్తిని, ఆ గది అంతయు వ్యాపింపజేసెను. పరిశుద్ధాత్మ శక్తి ఐదు ఖండములలో సూర్యచంద్రుల దగ్గర వ్యాపించియున్నందున అవి పడడములేదు. గనుకనే ఆయన ఆ ఇల్లంతయూ వ్యాపించి ఉన్నారు. దేవాలయమంతయూ వ్యాపించియున్నారు. గనుక ఇల్లంతా పరిశుద్ధాత్మ శక్తి వ్యాపించును. ఈ లోకమంతా

వ్యాపించకపోతే ఎప్పుడో అవి నశించియుండును. **కాబట్టి నాలో పరిశుద్ధాత్మ లేదు అనవద్దు.** ఉద్రేకము లేకపోవచ్చు. ప్రాణమున్నదిగాని 'ఉసూరుమంటు ఉంటావు' అని కొందరినిచూచి అంటారు. ఉసూరుమంటు ఉన్నవానిలో ప్రాణమున్నదిగాని ఉద్రేకములేదు. అలాగే కొంతమందిలో పరిశుద్ధాత్మ ఉన్నది గాని ఉద్రేకములేదు. అయితే ప్రపంచములో అటువంటి చరిత్ర జరిగినదో లేదో తెలియదు.

రాత్రి ఒక రెప్పపాటులో పరిశుద్ధాత్మ తండ్రి వచ్చి ఈ సంగతి చెప్పివెళ్ళిపోయారు. సాధు సుందర్‌సింగు క్రీస్తుప్రభువు మత విరోధి. ఆకాశమును, భూమిని ఎవడు చేసాడో, వాడేవచ్చి నాకు కనబడాలి. కనబడకపోతే మా ఇంటి ప్రక్కనుండి వెళ్ళే బండి క్రిందబడి చచ్చిపోయి ఆయనను చూస్తాననుకొన్నారు. కొంతసేపటికి వెలుగు కనబడి, క్రీస్తు ప్రభువు కనబడ్డారు. క్రీస్తుప్రభువు వచ్చి కనబడితే నేను నిన్ను పిలువలేదు. నీవు బొమ్మలలో చూచిన, నీ సృష్టికర్తను నీ దేవుడను నేనే అన్నారు. నీవు నన్నే పిలిచావని ఆయన అన్నారు. నేను కొలిచే దేవుడు కనబడక శని దేవుడవు నీవు కనబడ్డావు అని సాధుగారు అనుకొన్నారు. ఆకాశము, భూమి చేసినవాడను నేనే అని ప్రభువు అనగానే సాష్టాంగ నమస్కారముచేసాడు. వెంటనే ప్రభువు ఆయనలోకి ఒదిగిపోయాడు. మనము మంచినీళ్ళు త్రాగినప్పుడు ఏలాగు తెలియునో అలాగే క్రీస్తుప్రభువు తనలోనికి వెళ్ళుట సాధు గ్రహించినాడు. నీళ్ళలోపల ఉన్నట్టు ఏలాగు తెలియునో ఆలాగే ఆయనకు తెలిసింది. రాజమండ్రి, గుంటూరు, మద్రాసు, బరంపురం ఆయన తిరిగినప్పుడు ఈ సంగతులే చెప్పారు. ఆయన నాలో ఉన్నట్టు నాకు తెలుస్తుంది. ఇలాటి గొప్ప అనుభవము ఇతర మతములలో ఎవరికిలేదు. ఇండియా భక్తుడైన సింగుగారికి తెలియును. భక్తులు అడిగితే ఇదిగో చూడండి అనేవాడు. ఈ అనుభవము ఇంకెవరికి లేదు. **అలాగే పరిశుద్ధాత్మ ఉన్నట్టు మీకు తెలియకపోయినా నమ్మండి. నమ్మిక విడువవద్దు.** ప్రయత్నము చెయ్యండి. వస్తాడేమో!

ఈ కొద్ది మాటలు మీ హృదయములో ఫలించునుగాక![1]

---

**1. 17.5.1959వ సం॥లో దేవదాసు అయ్యగారు కాకానిలో చేసిన ప్రసంగము.**

# ఆత్మ కుమ్మరింపు కూటములలోని మూడవ దినము-ఆదివారము

## పరిశుద్ధాత్మ క్రియ

మత్తయి 18:18-20.



**ప్రార్థన:- తండ్రీ! నీవు మాకొరకు చేసినవి, అమర్చిపెట్టినవి తెలిసికొనుటకు, అనుభవించుటకు మా జ్ఞానముచాలదు, వయస్సు సరిపోదు గనుక నీవే మా ఆత్మను, నీ ఆత్మతో ఏకీభవింపజేసి, నీ ఆత్మక్రియను మాలో పూర్ణముగా జరిగించి, ఆత్మ పూర్ణులనుగా మార్చుకొని మహిమకు ఆయత్తపర్చుమని యేసు నామమున వందించుచున్నాము. ఆమేన్.**

కీర్తన: *"తెలివిని గలిగించు నన్ను దివ్వెగ వెలిగించు."*

దేవుడు మన కొరకు అమర్చి ఉంచినవన్నియు మనకు తెలియవు. పెండ్లికుమార్తెకు పరిశుద్ధాత్మతండ్రి, ఈ మూడు లోకములలో ఉన్నవన్నీ చూపించుచున్నాడు. గాని ఇంకా అవి ముగింపుకాలేదు. అక్కడకు వెళ్ళిన పిదప అన్నింటిని చూపించును. దేవుడు మనకొరకు అమర్చినవన్నీ చూపించును. ఇవన్నీ దేవుడు నీ కొరకు గడించి పెట్టినాడు. అవన్నీ నీకు అందించి పెట్టుదునని పరిశుద్ధాత్మ తండ్రి అనును. ***పరలోకపు తండ్రి అన్నీ చేసి పెట్టినాడు. ప్రభువు అన్నీ సంపాదించిపెట్టినాడు. పరిశుద్ధాత్మతండ్రి మనకు కావలసినవన్నియు వడ్డించును.*** ఆదికాండములో ఆకాశము, భూమియొక్క సృష్టి, ఆదాముయొక్క సృష్టి ఉన్నది. ఈ సృష్టి అంతటిలో ముగ్గురు ఉన్నారు. తండ్రి సృష్టించినాడు. తన కుమారుని ఎదురుగా పెట్టుకొని చేసినాడు. పరిశుద్ధాత్మ నెరవేర్చినాడు. *తండ్రి తలంచెను. కుమారుడు పలికెను. పరిశుద్ధాత్మ చేసెను.* ఈలాగు త్రిత్వము ఆదామును కలుగజేసెను. అలాగే మనిషిలో ఒక మనిషిని పరిశుద్ధాత్మ కలిగించెను. 'సాధారణముగా కలుగుతుంది' అని అందరూ అంటున్నారు. గాని పరిశుద్ధాత్మ సహాయము బహిరంగముగా కలుగుటలేదు. అయితే, మరియమ్మ విషయములో పైకి కనబడినది. గనుక మనుష్యులను కలిగించుట పరిశుద్ధాత్మపని అని కనబడుచున్నది. సహజముగా మనుష్యులను కలిగించుట సామాన్య పద్ధతి. సామాన్యమైన పద్ధతిని తీసికొనక ఏదేను తోటలో ఆదాము హవ్వలను ఎట్లు కలిగించినాడో, ఆ పద్ధతి తీసికొని మరియమ్మకు ఈ కార్యము కలిగించెను. సృష్టిలో

ఏ సాధనమును బట్టికాక ఆయనే స్వయముగా చేసెను. అలాగే మరియమ్మ విషయములో స్వయముగా చేసెను. దేవుడు మనిషై పుట్టవలసినది గాని ఆయనే స్వయముగా చేసెను. ***నైజప్రకారముకాక స్వయముగా తానే చేసెను. ఆదాము హవ్వలు పాపములో పడకపోతే ఈ పద్ధతే కనబడును. మరియమ్మ వరుసలోని పద్ధతే వాడియుండును. దేవుడు మనిషి అయినాడంటే అది ఆయనను అవమానపరచినట్లు అని తురకలు అందరు.*** కైరో పట్టణములో క్రైస్తవులు సువార్త ప్రకటిస్తూ ఉంటే తురకలందరు వింటున్నారు. మత్తయిలోని కథ విడ్డూర కథ. నైజ పద్ధతిని విడిచి ఆయనే స్వయముగా చేయుట. వెయ్యేండ్లలో అట్లు జరుగును. మరియమ్మలో జరిగినపని ఏమనగా పరిశుద్ధాత్మ చేసినపని. కుమారుడు పలికిన పని. తండ్రి తలంచిన పని.

**ముఖ్య విషయము:–** ఆయనే సంకల్పించిన నైజ పద్ధతిని విడిచిపెట్టి, ఆయనే స్వయముగా మరియమ్మ విషయములో నెరవేర్చినారు. ఉదా: ఒక మనిషి రోగమునుండి బాగయినాడు అనగా తండ్రి ఆ వ్యక్తి స్వస్థత కోరెను. కుమారుడు తన రక్తముతో శుద్ధి పరచెను. పరిశుద్ధాత్ముడు బాగుచేసెను. ప్రధానితో నీ కుమారుడు బ్రతికియున్నాడు అని ప్రభువు చెప్పినప్పుడు, తండ్రియొక్క తలంపు ప్రకారము కుమారుడు పలికెను. పరిశుద్ధాత్మ బాగుచేసెను. కొందరికి బిడ్డలు కలుగుటలేదు. అది తండ్రి తలంపులో లేదు. పాపస్థితి అడ్డముగా ఉన్నది. అది వారి పాపముకాకపోయినను, వారి పితరుల పాపములు అడ్డముగా ఉన్నవి. అన్యుని ఇంటిలోకూడా కార్యము జరుగుటకు తండ్రి తలంచెను. కుమారుడు పలికెను. పరిశుద్ధాత్మ చేసెను. బిడ్డలు పుట్టేటందుకు శరీరములో ఆటంకములేదు. గనుక మనుష్యులు చెడ్డవారు అయినను బిడ్డలు పుట్టుచున్నారు. ఒక మనిషికి జబ్బు పోకపోవడానికి ఏదో ఒక కారణము ఉండును. అడ్డు ఉండును. ఎంతో భక్తిగా ఉండవచ్చు, అయినను బిడ్డలు లేకపోవచ్చు. అందుకు కారణము ఉండును. ***ఆ కారణము అడిగితే తండ్రి తప్పక చెప్పును.*** అప్పుడు చేస్తే అన్నీ జరుగును. ఎవరైనాసరే బోధ పూర్తిగా విని, నమ్మకము ఉంచినట్లయితే తప్పక నెరవేరును. సందేహము చెడగొట్టును. 1) పాపము, 2) సందేహము, 3) తల్లి దండ్రుల పాపము, 4) సైతాను. సైతానువల్ల పని జరుగదు. ***సందేహము తొలగించుమని ప్రార్థించిన, ప్రభువు అన్నీ తొలగించును.***

**ప్రార్థన:–** ఓ పరిశుద్ధాత్ముడవైన తండ్రీ! అమెరికా, ఇండియా, యూరప్, ఆస్ట్రేలియా దేశములందు అనేకమంది విశ్వాసులు కూడుకొని ఆలోచించుకొనుచుండగా మేముకూడా ఆలోచించుచున్నాము. నీ పని ఎంతో గొప్ప పని. అన్నీ వివరించుకోలేము. 1) పాపము ప్రవేశించక ముందుగల నైజపద్ధతి. 2) పాపము ప్రవేశించిన పిదపగల నైజపద్ధతి. ప్రభువు రావలసిన దినములలో (రాకడ దినములలో) నైజ పద్ధతి విడిచిపెట్టవలెను. గనుక నిచ్చెన వేసికొని ఆకాశము వరకు వెళ్ళుట కొరకు, సంఘానికి ***ఈ నైజ పద్ధతిగాక, నీ నైజ పద్ధతిని జరిగించుము.*** మాకు నైజ పద్ధతివద్దు. నీ పద్ధతి ప్రకారముగా జబ్బు బాగుచేయుము. నీ పద్ధతులేవాడుము, నా పద్ధతి వద్దు. యేసుప్రభువా! నీవు సువార్తలలో నీ పద్ధతులే వాడినావు. ఆ మాట ప్రకారముగానే క్రియ జరిగించుము. నీవలన మేలుపొందునట్లుగా ఆ ప్రకారము క్రియ జరిగించుము. నీ భక్తులైనవారు దేవాలయములో నీ వాక్య ప్రకారము చదువుకొని, మాట్లాడుకొని, మీ ఇష్టప్రకారము పొందుపరచుకొనినట్లు, మేము ఈ వాక్యము చదువుకొని, మాట్లాడుకొని మీ ఇష్ట ప్రకారము జరిగించు కృప దయచేయుము. తండ్రి తలంచుట, కుమారుడు పలుకుట, పరిశుద్ధాత్మ పని జరిగించుట, మాకు నేర్పినావు. అక్కడ విత్తనములు వేయుట తండ్రీ అది నీ తలంపు, పిమ్మట కుమారుడు పలికెను. పరిశుద్ధాత్మ మొలిపించెను గనుక తండ్రికి ఇప్పుడు మహిమ. కుమారునికి ఇపుడు మహిమ. పరిశుద్ధాత్మకు ఇపుడు మహిమ కలుగునుగాక. ఆలాగే తండ్రికి ఎల్లపుడు మహిమ, కుమారునికి ఎల్లప్పుడు మహిమ. పరిశుద్ధాత్మకు ఎల్లప్పుడు మహిమ చెల్లించుచున్నాము. త్రియేక తండ్రికి యుగయుగముల పొడవునా మహిమ, కుమారునికి యుగయుగముల పొడవునా మహిమ, పరిశుద్ధాత్మకు యుగయుగముల పొడవునా మహిమ చెల్లునుగాక. త్రియేక దేవునికి ఇప్పుడు, ఎల్లప్పుడు కీర్తి, ఘనత, ఇప్పుడు ఎల్లప్పుడు యుగయుగముల పొడవునా మహిమ కలుగును గాక. నీ సృష్టిద్వారా, నీ వాక్యముద్వారా మాకు నీ మహిమ అందించుము, క్రియ జరిగించుమని వేడుకొంటున్నాము. నీ కుమారునిద్వారా అనేకములు బయలుపరచినావు. పరిశుద్ధాత్మవల్ల కూడా బయలుపరచినావు. నేడును బయలుపరచిన నీ సర్వ సంగతుల నిమిత్తమై యేసునామమున వందించుచున్నాము తండ్రీ! ఆమేన్.[1]

---

**1. 20.5.1955వ సం॥లో దేవదాసు అయ్యగారు బేతేలుగృహములో చేసిన ప్రసంగము.**

# ఆత్మ కుమ్మరింపు కూటములలోని నాల్గవ దినము-సోమవారము

## పరిశుద్ధాత్మ వశము కొరకైన ప్రార్థన

ప్రకటన 1:9-11.



**ప్రార్థన:-** ఆత్మ తండ్రీ! పరిశుద్ధాత్ముడవైన తండ్రీ! నిర్మలాత్ముడవైన తండ్రీ! దైవాత్మయైన తండ్రీ! పరమాత్ముడవని పిలిపించుకొన్న తండ్రీ! జీవాత్మ అని పిలిపించుకున్న తండ్రీ! ఆత్మవని పిలిపించుకొన్న తండ్రీ! త్రిత్వములో మూడవ వ్యక్తి అని పిలిపించుకున్న తండ్రీ! నీపేరే పరిశుద్ధాత్మ. నీవు పరిశుద్ధుడవు. మేము పాపులము. మేము నీ పేరు తలంచకూడదు. తలంచుటకైనను తగనివారమైన మేము, నీ పేరు మా నోటితో ఉచ్చరించుటకు తగము. ఉచ్చరించకూడదు. అయినను మా ఇష్టము వచ్చినన్ని పర్యాయములు నీ నామమును ఎత్తుటకు, స్మరించుటకు సంపూర్ణ స్వాతంత్ర్యము ఇచ్చినావు. స్వాతంత్ర్యమిచ్చే ఆత్మకు స్వాతంత్ర్య మిచ్చే దేవుడవు. **నీ పేరు ఎన్ని పర్యాయములు తలంచుకుంటే చెప్పుకుంటే అన్ని పర్యాయములు ధన్యులమే. నీపేరులన్నింటి దగ్గర నిలువబడి, ధ్యానించినయెడల మేము క్రమముగా పరిశుద్ధులము కాగలము.** పరిశుద్ధాత్మవైన తండ్రీ! పెంతెకొస్తు దినమందు కుమ్మరించబడిన తండ్రీ! యోహానుతో నేనైతే నీళ్లతో బాప్తిస్మము ఇచ్చుచున్నానుగాని నీవైతే అగ్నితోను, పరిశుద్ధాత్మతోను ఇస్తావని చెప్పించిన తండ్రీ! అడిగిన వారికి కొలతలేకుండా ఇస్తావని ఎవరినిగూర్చి వ్రాయబడినదో, ఆ పరిశుద్ధాత్మవైన తండ్రీ! పరిశుద్ధాత్మ పొందువరకు, శక్తిపొందువరకు యెరూషలేములో కనిపెట్టుడని చెప్పిన తండ్రీ! నీకు, వందనములు. నీయొక్క పేరువద్ద నిలువబడి ధ్యానించిన, నీ ఊట అంతా, నీ జీవమంతా, నీశక్తి అంతా, నీ ప్రేమ అంతా మాకు బయలుపడును.

ఈలాగు చేస్తే, లంకలో యోహాను ఆత్మవశమై పోయినాడు అని ఎవరినిగూర్చి వ్రాయబడెనో, ఆ పరిశుద్ధాత్మవైన తండ్రీ! స్తోత్రములు. మేము సంపూర్ణస్థితి పొందలేకపోవుచున్నాము. మేమే నీవశమైపోతే మాకు ఏమి కావలెను? యోహాను, చావుకు సిద్ధమైనవాడు, ముసలివాడు అయితేనేమి? ఎంత వ్రాత వ్రాసినాడు! **అతడు నీ వశము, నీవు ఆయన వశమైయున్నందున భూలోకములో నుండి పరలోకమునకు వెళ్ళినాడు.** ఎంత ధన్యత, ఎంత ధన్యత, ఎంత ధన్యత! ప్రవక్తలకు తండ్రివైన ఆత్మ తండ్రీ! శిష్యులకు తండ్రివైన ఆత్మ తండ్రీ! మా ప్రభువు నేరస్తుడుగా ఉన్నటువంటి

Bible Mission HQ Guntur

కాలములో ఉన్న తండ్రీ! ఏకాంత కాలములో తండ్రివిగా ఉన్న ఆత్మతండ్రీ! నీకు అనేక వందనములు. దావీదు చేత కీర్తనలు కట్టించిన తండ్రీ! సొలోమోనుచేత ప్రసంగి వ్రాయించిన తండ్రీ! మోషేచేత ధర్మశాస్త్రము వ్రాయించిన తండ్రీ! దావీదు, సొలొమోను, మోషేలకు తండ్రివైన పరిశుద్ధాత్మవైన తండ్రీ! నిన్ను కోరుకొన్నవారికి పరిశుద్ధాత్మవైన తండ్రీ! నీకు వందనములు. అతడు ఆత్మవశుడైపోయినాడని దీనినిబట్టి గ్రహించు చున్నాము. ఒంటరిగా ఉన్నాడని, ముసలివాడైనాడని, శక్తిలేనివాడు అయినాడని నీవు వచ్చావు. నీవు రాగానే నీవశమైపోయాడు. ఆత్మ కూటములలో ఉండువారిని నీవశము చేసికొంటే పడగలరా! పడలేరు. ఖైదులో ఉన్ననేమి, ఎఫెసు పట్టణమును విడిచి ఒంటరిగా ఉన్ననేమి అని మరణము సమీపించిన ఆయనను, నీవు సమీపించి ఎంత గొప్ప స్థితికి రప్పించినావు. వృద్ధాప్యము గొప్పస్థితికాదు, ముసలితనము గొప్పదికాదు, గాని గాలిలోవచ్చి అద్భుతకరమైన స్థితికిమార్చిన తండ్రీ! వందనములు. పురాతన కాలమందు నీకు ఒక రైటరు దొరికినాడు. ఆయనను పొదలోనుండి తీసి, కొండమీద కూర్చుండబెట్టి రైటరుగా పెట్టినావు గనుక వందనములు. నేను తగను, నత్తివాడను అంటే అతనిని నీ వశము చేసికొన్నావు, గనుక ఐగుప్తునకు పంపినావు. గొప్ప పనులు చేయించినావు. తాను తన వశమై ఉండగా ఏమీ చేయలేకపోయెను. నీ వశము చేసికొని ఐదు కాండములు వ్రాయించినావు. యోహాను ఒక గ్రంథమే వ్రాసెను. అతడు రైటరుకాదు. గాని నీవు వీరిని నీ వశము చేసికొని రైటరుగా చేసికొన్నావు.

ఆ కాలమందు మోషేచేత ఐదుకాండములు వ్రాయించినది నీవే, ఈయనచేత ప్రకటన వ్రాయించినవాడవు నీవే. ఇది తలంచుకుంటే భయముగా ఉన్నది. సంతోషమునకు సంతోషముగా ఉన్నది. **గాలి ఎక్కడకు వెళ్ళుచున్నదో ఎవరికి తెలుసు? అట్లే నీ వశము చేసికొన్నవారు ఎక్కడెక్కడకు వెళ్ళునో, ఏమేమి చేయునో ఎవరికి తెలుసు?** దయగల ప్రభువా! ఆదిలో మొట్టమొదట మోషే మొదలుకొని యోహాను వరకు, ఈ మధ్యకాలములో వ్రాత మూలముగా గొప్ప పని చేయించినావు గనుక వందనములు. వ్రాత మూలముగానే కాదు. ఇతర పనులవల్ల, కర్మెలు పర్వతముమీద నడుము కట్టించి, రథముకంటే ముందుగా పరుగెత్తించినావు. ఆహాబు రథముకంటే ఇతను ముందుగా వెళ్ళినాడు. ఆత్మబలము వలన ఆలాగు జరిగించినావు. మా కాలములో ఒక గంటలో రాజమండ్రి వెళ్ళితే ఏలాగు వచ్చినావు అని అడుగుదురు.

ఎవరైనా ఒకరు ఏలీయావలె, మోషేవలె, యోహానువలె నీ వశము అయితే ఆలాగే చేస్తావు. భక్తులకు ట్రైనులు, విమానములు ఎందుకు? యెహెజ్కేలు విమానముకంటే ఎత్తుగా వెళ్ళెను. ఆత్మ ఎత్తుకొని వెళ్ళెనని ఉన్నది. **అటువంటి వారు ఇప్పుడు ఉంటే, ఇప్పుడు ఒక గంటకు ఇంగ్లాండు వెళ్ళి బోధించి, ఇంకొక గంటకు అమెరికా వెళ్ళి బోధచేయగలరు. ఈ పని మా కాలములో చేస్తావు.** మోషే తరుపున, ఏలీయా తరుపున, యోహాను తరుపున నీకు అనేక వందనములు. సమరయ బోధకుడైన ఫిలిప్పును కందాకే మంత్రివద్దకు నడిపించుకొని వెళ్ళినావు. అక్కడనుండి ఆజోతుకు తీసుకు వెళ్ళినావు. ఎట్లు వెళ్ళెను? 'పరుగెత్తి రథమును కలిసికో' అనగా వెళ్ళాడు. నీ భక్తుడు గనుక ఎంత ధన్యత! 'నేనూ ఆ కాలమందు ఉంటే ఎంత బాగుండును'! అని అనేక భక్తులు అనుకొంటున్నారు. అయ్యో! ఎక్కడైనా ఉందా. చదువులేనిదే, సంభాషణ నేర్చుకొననిదే, అ,ఆ,లు నేర్చుకొననిదే, పరభాష మాట్లాడుట ఎట్లు? పేతురు పరభాష మాట్లాడి అనేకమందిని త్రిప్పివేసినాడు. కొందరు ఎంతకాలము నేర్చుకొన్ననూ భాషరాదు. పేతురు అప్పుడే నేర్చుకొని అప్పుడే బోధించినాడు. పేతురు ముందుగా నోటీసు లేకుండానే, ప్రార్థన లేకుండానే, పరభాషతో మాట్లాడినాడు, బోధించినాడు. సంఘకాలము యొక్క మహిమకాలము ఎంత గొప్పకాలము! అప్పుడు మేము ఉంటేనా! అని చదివే వారికి అనిపించును. ఉపదేశాలన్నీ పేతురుకు, పౌలుకు, యోహానుకు, యాకోబుకు అందించినావు. అద్భుతకరమైన మాటలు పౌలుచే వ్రాయించినావు. పౌలు గేటుదగ్గర దొరికినాడు. పరమదుర్మార్గుడు. సంఘమును చెల్లాచెదురు చేయించినాడు.

గేటు దాటనిచ్చినావా? మోషే దగ్గర ధర్మశాస్త్రము నేర్చుకొన్నాడా! రోమా, హెబ్రీ పత్రికలెంత గొప్పవి! హెబ్రీ పత్రిక ఎంత అద్భుతకరమైన పత్రిక! ఎంత గొప్ప పత్రిక! 'యేసుప్రభువు నిజమైన దేవుడు, నిజమైన రక్షకుడు, నిజమైన మనుష్యుడు' అని వ్రాసెను. పేతురు, యోహానులు యేసుప్రభువు యొక్క ముఖమైన చూచారుగాని ఈ పౌలు ఎక్కడ ఉన్నాడు. అట్టి వానిని తీసికొనివచ్చి ఎంత గొప్ప వ్యాఖ్యానము వ్రాయించినావు! 1కొరి. 13వ అధ్యాయమును ఎవరు వ్రాయగలరు? మన ప్రభువైన యేసునేర్పిన ప్రార్థన ఎవరును ఏ ప్రకారమైననూ వ్రాయలేరో అట్లే ప్రేమను గురించిన అధ్యాయమును, హెబ్రీ పత్రికను ఎవరు వ్రాయగలరు? ఆత్మవశమైన నీ భక్తులచేత వాటిని వ్రాయించినావు. ప్రభువా! ఈయనకు భక్తుడు ఒకపేరు పెట్టినాడు. ఆ పేరు ఏమిటి? నగలు చేసేవాడు, కుర్చీలు చేసేవాడు, ఇంకొక పనివాడు, ఇల్లు, గోడలు

కట్టేవాడు, ఇంకొక పనివాడు అనగా నీవే ఆ ఇంకొక పనివాడవు, అలాగే పనిచేయించేవాడవు నీవే. మంటిమీద ఉన్నవాడు మంచి కుర్చీ చేస్తున్నాడు. పొదలో ఉన్న మోషేను తీసుకొని వచ్చి ఎంత గొప్ప పని చేయించినావు! మట్టిలోని బంగారమును మేలిమి బంగారుగా చేసి, స్త్రీలు అలంకరించుకొనే నగలుగా చేసినట్లు, పౌలును తీసికొని వచ్చి గొప్ప పనివానిగా చేసినావు.

యెషయా మొదలైన గొప్ప భక్తులు ఉన్నారు. వారిచే పనిచేయించినావు. **లోకములో ఎక్కడెక్కడ భక్తులు ఉన్నారో వారికి ఒక్కొక్క పనిపెట్టి చేయించుకొనుము.** నీకు వందనములు చెల్లించుచున్నాము. ఒకరిని ప్రవక్తగా, ఒకరిని కంసాలిగా, ఒకరిని వడ్రంగిగా తయారుచేసిన తండ్రీ! వందనములు. నీ పని తలంచుకుంటే ఎంత ఆశ్చర్యము! మా మాటలు కాదు. ఈ గదిలో ఉన్నవారితో ఎవరెవరు నీ వశము కావలెనని ఉన్నారో, వారిని నీ వశము చేసికొనుము. ఒకరు వ్యాధి వశములో ఉన్నారు, ఒకరికి ఆత్మ నడిపింపులేదు, ఒకరు ఎంత భక్తిగా నడుచుకొన్నను ఆత్మలేదు. **అయితే మాత్రము అది నీకు ఎంతపని? చేయాలంటే అందరిని నీవశము చేయగలవు.** మోషేను, హబక్కూకును, ఆమోసును, పేతురును మార్చినావు. పసులకాపరి అయితే మాత్రము పనిలో నమ్మకముగా ఉండి, చెట్టుక్రింద పండ్లు ఏరుకొనుచున్న ఆమోసును ప్రవక్తగా మార్చినావు. పేతురును అనగా నిన్ను ఎరుగనన్న వానిని, సంఘ స్థాపకునిగా మార్చినావు. సంఘమును చెదరగొట్టిన పౌలును సంఘమును ప్రోగుచేయువానిగా మార్చినావు. సంఘ కట్టడలను వ్రాయించి, బిషప్పులనుగా ఏర్పరచినావు.

**ఆదాము మొదలు మోషేవరకు పితామహులందరిని బలపరచి సంతోషపరచినావు.** బహిరంగములోనికి రాకపోయినా అంతరంగములో గొప్ప పని చేసినావు, స్తోత్రములు. 20వందల ఏండ్లలో అనేకమందిని చేతకాని వారిని పండితులుగా మార్చినావు. 2,000పై చిలుకు భాషలలో నీ గ్రంథమును తర్జుమా చేయించినావు, అచ్చు కల్పించినావు. అది నీ చేతిపని, చేసే పనివాని పని, అచ్చుపని. అలాగే దేవాలయము పని, అదికూడ నీ చేతిపనే, చేసే వాని పనికూడాను. అలాగే ఆసుపత్రులు, కాలేజీలు; అది నీ చేతిపని, చేసే వారిపని. అచ్చువేయుట మాత్రమే చేతిపనివారి పనికాదు, మిగిలిన పనులన్నీకూడ వాటిని చేయించుచున్న నీ చేతిపనులై యున్నవి. క్రిస్మస్ సమయములో, మట్టలాదివార సమయములలో, నిర్ధారణ సమయములో, పెండ్లి సమయములో, కాగితములు తెచ్చి చిత్ర, విచిత్ర పనులు

చేయుట; ఇవన్నీ చేతిపనులు చేసేవారి పని. ఈ పని నీవు సంఘములో చేయిస్తున్నావు. నీ భక్తులు చనిపోయిన పిదప వారిపేర్లు మాపివేయవలెనని ప్రయత్నించుట, సైతానుపని. అయితే వారిని మట్టిచేయించి, పునాదులలో నుండి వారి సమాధులు కట్టించి వారి పేరు వ్రాయిస్తున్నావు. జనరల్ బూత్ త్రాగుబోతులందరిని మార్చివేసాడు. ఆయన సమాధి దగ్గర వారందరిచేత చందా వేయించినావు. అక్కడకు వచ్చేవారందరు చందా వేస్తారు. ఆయనే రక్షణ సైన్యమును స్థాపించెను. ఇదంతా నీ చేతిపని. నీవు చాటున ఉండి ఎంతో పని చేయిస్తున్నావు. ఏమి చెప్పగలము! మేము బలహీనులము, అజ్ఞానులము. **అయిననూ, నీవు మమ్మును బలవంతులనుగా చేసి, నీ పని చేయించగలవు.** నీ పనివారిని జపాను, అమెరికా, చైనా దేశములలోనికే కాక మనుష్యులను తినే అడవిలోనికిని పంపలేదా! వారి దేశములలో వారు ఉంటే సుఖముగా తిని ఉండలేరా? మనిషి తలంచుకుంటే గుండె గుబేలుమంటుంది. పరిశుద్ధాత్మ తండ్రీ! మీ పని ఎంత పని! ఎంత పని! ఎంత పని! అని రొమ్ముకొట్టుకొందురు. ఆయన పని తెలియక మనిషి ఊరుకొంటున్నాడు. ప్రభువా! ఒక ఆనకట్టను చూచి, "ప్రభువా! ఇది మనుష్యులు కట్టినదా! దేవతలు కట్టినదా! ఆఫ్రికాలో పిరమిడ్స్ ఎవరు కట్టినవి! మనుష్యులే వాటిపైకి ఎక్కలేకపోయిరి" అని అడిగితే, అందులోని నీ చరిత్రను వెల్లడి చేయగలవు. ఎందుకనగా అవి నీ మహిమను వివరించుచున్నవి.

చికాగోలోని ఒక భవంతిని మనిషి తల పైకెత్తి చూస్తే తల తిరిగిపోతుంది. ఇంకా ఫోటోలు, రేడియోలు ఇదంతా ఎవరి పని? పనివారి పని. ఆ పనివాడు ఎవరు? నీవే. బట్ట చినిగితే సూదికావాలి! ఆ సూది ఎవరు చేయాలి? నీవే. ఆ సూదికి రంధ్రము చేయాలి అందులో దారం పెట్టాలి. ఇది ఎవరి పని? అద్దమును ఎవరు చేసారు? వాడుకొనుట మాత్రము మాకు తెలుసు. 1) లోక సంబంధమైన పనులు, 2) ఆత్మ సంబంధమైన పనులు ఇవన్నీ నీవే చేసినావు. వాటి సంపూర్ణత వెయ్యేండ్లలో చూస్తాము. ఇప్పుడు నీవు సంఘములో ప్రవేశించి, పెండికుమార్తెను తయారుచేస్తూ ఉన్నావు. స్నానము చేయించి బట్టలు, నగలు ధరింపచేయించుచున్నావు. అట్లు సిద్ధపరచి, రేపు తీసికొని వెళ్ళుదువు. ఈ నీ పనిని ఎవరు వివరింపగలరు? నీకు అనేక వందనములు. ప్రకటనలో పెండ్లికుమార్తె నగులు ధరించి, వస్త్రము ధరించి, సిద్ధపడుచున్నది. అది పరిశుద్ధాత్మ పని. ఏ కళంకము లేకుండా ఆత్మ, శరీరమును శుద్ధిచేసి, ఆటంకము లేకుండా చేసి త్వరున తీసికొని పోవును. ప్రకటన 19:7,8.

వార్తా పత్రికలలో ఎక్కడెక్కడ ఏ పని జరుగుచున్నదో వ్రాయబడి ఉంది. అది లౌకికులకు అర్ధముకాదు. ప్రభువు బిడ్డలే అది ఆత్మ పని అని తెలుసుకొనగలరు.

పరిశుద్ధాత్మ వ్రాయించిన వ్రాతలు నిజమని లోకములో జరుగుచున్న ఆయాపనులు, భూకంపములు మొదలైన వాటివల్ల తెలుస్తుంది. పరిశుద్ధాత్మ తండ్రి. అన్యులకు తండ్రి, మనకు తండ్రి. ఆయనే ఆ అన్యులలో ప్రవేశించి, వారికి అవసరమైన సంగతులు చెప్పించుచున్నాడు. సముద్రములో ఒక చేప దొరికింది. దానిమీద బంగారు అక్షరములలో "ఇదిగో నేను త్వరగా వచ్చుచున్నాను" అని వ్రాయబడి ఉంది. ప్రభువు వచ్చి తీసికొని వెళ్ళేటప్పుడు ముందుగా మన రంగు బట్టలు పరిశుద్ధాత్మ తండ్రి తెల్లగా మార్చి తీసికొని వెళ్ళును. మన సామానులుకూడా పరిశుద్ధాత్మ తండ్రి తన వశములోనికి తీసుకొనును. ఆత్మ వశీకరణమైతే ఇట్లు జరుగును. మన పిల్లలను ఆయనకు సమర్పించుకొంటే ప్రభువు తన ఆత్మవశము చేసికొని, తానే తన రూపమునకు తయారుచేసికొనును.

*ఓ పరిశుద్ధాత్ముడవైన తండ్రీ! నన్ను నీ వశము చేసికొనుము.* హాగరు తన కుమారునికి వడగాడ్పు తగిలి, త్రాగుటకు నీరులేక దాహమునకు ఏడ్చుచుండగా ఎక్కడా నీళ్ళు లేక బిడ్డను దూరముగా విడిచి, 'నీవక్కడ చావు. నేను ఇక్కడ చస్తాను' అని చూస్తూ ఉండెను. అంతలో దేవదూత వచ్చి నెర తీసి, నీళ్ళు చూపించెను. అది పరిశుద్ధాత్మ పనిగదా! *ఓ దయగల మహా ఓపికగల ప్రభువా! మాతోకూడా వస్తున్న ప్రభువా! మాకు కఠినమైనట్టి, అర్ధముకానట్టి సంగతులను చూపించే పరిశుద్ధాత్ముడవైన తండ్రీ! సహాయకుడవైన తండ్రీ! పరిశుద్ధాత్ముడవై నడిపించే తండ్రీ! నీకు వందనములు. ఆమేన్.*

దీవెన: అట్టి పరిశుద్ధాత్మ వశములో ఈలాగు మీరు స్థిరముగా ఉందురుగాక! ఆమేన్.

---

**1. 20.5.1955వ సం॥లో దేవదాసు అయ్యగారు కాకానిలో చేసిన ప్రసంగము.**

Bible Mission HQ Guntur

# ఆత్మకుమ్మరింపు కూటములలోని ఐదవ దినము-మంగళవారము
# పరిశుద్ధాత్మ శక్తి

అపో.కార్య. 1:6-11.

"అయినను పరిశుద్ధాత్మ మీమీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు..." అపో.కార్య. 2వ అధ్యాయము. "వారిమీద అగ్ని నాలుకలుగా విభాగింపబడెను". అపో. 1:5లో "కొద్ది దినములలోగా మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందుదురని" వ్రాయబడెను. షరా:- 1. పరిశుద్ధాత్మను తలంచుకొండి, 2. పరిశుద్ధాత్మ శిష్యులమీదకు రావడము తలంచుకొనండి, 3. పరిశుద్ధాత్మ ఇచ్చే శక్తిని తలంచుకొనండి, 4. పరిశుద్ధాత్మ శక్తినిబట్టి భూదిగంతముల వరకు వెళ్ళేపనిని తలంచుకొనండి, 5. అట్లు వెళ్ళుచూ యేసుప్రభువు చెప్పే సువార్త పనిని తలంచుకొనండి.



**ధ్యాన ప్రార్థన:-** పరిశుద్ధాత్మవైన ఓ తండ్రీ! మేము నిన్న నీ పనిని గూర్చిఆలోచించితిమి. మరలా ఆలోచించు కొద్ది పాటి సమయము కలిగినది. మరియొక మారు నిన్ను ప్రార్థించుచున్నాము. అపోస్తలుల-మీదకు వచ్చినట్లు, మా మీదికిని రమ్మని వేడుకొంటున్నాము. నీవు పైనుండి వచ్చినావు అందుచేత మా మీదికి పరిశుద్ధాత్మ దిగివచ్చునని యేసుప్రభువు సెలవిచ్చెను. నీ శిష్యుల మీదకు వచ్చిన నీకు వందనములు. నీవు వచ్చిన తర్వాత శక్తి కలిగినదని నీ వాక్యములో చూస్తున్నాము. అది వరకే 12మంది శిష్యులు, 70మంది శిష్యులు గ్రామాలలో బోధ నిమిత్తమై వెళ్ళి, ప్రసంగించి అద్భుతములు చేసినారు. అది దీనికి సంబంధించినది కాదు. ***నీవు వారిమీదకి ఆత్మను పంపినప్పుడు, శక్తికి మించిన శక్తి ఇచ్చినావు.*** అది భూదిగంతముల వరకు వెళ్ళే శక్తి. అందుకనే వారు అంతవరకు వెళ్ళగలిగిరి. కాబట్టి మా తండ్రీ! అట్టి శక్తి మాకును కలుగునట్లు మా మీదికి రమ్మని వేడుకొంటున్నాము. అప్పుడు 1) నీవు మా మీదికి రావడము, 2) మాకు శక్తి రావడము, 3) నీ శిష్యులకు భూదిగంతములకు వెళ్ళేపని, 4) ప్రభు యేసునుగూర్చి చెప్పవలసినపని జరుగును. (ఎ) నిన్ను కలిగియుండి, (బి) నీవల్ల శక్తిపొంది, (సి) భూదిగంతములవరకు వెళ్ళుచూ, (డి) సాక్ష్యమిచ్చే పని. ఈ నాలుగు పనులు నీవు వ్రాయించిన వాక్యము వల్ల తెలుసుకొని నమస్కరించు చున్నాము. పరిశుద్ధాత్ముడవైన ఓ తండ్రీ! నీవు నీ శిష్యులమీద వ్రాలినప్పుడు, వారికి గొప్ప శక్తి వచ్చినది. అలాగే నీవు మాలోపలికి వచ్చినప్పుడు నీతోకూడా నీ శక్తివస్తే, మరొక పనికొరకు సిద్ధము కాగలము. వారైతే ఆ శక్తితో సాక్ష్యమిచ్చిరి. యేసుప్రభువును

గూర్చిన సాక్ష్యము అనగా (1) మేము యేసుప్రభువుని చూచినాము, (2) ఆయనను ముట్టినాము, (3) ఆయన జీవితమంతా చూచినాము అని చెప్పుట. ఆలాగు చెప్పే శక్తి వారికి అవసరము గాన అట్టి శక్తి ఇచ్చినావు. మా పనికూడా సాక్ష్యమిచ్చుటే గనుక మాకును అట్టి శక్తి అవసరమే. గాని మరొక పని ఇచ్చినావు అదియు మాకు అవసరమే. మరియు నీవు మాలోనికి రావడము అవసరమే.

ఓ తండ్రీ! నీ శిష్యులు మేడగదిలో ఉన్నప్పుడు నీవు వారిలో ప్రవేశించబట్టి, వారు శక్తిపొంది సాక్ష్యము చెప్పుటకై వెళ్ళిరి. అయితే మేము ప్రభుయేసుయొక్క రెండవ రాకడకు సిద్ధముకావాలి గాన ఆ పనికి నీ ప్రవేశము, శక్తి అవసరము. మేము భూదిగంతముల వరకు వెళ్ళవలసిన పనిలేదు. రాకకు సిద్ధపడే పని ఉన్నది. ఆ పనికి నీ శక్తి అవసరము. వారికి సాక్ష్యము చెప్పేపని, మాకు సిద్ధపడే పని. మా ప్రభువా! ఈ పని చాలా కష్టము. శక్తిపొందిన పిదప 'మేము రాకడకు సిద్ధము కాగలమా? అనే ప్రశ్నవచ్చి, పురుగువలె మెదులును. అప్పుడు సిద్ధపడుటలో తగ్గిపోదుము'. మరొక పర్యాయము 'సిద్ధమైన పిమ్మట, రాకడవరకు ఉందునా?' అని సందేహింపచేసే పురుగు తొలిచి, ఏమి తోచకుండా చేయును. మాకు నీ శక్తి ఉంటే ఆ పురుగులను జయించగలము. గనుక ఆలాగు సిద్ధపడే శక్తి అవసరము. ఏదో పాపశోధన రాగా, జయించలేమను తలంపు తోస్తే, అది మరింత భయంకరమైన పురుగు. నీ ఆత్మవల్ల వచ్చుశక్తి పొందనియెడల ఈ మూడు పురుగులకు జంకవలెను. కాబట్టి నీ శక్తివల్ల జయము పొందగల శక్తి ఇమ్ము.

"అయ్యో! నేను మనిషిని. కొన్ని శోధనలు జయిస్తాను. మనిషిని గనుక కొన్ని శోధనలే జయిస్తాను. ఎప్పుడూ అన్నీ శోధనలైతే ఎట్లు జయిస్తాను? అనేది ఒక పురుగు, దోషము. శక్తిలేదని అనుకుంటే అది సరికాదు. నీవల్ల శక్తిపొందినాము గాన అట్లు అనుకుంటే, అది దేవదూషణ. గాన నీవల్ల శక్తిపొందుటకు అనుగ్రహించుము. ఏలీయా వద్దకు దేవదూతను ఎందుకు పంపినావు? రొట్టె తిని, బలము పొంది, ప్రయాణమునకు సిద్ధమగుటకేగదా! ఆలాగు భోజనము చేసి ఏలీయా 40 దినములు ప్రయాణము చేసెను. అలాగే నీ శిష్యులు 40 దినములు కాదు, వాటికి మించిన ప్రయాణము చేస్తూ సాక్ష్యమిచ్చిరి. ***ఏలీయా బదరీ వృక్షమునుండి సీనాయి కొండకు ప్రయాణము చేసెను. నీ శిష్యులు శక్తిపొంది భూదిగంతములవరకు అనేకరెట్లు దూరము ప్రయాణము చేసిరి.*** అట్టి శక్తి నీవిచ్చినావు. అట్లే మాకును శక్తి ఇచ్చినయెడల రాకడకు సిద్ధపడుచూ, సువార్త సేవ చేయగలము. ఏలీయా, హోరేబు పర్వత దారిని వెళ్ళుతూ ఎవరితోను మాట్లాడలేదు. నీ శిష్యులు యెరూషలేమునుండి సమరయ వరకు సాక్ష్యమిచ్చుచూ, మాట్లాడుచూ వెళ్ళిరి. వారు ఊరికినే ప్రయాణము చేయలేదు. అలాగే

సేవలో మేము ఊరుకోక, మాకు ఎదురయ్యేవారికి మా ప్రభువు వార్త చెప్పే శక్తి దయచేయుము. వారు 'వాగ్దానము చేసిన ప్రభువు వచ్చినారనియు, ఆయనను మేము చూచినాము' అనియు చెప్పిరి. అయితే యేసుప్రభువు మొదటిసారి కాదు, 'ఇప్పుడు ఆయన రెండవసారి మేఘాసీనుడై త్వరగా వస్తాడని' మేము చెప్పవలెను. శిష్యులు మొదటి రాకడగురించి, మేము రెండవ రాకడనుగూర్చి చెప్పాలి. రాకడనుగూర్చి చెప్పుటకు మేము సిద్ధపడుటకు నీ శక్తి మాకు అవసరము. తీరా చెప్పితే, వారు ప్రశ్నలు వేసినపుడు చెప్పలేకపోతే, 'తెలియదు' అంటే ఏమి బాగుండును! **నీ శిష్యులు సాక్ష్యమిచ్చినట్లు మేమును యేసుప్రభువు అనుభవము పొంది, ఆయన దర్శనము చూచి, ఆయన మాటలు విని, 'ఆయన స్వరూపమును చూచుచున్నాము. ఆయన త్వరగా వచ్చుచున్నాడని' చెప్పితే నీ శక్తి ఉన్నట్లే.** లేని యెడల సాక్ష్యముకొరకు సిద్ధపడుట అవసరము. లేనియెడల యేసుప్రభువునుగూర్చి చెప్పుట అనే అనుభవము పోతుంది. మాకు 1) నీవు వస్తావని 2) సంఘాన్ని తీసుకుపోతావని ఈ రెండు సువార్తలు గలవు. అందులో (1) వచ్చినాడనే సువార్త, (2) వస్తారనే సువార్త చెప్పగలిగితే; నీవు, నీ శక్తి, నీ అనుభవము, నీ రెండవరాకడ వర్తమానము ఉన్నట్లే. లేనియెడల అంతా లేనట్లే. కాబట్టి నీ శక్తి దయచేయుము. బదరీ వృక్షమునుండి హోరేబుకు 40 దినముల ప్రయాణము గాని ఆ ప్రయాణంలో ఏలీయా ఎవరితోను మాట్లాడలేదు. అయితే శిష్యులు కంటితో చూచుచూ, నేల ఉన్నంతవరకు సాక్ష్యము చెప్పిరి. నేల ఉన్నంతవరకు సాక్ష్యమిచ్చుటకు వెళ్ళవలెనంటే శక్తి అవసరము. మాకు ఇంకా ఎక్కువ శక్తి ఎందుకు అవసరము అంటే దర్శనములో మహిమ క్రీస్తును చూస్తున్నాము. అయిననూ అన్నీ సందేహములే గనుక ఎక్కువ శక్తి అవసరము. 1. నడిచేటందుకు శరీర శక్తి (సర్కీటు), 2. చెప్పటానికి జ్ఞానశక్తి, 3. సిద్ధపడటానికి విశ్వాసశక్తి (రాకడ సువార్త చెప్పుటకు). ఈ మూడును మాకు అవసరమే. జ్ఞానానికి ఆత్మశక్తి కావాలి. అదే "తెలివిని గలిగించు, నన్ను దివ్వెగా వెలిగించు" అను వచనము. అనగా తెలివి, శక్తి ప్రతివారికి చెప్పే శక్తికావాలి. ఈ శక్తిని మనము మూడు విధాలుగా వాడినాము. మనము శిష్యులవలె సాక్ష్యమును చెప్పాలి గనుక సాక్ష్యశక్తి కావాలి.

టెలిస్కోపువల్ల దూరంగా ఉండే వస్తువు పెద్దదిగాను, దగ్గరగాను కనిపించును. శానిటోరియంనకు మిర్తిపాడు 6 మైళ్ళదూరము. టెలిస్కోపువల్ల కిటికీకి దగ్గరగా ఉన్నట్లు కనిపించును. అలాగే విశ్వాస నేత్రముద్వారా, క్రీస్తు రాక దగ్గరగానే మాకు కనిపించుచున్నదని నచ్చచెప్పాలి. **శిష్యులకు- 'ప్రభువును చూచినామని' చెప్పుటే బలము.** మనము విశ్వాసబలము, దర్శనబలము ద్వారా చూస్తున్నాము. ఈలాగు

చెప్పుమని పరిశుద్ధాత్మ మనలో ఉండి, తన స్వరమువల్ల రాకడ మిక్కిలి సమీపమని చెప్పుచున్నారు. మనలో 1) ఆత్మ, 2) ఆత్మశక్తి ఉన్నప్పుడు, మనము నమ్మినప్పుడు, ప్రార్థించినపుడు, **ఆయన మనలో ఉండి సాక్ష్యమిచ్చును.** గాన మనము పరిశుద్ధాత్మను కోరాలి. శిష్యులు అందరూ కొండపై కూడుకున్నారు. పాతనిబంధన కాలములో నెబుకద్నెజరు ఇశ్రాయేలీయులను చెరపట్టి తీసికొని వెళ్ళినాడు. ఇశ్రాయేలీయుల రాజ్యము పోయింది. గనుక మనకు రాజ్యము ఎప్పుడు వచ్చును? అని ఆయన శిష్యులలో కొందరు యేసుప్రభువును అడిగిరి. అపో.కార్య. 1:7. వాటిని తెలిసికొనుట మీ పనికాదు. అయినను మీరు శక్తి పొందినప్పుడు మీకు తెలియును. (1) మీకు తెలియదు (2) ఆత్మశక్తి ద్వారా తెలియును అని చెప్పెను. అనగా త్వరలో చెప్పుదును అని అర్ధము. ***ఈ యుగము పరిశుద్ధాత్మ యుగము,*** గాన పరిశుద్ధాత్మ సంఘమునకు తెలుపును. రాకడ ఘడియ తండ్రికి తెలియును. అయినను మీకు తెలియదు. పరిశుద్ధాత్మ వచ్చినప్పుడు మీకు తెలియును. మీరు భూదిగంతములవరకు వెళ్ళి సాక్ష్యమివ్వండి. అందరూ ఈ మాట నమ్మలేదు (మొదటి సువార్త), అలాగే రాకడ సువార్తను అందరూ నమ్మరు. ఉదా: ప్రభువు కనబడితే కన్ను చెదిరినదని ఒకరు అన్నారు. రాకడలో మనము వెళితే, ఏ గాలో వచ్చి వారిని ఎత్తుకొని పోయిందని కొందరనుకుంటారు గాని ప్రభువు రాకడలో వారు వెళ్ళిపోయారు అని నమ్మరు. యేసుప్రభువు నిన్ను రక్షిస్తాడు అది సువార్త. యేసుప్రభువు నన్ను రక్షించినాడు అది సాక్ష్య సువార్త. ఈలాగు మనము సాక్ష్యమివ్వాలి. ఆఖరు సువార్త రాకడ సువార్త, అది ఇపుడు చెప్పవలెను. బైబిలులో ఏ కథ నీకు ఇష్టము? ఇష్టమైన కథ చెప్పినప్పుడు నీవు చూచినావా? అది మా వేదములలోను ఉన్నది అని అన్నప్పుడు శక్తిలేనిదే తిరిగి వారికి చెప్పలేముగాని పరిశుద్ధాత్మ శక్తిగల వారమైనప్పుడు చెప్పగలము. రాకడను గూర్చి ఏ మాట వ్రాయబడినదో దానిగూర్చి అపో.కార్య. 1:7వ వచనములో ఉన్నది. ఆ కాలము ఉన్నది, రాకడ అనేది ఉన్నది. అపో.కార్య. 1:8లో ఆత్మ కుమ్మరింపు కాలమున్నది. వీటిలో రెండవరాకడకు సంబంధించిన కాలమున్నది. 'రెండవరాకడ కాలములో' అనగా త్వరగా, కొద్ది దినములలో రాకడ వచ్చును అని అర్ధము. ఇది పరిశుద్ధాత్మ చరిత్రలో ఉన్నది. కొద్ది దినములలో అనగా 'త్వరగా' అని అర్ధము. 'ప్రభువైన యేసూ రమ్మను ప్రార్ధన నేర్పుమో ప్రభువా!...' 'నేనిక సిద్ధంబుగా లేను' అనువచనము. ॥త్వరగా॥

మొదటి ఆత్మ = యెహోవా దేవుడు; రెండవ ఆత్మ = యెహోవాయొక్క నామము, యేసుక్రీస్తు; మూడవ ఆత్మ = పరిశుద్ధాత్మ మనచేత ఆరాధన

చేయించుచున్నారు. ఆత్మ లేనిదే జీవము ఉండదు. సీనాయి పర్వతములో త్రిత్వము ఉన్నారు. ఆది 1:1లో దేవుడని మొదట ఉన్నది. వెలుగు కలుగును గాక అనే వాక్యములోని పేరు యేసుక్రీస్తుదై యున్నది. యోహాను 1లో ఆదియందువాక్యము ఉండెను అని ఉన్నది. ఆ వాక్యము యొక్క క్రియ జరుగుచున్నట్లు చేయుట పరిశుద్ధాత్మ పని. యేసుప్రభువుకు 11మంది శిష్యులు ఉన్నారు. వారు ప్రభువు వెళ్ళుట చూచిరి. వారిలో ఎవరు మిగిలిపోయిరి? యూదా ఇస్కరియోతు. అలాగే సంఘము వెళ్ళిపోగా ఇస్కరియోతు యూదావలె అనేకులు మిగిలిపోదురు. **ప్రశ్న:** ఎవరికి పరిశుద్ధాత్మ శక్తి దొరుకుననగా కూడుకొన్నవారికి. అపో.కార్య. 1:6. అలాగే ఎవరైతే పూనుకొని వస్తారో, వారికి పరిశుద్ధాత్మ శక్తి. వారికే పరిశుద్ధాత్మ శక్తి ఇచ్చును. 'నాయందు విశ్వాసముంచువారు నాకంటె గొప్పకార్యములు చేస్తారు' అని ప్రభువు చెప్పెనుగదా! అది ఏదంటే; యేసుప్రభువు భూదిగంతముల వరకు వెళ్ళలేదు గాని శిష్యులు భూదిగంతముల వరకు వెళ్ళి సాక్ష్యమిచ్చిరి. మనకును అట్టి గొప్పస్థితి రావలెనంటే 10దినములు కూడుకొని ప్రార్థించినయెడల భూదిగంతముల వరకు వెళ్ళగలము. ప్రభువు చేసినవి ఇంకా అనేక సంగతులు ఉన్నవి అని యోహాను 21:25లో యోహాను వ్రాసెను. ఆయన యూదయ, సమరయ పాలస్తీనా ప్రాంతములలో మాత్రమే తిరిగెను. అప్పటివరకు యోహాను 20వ అధ్యాయము వ్రాసి కలము పెట్టివేసి, ఆ తర్వాత 21వ అధ్యా॥ వ్రాసెను. ఇక వ్రాయశక్తిలేక 21:25వ వచనము వ్రాసి, పత్మాసులంకలో మరలా కలము ఎత్తెను. ఈలోగా పత్రికలు వ్రాసెను.

**ప్రార్థన:-** పరిశుద్ధాత్ముడవైన ఓ తండ్రీ! నిన్నుగూర్చి విన్న మహిమ సంగతులు బైబిలులో వ్రాయబడినట్లు; మా మనస్సులో, జ్ఞానములో వ్రాయుమని వేడుకొంటున్నాము. నీవు అగ్ని బాప్తిస్మమిచ్చినందున నీ శిష్యులు బోధించిరి. ఆలాగే మాకును ఇమ్ము. స్తెఫనుతో పండితులు వాదించినప్పుడు, వారు జవాబు ఇవ్వలేక స్తెఫనును రాళ్ళతో కొట్టిచంపిరి. ఆ స్తెఫను పండితుల జ్ఞానమునకు మించిన జ్ఞానముతో చెప్పెను. అట్లే లోకములోని గొప్పగొప్ప పండితుల ప్రశ్నలను ఎదుర్కొనగలిగిన నీ ఆత్మ జ్ఞానశక్తి, మాకును అవసరము గనుక అనుగ్రహింపుము. మా కొరకు నీ కుమారుని ఇచ్చిన తండ్రీ! నీ కుమారుని నామమున వందించుచున్నాను. ఆమేన్.

ఆశీర్వాదము : మన ప్రభువైన యేసుక్రీస్తు కృప, తండ్రియైన దేవుని ప్రేమ, పరిశుద్ధాత్మయొక్క సహాయము మనకు నిత్యము తోడైయుండునుగాక! ఆమేన్.[1]

---

**1. 21.5.1955వ సం॥లో దేవదాసు అయ్యగారు చేసిన ప్రసంగము.**

# ఆత్మకుమ్మరింపు కూటములలోని ఆరవ దినము - బుధవారము

## పరిశుద్ధాత్మ వరములిచ్చుట, బోధించుట

1కొరింథి. 12:1-31.

**సలహా:** 1. ఆత్మ బలహీనతలు, 2. శరీర బలహీనతలు, 3. కుటుంబములో ఉన్న బలహీనతలు, పరిశుద్ధాత్మ తండ్రి పాదముల ఎదుట పడవేసి కనిపెట్టవలెను. మోకాళ్ళమీద నిలువబడవలెను, చేతులు కట్టుకొనవలెను, కండ్లు మూసికొనవలెను, ఇతర సంగతులు మనస్సులోనికి రానియ్యకూడదు. పరిశుద్ధాత్మను మాత్రమే తలంచు-కొనవలెను. నీ బలహీనతలన్నీ ఆయన పాదముల యెదుట పడవేయవలెను. ఆ తర్వాత కనిపెట్టవలెను.



**ప్రార్థన:-** ప్రార్థన చేయవలెననే తలంపు లేనప్పుడు, ఏ మంచి పనియైన చేయుటకు ఇష్టము లేనప్పుడు, ఇష్టము పుట్టించే తండ్రీ నీకు స్తోత్రములు. చెడుగు మానుటకు ఇష్టములేని సమయములో, పాపముమానే తలంపు పుట్టించే తండ్రీ! నీకు స్తోత్రములు. మేము పరలోకమునకు వచ్చిన తర్వాత నీ పని కెరటాల వలె కనబడును. గాన ఆశ్చర్యపడుదుము. ***పరిశుద్ధాత్మవగు దేవా! ఈ పేరు నీకు చాలదు. ఇంతకంటే ఎక్కువైన పేరు నీకులేదు.*** అందుచేత ఈ పేరే వాడుచున్నాము. నీ పనికి, నీ గుణానికి ఈ పేరు స్వల్పమని తోస్తున్నది. ఆత్మ అని చెప్పుచున్నారు అది గొప్ప పేరే. అయితే, ఇంకా గొప్ప పేరు కావలెను. ఓ ప్రభువా! ఓ దేవా! నేను నిలిచి ఉన్నానని తలంచితే పడకుండా ఉండాలని నీ వాక్యములో వ్రాయించినావు. పరిశుద్ధాత్మ దేవా! నేను బైబిలును ప్రార్థనను సువార్త ప్రకటనను మోక్షలోక భాగ్యమును నీ కుమారుడైన యేసుక్రీస్తును, తండ్రిని, నిన్ను ఎరుగుదును. ***అయినప్పటికిని నీ సహవాసము లేకపోతే ఇప్పుడున్నవన్నీ శూన్యమగును.*** కాబట్టి నిత్యము మాలో ఉండి పనిచేయుము అని వేడుకొనుచున్నాము. ఏది సత్యమో, ఏది లోకరీతిగా ధన్యమో, భాగ్యమో (క్రీస్తుని ఎరుగనివారిలో ఉన్న మంచితనము), బైబిలులో ఉన్నదంతా సత్యమని నమ్ముచున్నాను గాని అవలంభించలేకపోవుచున్నాను. అనేకమైన కోరికలు కలిగి, 'అది దయచేయుము, ఇది దయచేయుము' అని అడుగుచూ ప్రార్థించు-చున్నాను గాని కొన్ని పొందలేకపోవుచున్నాను. గనుక నిన్నే ఆశ్రయించుచున్నాను. మా ప్రార్థనలకు జీవము కలిగించుమని వేడుకొంటున్నాము. నీ వాక్యము చదివేటప్పుడు గ్రహించుటకై ఏలాగు వెలిగింపు కలిగించుచున్నావో, అట్లే ప్రార్థించేటప్పుడు విశ్వాసము,

విశ్వాస ఉద్రేకము కలిగించుమని వేడుకొంటున్నాము. మరియు చదివిన ప్రకారము ప్రార్థించిన ప్రకారము జీవితమును సరిచేసుకొనలేక పోవుచున్నాను. సరి అనగా ఏది మంచియో తెలిసికొనక పోవుట, అనగా ఏమియో తెలిసికొనకపోవుట, అనగా ఏమి చేయవలెనో తెలుసును గాని అట్లు సరిపుచ్చుకొనలేక పోవుచున్నాము గనుక నీవనుగ్రహించే సమస్త తెలివి, సత్తువ, ప్రేరేపణ, ఉజ్జీవము, చురుకుదనము, ఉపాయము అనుగ్రహించుము. ఒకరు బాగా నడువగలిగి, కొంతదూరము నడిచి అలసి మందగాములు అయినప్పుడు ఒక స్నేహితుడు నడిపించును. ప్రభువా! అట్లే నీవు వచ్చి చెయ్యి పట్టుకొని క్రొత్తగా జీవము పుట్టించి నడిపింతువు. (అలసినవానికి నీళ్ళు పట్టించి నడిపించురీతిగా నన్నును నడిపించుము.) తండ్రీ! అట్లే చేయుము. ఆమెన్. తండ్రీ! బైబిలులో ఉన్నదంతయు, విశ్వాసులు అనుభవించేదంతయు, సత్య సంఘములో నీవు పెట్టినదంతయు మాకు తెలుసునుగాని ఏది ఎప్పుడు, ఏ రీతిగా, ఎంత అవలంభింపవలెనో, అది తెలియుటకై నీ జీవన ఉజ్జీవము అగత్యమైయున్నది. కీర్తన: (నన్నును భక్తులను.... మాపి వేయుము దేవా!) ఓ తండ్రీ! నీ మాట వినకుండా పూర్తిగా చెడిపోయే మనిషిని నీవు విడిచిపెట్టవు. బహుగా దుఃఖిస్తావు. అది అతనికి తెలియదు. ఓ పరిశుద్ధాత్మవైన దేవా! నా ప్రియుడవైన తండ్రీ! నేను జన్మించుటకు, బ్రతుకుటకు పరలోకము వెళ్ళే నిమిత్తమై చనిపోవుటకు నీవే కారణమైయున్నావు. నేను ఒకవేళ నిన్ను విడిచిపెట్టినను, నీవు నన్ను విడువవు. గనుక నిన్ను స్తుతించు-చున్నాను. నా స్తుతిలో ఆమేన్ అనుచున్నాను. ఈ స్తుతి క్రొత్త రకపు పలుకైయున్నది. పరిశుద్ధాత్మ తండ్రీ! మనిషి మారుమనస్సు పొందువరకు నీవు కనిపెట్టుచుండగా, మేము నీ కొరకు కనిపెట్టే నైజము అనుగ్రహించుము. నీకు ఏమి కావలెనని ప్రభువును అడిగినపుడు అనగా పాడేవరము, బైబిలు చదివేవరము, ప్రార్థనావరము మొదలైనవి, నేను అడిగేవిగాక, 'నాకు ఏమి కావలెనని లేదా నాకు ఏమి ఇయ్యవలెనని, నీ మనస్సులో ఉన్నదో, అది నాకు అనుగ్రహించుము. ఆమేన్.

**షరా:-** పాటిరేవులో ఇద్దరు వెళ్ళునప్పుడు వెనుక కుర్రవాడు ముందువెళ్ళు ఆయన చెయ్యి విడిచినయెడల, కొట్టుకొనిపోవును. ముందు వెళ్ళుచున్న ఆయన విడిచినను, కొట్టుకొని పోవును. అయితే, పరిశుద్ధాత్మ మాత్రము విడువడు. అరణ్యములో ఇద్దరు ప్రయాణము చేయుచూ ఒకడు అలసిపోయి పడిపోయెను. రెండవ వ్యక్తి వానిని లేవనెత్తలేక విడిచి వెళ్ళిపోయెను. అయితే పరిశుద్ధాత్మ తండ్రి! నిన్ను అట్లు విడువక దగ్గరనే నిలుచుండి కనిపెట్టుచుండును.

**వరములనుగూర్చి:-**

వరము కావలెను అంటే మోకాళ్ళమీద ఉండి ప్రభువును అడగాలి. తర్వాత వెంటనే పని ఆరంభించవలెను. పని వేరు. వరము వేరు. ఇక్కడ పని జరుగుచున్నది గాని వరములేదు. ***వరము అనగా మాట చెప్పగానే పని జరుగుట. వరము రావలెను అంటే పనిచేయవలెను. పనిచేయగా చేయగా, చేయగా వరము వచ్చును.*** మంగలి, రోడ్డుమీద నడుస్తూ మగవారి గడ్డాలవైపు చూస్తు ఉండెను. ఆలాగే వరము కలవారు జబ్బుకలవారిని చూస్తూ వారిని బాగుచేయవలెను. వారికి స్వస్థత ప్రతి దినము చేయవలెను. *"అభ్యాసము చేస్తే తుదకు వరము అగును. ఒక దరినుండి పని జరుగుచుంటే తుదకు వరము అగును".*

ప్రార్థన:- పరిశుద్ధాత్మ తండ్రీ! ఎవరెవరికి ఏ వరము కావలెనో, ఆ వరములు ఇచ్చి వాడుకొనే కృప దయచేయుము. ఈ వరండామీద ఉన్నవారి హృదయములో ఏయే వరములు ఉన్నవో, వాటిని నెరవేర్చుమని వేడుకొంటున్నాము. ఆమేన్.

మార్కు 13:11. ఇప్పుడు ఈ వాక్యములో ఉన్న పద్ధతి ప్రకారముగా నేను ఈ వృద్ధాప్యములో ఉపన్యాసము ఇస్తున్నాను. నేను చెప్పునది అందుకొని ఒకరు ఎదుట ఉన్నవారికి చెప్పడము ఎట్లో, అట్లే అధికారులు శిష్యులను ప్రశ్నించుటకు పిలిచినప్పుడు పరిశుద్ధాత్మ శిష్యులకు చెప్పును. వారికి చెప్పవలసిన దానిని చెప్పును. శిష్యులు ఎదుటి వారికి అనగా ప్రశ్నించుచున్న అధికారులకు ఆ సంగతులు చెప్పుదురు గాన 'ఏమి చెప్పవలెనను దానినిగూర్చి' ముందుగా వారు ఆలోచించనక్కరలేదు. విమర్శకులు ఏమి అడుగుదురో అది శిష్యులకు తెలియదు గాన, జవాబు సిద్ధపరచుట ఎట్లు? అందుచే వారు అడుగునది పరిశుద్ధాత్మకు ముందే తెలియును గాన ఆయన వారికి అందించును. కాబట్టి వారు చింతించి భయపడనక్కరలేదు. వారు స్వయముగా జవాబు చెప్పితే అవతలవారికి నచ్చక కలహింపవచ్చును. ఆత్మ చెప్పును గాన అవతల వారి నోళ్ళు కట్టివేయబడును. ముందుకు విమర్శకులు శిష్యులను పిలుతురనియు, వారిని ప్రశ్నింతురు అనియు ఆత్మకు తెలియును. ఇది ఎందుకు అనగా యేసు ప్రభువుతో మూడు సం॥లు ఉండి, ఆయన బోధలు, అద్భుతములు వారు అనుభవించిరి. అది యేసుప్రభువు భూలోకములో ఉన్నపుడు చేసిన పని. గనుక ఆయన వెళ్ళిపోయిన తర్వాత దురాత్మ విరోధులలో ప్రవేశించి, హింసించును గాన ఆత్మ శిష్యులకు జరుగబోవు సంగతులు తెలియజేయును. నేడునూ అట్లేయున్నది.

మనము మంచి మీటింగులుపెట్టి, మంచి బోధలు వినిపించిన పిదప, దురాత్మ ఏ గుమ్మములో నుండియో, ఏ కిటికీ పెంకులలో నుండియో ప్రవేశించి, కలత పెట్టును. మనము మీటింగులలో బలము, జ్ఞానము పొందిన పిదప బయటకు పోయి సేవచేస్తుండగా, వినువారిలో దురాత్మ దూరి అనేక ప్రశ్నలు, మొండి ప్రశ్నలు వేయించును. అప్పుడు మీటింగు సంతోషముపోయి మనస్సు కలత పడును. గాన ఇతరులకు సమాధానము చెప్పవలసిన భారము మనమీద వేసికొనక పరిశుద్ధాత్మమీద వేయవలెనని ప్రభువుయొక్క తలంపు. ఇందులో ఒక విచిత్రము ఉన్నది. ఇదిగో నేను వెళ్ళుచున్నాను గాని సదాకాలము మీతో ఉన్నాను అని చెప్పిన ప్రభువు 'విమర్శన శాలలోనికి వచ్చి మీకు మాటలు అందిస్తాను' అని అనక 'పరిశుద్ధాత్మ అందించును' అని చెప్పెను. ఆయన ఎందుకు అందించడు? ఆయన ఉన్నాడుగదామరి! ఆత్మ ఎందుకు అందించవలెను? ఎందుకనగా, ఇదివరకు చెప్పినట్లు త్రిత్వములోని ముగ్గురు వారివారి పనులు పంచుకున్నారని కనబడుచున్నది. ఇప్పుడే ఇక్కడే అపో.కార్య 1:6లో ఉన్న వాక్యమును తలంచుకొనండి. 1) కాలములను, సమయములను తన స్వాధీనమునందు ఉంచుకొనుట తండ్రి కార్యక్రమములోనిది. 2) విమర్శకుల ఎదుట మీకు సహాయము చేయుట, పరిశుద్ధాత్మ ప్రోగ్రాం. 3) దగ్గర నిలువబడుట, కుమారుని ప్రోగ్రాం. 'నేను సదాకాలము మీతోకూడా యున్నాను' అని ప్రభువు చెప్పారు గనుక విమర్శకుల ఎదుట మనమున్నప్పుడు మన దగ్గర నిలువబడుట క్రీస్తు ప్రభువు ప్రోగ్రాం. **పని ఒకరిదైనను ముగ్గురు ఉందురు.** అయ్యా! మీరు ఇంకా పండుగకు వెళ్ళరా? అని ఒకరు ప్రభువును అడిగినప్పుడు ఆయన వారికి నా సమయము ఇంకా రాలేదని జవాబు చెప్పెను. ఆయన సమయము అనగా పండుగ సమయము. అది క్రీస్తు ప్రోగ్రాంములో ఉన్నది. ద్రాక్షారసము చేయవలసి వచ్చినప్పుడు నా సమయము ఇంకా రాలేదని చెప్పెను, ఆ సమయము కుమారుని ప్రోగ్రాంలో ఉన్నది. ప్రకటన 4:5లో 7 ఆత్మలున్నవి అని ఉన్నది. ఇవి దేవుని ఆత్మలు. దేవుడే ఆత్మ. అయినను ఆయా పనులకు అవసరమైన ఆత్మపని జరుగవలసియున్నది.

**ఉదా:** మనము ఒక్కరమే అయినను, 1) చేతితో పనిచేస్తున్నాము, 2) కంటితో చూస్తున్నాము, 3) చెవితో వింటున్నాము, 4) నోటితో మాట్లాడుచున్నాము, 5) కాలితో నడుచుచున్నాము, 6) జ్ఞానముతో ఆలోచించుచున్నాము, 7) మనస్సాక్షితో అంగీకరిస్తున్నాము. అలాగే దేవునిఆత్మ ఏడు రకములుగా పనిచేయును. దేవునికి

ఏడు ఆత్మలు ఉన్ననూ, ఆత్మ ఒక్కడే. **అయితే ఆ ఆత్మ పని ఒక్కొక్క మనిషిలో ఏడు విధములుగానున్నది.** యెషయా 11:2లో దేవుని శక్తులున్నవి. ఉదా: నేను కూర్చున్నప్పుడు నాలోని శక్తులు బయటకు వచ్చి పనిచేయుటలేదు. అయినను అవి నాలో ఉన్నవని నాకు తెలియును. అవసరము వచ్చినప్పుడు నా శక్తులు కనబడును. అట్లే దేవుడు అనాదియందు ఒంటరిగా ఉన్నప్పుడు ఆయన ఆకాశము చేయలేదు, ఏదీచేయలేదు. కాని సృష్టియొక్క ఆరంభములో ఆకాశమును ఒకసారి, భూమిని ఒకసారి, వాటిలోనున్న సమస్తమును కొన్నిసార్లు; తుదకు మనిషిని ఒకసారి చేసినట్టు కనబడుచున్నవి. చేయబడిన వస్తువులు ఎన్ని ఉన్నవో అన్ని శక్తులు దేవునిలో ఉన్నవి. గాని అవి క్రమముగా బైలుపడినవి. ఏడు మాత్రమేకాదు ఇంకా అనేకములు దేవునిలో ఉన్నవి. గనుకనే మనము ఆయన పనులలో ఇంకా అనేకము చూస్తున్నాము. 'నా చేతితో అనేక పనులు చేయగలను. నోటితో అనేక పనులు చేయగలను. అలాగే ఇతర శక్తులతో అనేక పనులు చేయగలను'. అవి శక్తులు, నేను వ్యక్తిని. **అట్లే సృష్టిపనులన్నియు ఆయన శక్తులు. అనగా ఆయన ఆత్మలు.** ఆయన వ్యక్తి. ప్రకటన 1వ అధ్యాయములో ప్రభువు 7రకములుగా ప్రత్యక్షపరచుకొనెను. ఏడు ప్రత్యక్షతలు ఇవే. ఏడు సంఘములలో ఏడు రకములైన పనులు గలవాడుగా కనపర్చుకొనెను. అనగా ఏడు నక్షత్రములు, ఏడు పట్టణములు, ఏడు సంఘములు, ఏడు ప్రత్యక్షతలు ఏ సంఘముయొక్క ఆత్మ స్థితి ఏలాగున్నదో, ఆ సంఘముయొక్క ఆదరణకు ఏ ప్రత్యక్షత అవసరమో, ఆ రీతిగా తన ప్రత్యక్షత అనుగ్రహించెను. **యోహానుయొక్క ప్రత్యేక వరము ఏదనగా, పరిశుద్ధాత్మ బాప్తిస్మము స్థాపింపబడకముందే, యోహాను ఆత్మతో నింపబడెను.** నీటి బాప్తిస్మము స్థాపింపకముందే యోహాను ఆత్మ బాప్తిస్మము పొందెను. అపో. కార్య. 2:38లో విశ్వాసులు మారుమనస్సుపొంది బాప్తిస్మము పొందిరి.

| | |
|---|---|
| 1. బోధ 2. నమ్మకము 3. మారుమనస్సు<br>4. బాప్తిస్మము 5. ఆత్మ బాప్తిస్మము. | ఇది బైబిలు క్రమము. |
| 1) పరిశుద్ధాత్మ మీమీదికి వచ్చును.<br>2) పరిశుద్ధాత్మ అభిషేకము కలుగును.<br>3) పరిశుద్ధాత్మ కుమ్మరింపబడును<br>4) ప్రభువునుండి పరలోకమునుండి రావడము<br>5) 120మంది మీదికి ఆత్మ రావడము. | ఈ ఐదును నీటిబాప్తిస్మము అనగా నెత్తిమీద నీళ్ళుపోయు బాప్తిస్మముతో సమానము. |

Bible Mission HQ Guntur

**షరా:-** బాప్తిస్మములో, నీళ్ళుతెచ్చి మనిషికి బాప్తిస్మము నివ్వవలెనుగాని మనిషిని తీసికొనివెళ్ళి నీళ్ళలో ముంచడము, నీళ్ళకు బాప్తిస్మమైనట్లు ఉన్నది. నీళ్ళకు బాప్తిస్మము ఇవ్వటమేమిటి? మనిషికి ఇవ్వవలెనుగాని.

**బాప్తిస్మ వివరము:-**

మత్తయి 3:11. ఈ వచనములో నీళ్ళతో ఇచ్చు బాప్తిస్మము కలదు. మరియు పరిశుద్ధాత్మతో ఇచ్చు బాప్తిస్మము కూడా కలదు. రొట్టె ద్రాక్షారసములతో పాటు ప్రభువుయొక్క శరీర రక్తములుకూడ ఇవ్వబడినట్లు, నీళ్ళ స్నానముతో పాటు పరిశుద్ధాత్మ బాప్తిస్మముకూడా ఇయ్యబడెను. మారుమనస్సు పొందుటకు యోహాను బాప్తిస్మము ఇచ్చెను. ఇది క్రైస్తవ బాప్తిస్మము కాదు. క్రీస్తు వచ్చినాడని తెలుసుకొని, మారుమనస్సు పొందవలెనని యోహాను ఆ బాప్తిస్మమును యూదులకిచ్చెను. అప్పటికి క్రైస్తవ బాప్తిస్మము పుట్టలేదు. క్రైస్తవ బాప్తిస్మము యేసుప్రభువుయొక్క కడవరి ఆజ్ఞలో ఉన్నది. మత్తయి 28:19; మార్కు 16:16. ***యేసుప్రభువు నీళ్ళతో బాప్తిస్మము పొందినప్పుడు వెంటనే పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందెను. మనమును అట్లే పొందుట ధర్మమైయున్నది. గాని బాప్తిస్మము పొందిన కొన్ని ఏండ్లకు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుచున్నాము.***

ఎఫెసీ పట్టణస్థులు పరిశుద్ధాత్మ సంగతి ఎరుగకుండా యోహాను బాప్తిస్మము పొందిరి. అది రెండవ బాప్తిస్మము కాదు. యోహాను ఇచ్చిన బాప్తిస్మము యూదుల బాప్తిస్మము. అది క్రైస్తవ బాప్తిస్మముకాదు. మొదటి బాప్తిస్మము గాని రెండవ బాప్తిస్మముగాని కాదు. ***నీటియొక్క మొత్తము ముఖ్యముకాదు గాని దాని ఉపయోగము ముఖ్యము.*** వాక్యములో1) 'పరిశుద్ధాత్మ కుమ్మరింపబడెను' (లేక) 'వ్రాలెను' అని ఉన్నది. ***కుమ్మరింపబడుట అనగా పైనుండి పోయునదిగాని నీళ్ళలో మునుగునది కాదు*** 2) స్నానము అనగా వట్టిగా నీటిలో మునుగుట స్నానముకాదు. స్నానమనగా తోముకొనవలెను. వారు తోముకొనుట లేదుగాన అది మునుగుట అగును గాని స్నానము (బాప్తిస్మము) అవ్వదు. (1) ముంచుట, (2) చిలకరించుట, (3) కడుగుట, (4) కొంచెము నీళ్ళు పోయుట ఇవన్నీ స్నానములో భాగమైయున్నవి. ప్రభురాత్రి భోజనము ఇచ్చేటప్పుడు చిన్న రొట్టె ఇస్తున్నారా? పెద్ద రొట్టె ఇస్తున్నారా? చిన్నదే. చిన్నది ఇచ్చినను దానిని భోజనము అంటున్నారా? లేదా? అంటున్నారు. సాధారణముగా అన్నము, కూరలు, పండ్లు మొదలైనవాటినన్నిటిని కలిపి భోజనము అంటున్నారు. కూరలు మొదలైనవి లేకుండా వట్టి అన్నమునే భోజనము అంటామా?

అనము. అన్నీ కలిస్తేనే భోజనము అవుతుంది. అయితే సంస్కార సమయములో చిన్న రొట్టెను భోజనమే అన్నారుగదా! అట్లే చిలకరింపునకు ఉపయోగించేవి కొంచెము నీళ్ళు అయినను, అది బాప్తిస్మమే. **పరిశుద్ధాత్మ పైనుండి వచ్చేది గాన నీళ్ళు పైనుండి పోయవలెను.** నీళ్ళకు ఎవరైనా ఆటంకము చేయగలరా? గనుక ఇక్కడ నీళ్ళు మనిషి దగ్గరకు రావడము అని అర్ధము. ముంచడములో మనిషి నీళ్ళ దగ్గరకు రావడమని అర్థము. నీళ్ళ దగ్గరకు మనిషి వెళ్ళటమే ఉంటే, మనిషిని ఎవరైనా ఆటంకము చేయగలరా? అని ఉండును. అయితే, ***ఇందులో మనిషి దగ్గరకు నీళ్ళే రావడమై ఉన్నందున, లేక నీళ్ళు తేవడమై ఉన్నందున నీళ్ళకు ఎవడైన ఆటంకము చేయగలడా?*** అని పేతురు అనెను. దయగల ప్రభువని వ్రాయబడి ఉన్నది గనుక నీటి పరిమాణము కన్నా విశ్వాసము, రక్షణ ముఖ్యము. ఆచారమువల్ల గాని, మిషనువల్లగాని రక్షణరాదు. అయితే, మనిషి దగ్గరకు తీసికొని రావలసినందున నీళ్లకు ఎవరైనా ఆటంకము చేయగలరా? నీళ్ళు ఎప్పుడైతే పైనుండి వచ్చునో అప్పుడే పరిశుద్ధాత్మకూడా మనపైకి వచ్చుచున్నాడు. బాప్తిస్మమునకు (1) బోధ, (2) మారుమనస్సు, (3) నమ్మిక అవసరము. అప్పుడు బాప్తిస్మము ఇయ్యవలెను. ఈ పై మూడు మన బాప్తిస్మములో కలవు గాని చిన్నపిల్లల బాప్తిస్మములో పై మూడు లేవుగాన నిర్ధారణ కాలమందు పై మూడు వారియందు స్థిరపరచబడుచున్నవి. దేవుని వాగ్దానములు ఎన్నో వేలు ఉండగా, ఏ కారణము చేతనైనను, దిలుగుపడుట దేవుని దూషించినట్లే అగును. 'నీవు హత్య చేయబడుదువు' అను స్వరము వినబడినపుడు ఏ మాత్రము భయపడవద్దు. ఏది తింటున్నా, ఏమిచేస్తున్నా, "యేసూ! నీ తలపే నాకు ఎంతోహాయి" అని తలంచుకొనండి.

1) వాక్యము చదువుట, 2) వివరించుట, 3) ప్రార్థించుట ఆసక్తితో జరిగించుకొనవలెను.

ప్రార్థన:- ఓ పరిశుద్ధాత్మవైన తండ్రీ! అన్ని వాక్యాలలో, అన్ని కాలాలలో, ఇదే మా ప్రార్థన. సృష్టిచేయబడినప్పుడు కోడిపెట్ట గ్రుడ్డుపై పొదుగుచున్నట్లుగా, పిల్లలు వచ్చిన పిదప గ్రద్ద వాటి దగ్గరకు రాకుండా నీ రెక్కలు మా మీద ఉంచుము. నీళ్ళచేతకాదు, రాళ్ళచేతకాదు గాని నీ ఆత్మతో నా హృదయమును నింపుము. ఇదే మా చివరి ప్రార్థన. ఆమేన్.[1]

---

**1. 25.5.1955వ సం॥లో దేవదాసు అయ్యగారు చేసిన ప్రసంగము.**

# ఆత్మ కుమ్మరింపు కూటములలోని ఏడవ దినము-గురువారము

## స్వర్గీయ భాష

1కొరింథి. 14:1-33.

**షరా:-** మొదటిపని వినదగినది: 1) ఒక మతమునుగూర్చియైనా, 2) ఒక మత సిద్ధాంతముగూర్చియైనా, లేదా 3) ఒక మతసంబంధ పత్రికనుగూర్చియైనా, ఈ మూడింటినిగూర్చియు మనము పూర్తిగా వినవలెను. ఎవరు చెప్పినా సరే పూర్తిగా వినవలెను. రెండవపని పరీక్షించదగినది: (1) పరీక్షించవలెను అనగా విన్న సంగతులన్నియు మంచివా? కావా అని పరీక్షించవలెను. (2) సరియని తోచిన యెడల గైకొనవలెను. (3) ద్వేషము మాత్రము పనికిరాదు. ఈ మూడు సూత్రములు అంగీకరించువారు ధన్యులు.



**ప్రార్థన:- మా తండ్రీ! మాలో నీ ఆత్మను ఉంచిన తండ్రీ! నీకు స్తోత్రములు. మేము నీ వారము గనుక నీదగ్గరనుండి వచ్చినవారము గనుక నీ మాటలు మాకు అర్థమగునట్లు నీ పరలోకపు భాషను మాకు నేర్పించి, నీ ఆత్మ సంగతులను బోధపరచి, మా అనుభవములో నిత్యము ప్రత్యక్షపరచుచుండుమని పరిశుద్ధాత్మ తండ్రి నామమున వందించుచున్నాము. ఆమేన్.**

**పరిశుద్ధాత్మ ప్రసంగమునకు ముందు వివరింపవలసినవి:**

1. దైవలక్షణములు- దైవలక్షణములలో దేవుని ప్రేమ గొప్పది.
2. ప్రవచనము- ఆత్మనుగూర్చిన వాగ్ధానము.
3. భాషలు- స్వర్గీయభాష.

***(1) దైవలక్షణములు:*** దేవునిలోని లక్షణములు మనకును రావలయును. అనగా దైవలక్షణములైన ప్రేమ, న్యాయము, జీవము, శక్తి, విశ్వాస్యత, మొ॥నవి మనలో ఉండవలెను.

***(2) ప్రవచనము:-*** అనగా రాబోవునవి ముందుగానే చెప్పుట మరియు బైబిలులోని సంగతులు బోధించుట. ఈ రెండు చేయువారు ప్రవక్తలు. ప్రకటనలోని సంగతులు జరుగుచున్నవి. ప్రవక్తలు ఎప్పుడును స్వంత సంగతులు చెప్పరు. ఈ ప్రవక్తలు దైవాత్మ బలముచేత పత్రికలువ్రాసి చనిపోతే, అదే కాలములో (లేక) మరికొంత కాలమునకు దైవాత్మబలముతో ఇంకొక భక్తుడు వాటి వివరము చెప్పితే వారును ప్రవక్తలే.

Bible Mission HQ Guntur

***(3) భాష:–*** ఇదియొక వరము. దేనికదేగాని ఈ మూడింటిని కలుపరాదు. విశ్వాసము వల్ల రక్షణ కలుగును. భాషవస్తేనేగాని రక్షణ లేదా? కాదు. విశ్వాసమువల్ల రక్షణ కలుగును. *విశ్వాసము:*– 1) వినుటవల్ల 2) పరీక్షించుటవల్ల 3) గైకొనుటవల్ల 4) ద్వేషము లేకుండుటవల్ల విశ్వాసము కలుగును. వరప్రదుండు అనగా వరములను ఇచ్చువాడు అనగా పరిశుద్ధాత్మ.

*భాషలు రెండు రకములు అనగా రెండు తరగతులు.*

1. (1) భూలోక భాష, (2) పరలోక భాష

*అలాగే ప్రవచనములు రెండు రకములు.*

2. (1) భూలోక ప్రవచనము, (2) పరలోక ప్రవచనము,

విశ్వాసమనగా 1. తెలిసినమ్ముట, 2. తెలియకుండగనే నమ్ముట.

పెంతెకొస్తు దినమందు వారు అన్యభాషలు మాట్లాడిరి. ఇది భూలోక భాషలవలె మాట్లాడే వరము. ఇవి మనిషిచే నేర్పించుకొనవచ్చును. అందుకు, పుస్తకములు, పంతుళ్ళు, ప్రజలు ఉన్నారు. ఇది కష్టమైన విషయముకాదు, గాని పెంతెకొస్తప్పుడు ఆది సంఘమును ఆయన స్థాపించుచున్నారు గాన వారికి అవసరమైనందున భూలోక భాషలిచ్చిరి. ***గనుక మనమును పెంతెకొస్తును తలంచి మరాటీవారిని జూచి స్తుతిస్తే మరాటీ భాషవచ్చును.*** 1కొరింథి. 13వ అధ్యాయములో మనుష్యుల భాష, (2) దేవదూతల భాష అని వ్రాయబడినది. బైబిలులో 14 వరములున్నవి. గాని ఈ వరమంతా స్పష్టముగా ఏ వరమునూ వివరింపబడలేదు.

| 1 | 2 | 3 |
|---|---|---|
| దేవుడు ఉండే ఆత్మలోకము | దేవదూతలుండే ఆత్మలోకము | దయ్యములు ఉండే ఆత్మలోకము. |

మూడును ఆత్మ లోకములే. ఆలాగే మనుష్యుడు 3 భాగములు. 1) శరీరము 2) ప్రాణము 3) ఆత్మ. (1) శరీరమున్నది ఇది కనబడును. (2) ప్రాణమున్నది. ఇది మాట్లాడును. దుఃఖించును, సంతోషించును. (3) ఆత్మ ఉన్నది. దీనిపని అంతగా తెలియదు.

దేవుడు మాట్లాడితే దేవదూతలకు తెలియును, దయ్యములకు తెలియును, మనిషి ఆత్మకు తెలియును. గాని దేవుడు మాట్లాడితే మనిషికిని, మనిషి ప్రాణమునకునూ తెలియదు. మనిషిలోనుండే ఆత్మ దేవునితో మాట్లాడును. దేవుడు మనిషి ఆత్మతో

మాట్లాడును గాని మనిషి ప్రాణమునకు అది తెలియదు. ఆత్మ చెప్పితే తెలియును. ఈ క్రింది పట్టికలో పై వివరమును చక్కగా గ్రహించగలము. ఒక దొరగారున్నారు. ఇంగ్లీషు ఆయన మాతృభాష గనుక చక్కగా వచ్చును. ఆ దొరగారి ఆఫీసులో ఒక రైటరున్నాడు. ఆయన ఇంగ్లీషు నేర్చుకొన్నాడు గనుక, కొంతవరకు ఫరవాలేదు. అయితే ఆ దొరగారి పనివాడు, చదువులేనందున ఇంగ్లీషు ఏమీ అర్థం చేసికోలేడు, మాట్లాడలేడు. దేవునితో మాట్లాడుటలో, ఈ తారతమ్యములే శరీర ప్రాణాత్మలకుండును. దొరగారు ఆత్మకు సాదృశ్యమైతే, పనివాడు శరీరమునకు సాదృశ్యముగా ఉన్నాడు.

| **1. ఆత్మ** | **2. ప్రాణము** | **3. శరీరము** |
|---|---|---|
| దొరగారు<br>ఇంగ్లీషువారు<br>స్వభాష | రైటరు<br>ఇంగ్లీషు వచ్చును<br>నేర్చుకొన్నాడు గనుక. | ప్యూన్<br>ఇంగ్లీషురాదు.<br>నేర్చుకొనలేదు గనుక,<br>స్వభాషకాదు గనుక. |

దేవునికి భాషవచ్చును గనుక దేవదూతలతో మాట్లాడును. దూతలు నరుని ఆత్మతో మాట్లాడుదురు. అయితే, నరుని ఆత్మ ప్రాణముతో చెప్పితే తెలియదు.

**సాదృశ్యము:-** దొరగారు తన పనివానికి 'విజ్‌డమ్' అనేమాట నేర్పించి, దాని అర్థము జ్ఞానము అనిచెప్పెను. రెండుకలిపి 'విజ్‌డమ్ మరియు జ్ఞానము' అని చెప్పెను. ఆలాగే ఆత్మకు భాషవచ్చును, అర్థము తెలుసును. గనుక రెండునూ అడిగి నేర్చుకొనవలెను (1కొరి. 14:13). మనుష్యుడు గ్రహింపడుగాని భాష వచ్చినవాడు దేవునితో మాట్లాడుచున్నాడు. 1) భాషలో మాట్లాడువాడు వరపుత్రుడు. 2) తెలుగులో చెప్పితే బోధకుడు, ప్రవక్త.

పరిశుద్ధాత్మ మనిషియొక్క ఆత్మకు వరమిస్తాడు. ప్రాణము ఎప్పుడు దేవుని స్తుతించును? 1) ఉపకారము పొందినపుడు, మనిషి దేవుని స్తుతించును. ఎంతసేపు స్తుతించును? స్తుతించి, స్తుతించి, స్తుతించి ఆగిపోవును. ఇంకా స్తుతించాలని ప్రాణానికి ఆశ యుండును. అయితే, ప్రాణము తెలుగులో చేసిన స్తుతి ఆగినది. ఈ స్తుతి దేవునికి గాన, అది ఆత్మలోకమునకు వెళ్ళవలయును గనుక ప్రాణముయొక్క స్తుతి ఆగగానే ఆత్మ అందుకొని స్తుతిచేయగా, ఆత్మలోకమునకు ఆ స్తుతి వెళ్ళును గనుక ***ఆత్మ సహాయముతో స్తుతించగా భాష వచ్చును.*** అది ప్రాణమునకు మించిన స్తుతి.

Bible Mission HQ Guntur

ఆలాగు ఆత్మ అందుకొని స్తుతి చేయగానే భాషవచ్చును. ప్రాణమునకు ఇంకా స్తుతించాలని ఆశయున్నపుడే, ఆత్మ ఆ స్తుతిని అందుకొనును. ఆత్మ యొక్క స్తుతిని, ప్రాణము సహించలేకపోయినప్పుడు, శరీరమునకు బాధ కలుగును. అప్పుడు బోధకుడువచ్చి చేతులుంచి నిమ్మళింపజేయును. ప్రాణముచేసిన స్తుతిని ఆత్మ అందుకొనగానే, ఆత్మ పరలోకమునకు వెళ్ళును.

ఆత్మ స్తుతించగా స్తుతికిమించిన స్తుతి వచ్చును. ప్రాణము చేయగా, దేవునికి ఎక్కువ సంతోషము కలుగును. ప్రార్థనయు, స్తుతియు దేవునికి ఇష్టముగాన ఆయన సంతోషించును. మనకు ఎక్కువైన సంతోషము కలిగించుటకై, దేవుడు మన ఆత్మకు భాషావరమిచ్చి స్తుతి చేయించును. **పరలోకభాష మాట్లాడేవారిని చూస్తే దయ్యము వణకును.** కారణమేమనగా, ఇదివరకు మేము మాట్లాడిన ఆ భాషను మేము (దయ్యములు) పాపమువల్ల పోగొట్టుకొన్నాము. మేము మాట్లాడే ఆ భాషను దేవుడు, పాపమానవులను రక్షించి, వారికిచ్చినాడని; అనగా ఈ భాషావరము దేవుడు వారికిచ్చినాడని, పరిశుద్ధదూతలయొక్క భాష వారికి ఇచ్చినాడనే అసూయచేత దయ్యములు సహించలేకపోవును. **దేవదూతలు వాటితో మాట్లాడితే సహించగలవు గాని పాపమానవులు మాట్లాడితే మొదటే సహించలేవు, గాన పారిపోవును.**

ఫిలిప్పీ. 4:4లో 1. ప్రభువునందు ఆనందించుడి అని ఉన్నది. ఇది ప్రాణమునకు సంబంధించిన మాట. 2. 'మరలా చెప్పుదును, ఆనందించుడి' అని వెంటనే ఉన్నది. ఇది ఆత్మకు చెప్పబడిన మాట, అనగా రెట్టింపు సంతోషము కలుగుట కొరకు.

(1) ప్రార్థనలో ఎక్కువగా యుంటే ఏడ్పు వచ్చును. (2) స్తుతి ఎక్కువగా చేస్తే సంతోషము వచ్చును. సంతోషమునుబట్టి, విశ్వాసమునుబట్టి స్తుతిచేయండి. ఒకరు భాష మాట్లాడితే ఇంకొకరు అర్థము చెప్పుదురు. ఇది సులువా! ఇంత గొప్ప వరము బైబిలులో ఉండగా, కొందరు ద్వేషించి లేదంటారు, కాదంటారు. ఎంత విచారము! భాషకు అర్థము చెప్పకపోతే ప్రవక్తలు ఎట్లు భాష మాట్లాడేవారు? అర్థము చెబితే గొప్ప ప్రవక్త అవుతారు. దయ్యముకూడా భాష మాట్లాడును. దానిని సులువుగా గ్రహించగలము. విశ్వాసులు భాషలు మాట్లాడుచు, అర్థము చెప్పుచూ ఉండగా అవిశ్వాసులు వింటే, అవి వారికి సూచనగా యుండును. ***ఉదా:- స్వస్థిశాలలు అవిశ్వాసులైన వారికి సూచనగా ఉంటున్నవి. అనగా వారు మార్పుచెందుటకు సాధనములైయున్నవి.***

Bible Mission HQ Guntur

**ఉదా:-** రైలుబండిలో కూర్చుండి స్తుతిచేస్తూ, భాషలు మాట్లాడితే, అక్కడే ఏ అవిశ్వాసో, ఏ నాస్థికుడో యున్నాడన్నమాట. అందుకే విశ్వాసి భాష మాట్లాడినది. భాషలేకపోతే ఆ సమయములో ఆ వ్యక్తికి రక్షణలేదని కూడా చెప్పవచ్చును. బైబిలులో దేవదూతల భాష ఉంటే, రక్షణ పొందిన విశ్వాసి దానిని నమ్మకపోతే రక్షణపోతుంది.

**ప్రశ్న:-** ప్రాణముతో స్తుతి, ఆత్మతోస్తుతి చేయకపోతే పెండ్లికుమార్తె వరుసలేదా?

***జవాబు:-* *శ్రమలోను, కష్టములోను, ఇబ్బందిలోను, కరువులోను, ఆత్మతో స్తుతించువారే పెండ్లికుమార్తె సంఘములో ఉన్నారు.*** పాపమున్నా, శోధనున్నా, మొండికేసి స్తుతించువారే జయశీలురు.

**షరా:-** భాషనుగురించి ఇంకొక సంగతి ఎప్పుడు చెప్పుదునంటే, మీరందరు భాషలు మాట్లాడునప్పుడే వాటినిగూర్చి వివరించుదును. అయితే ఈ ఆత్మీయ వరములు పొందిన పిదప మనుష్యులలోనికి రెండు గర్వములు వచ్చును.

***1. నా ఇష్టము అనే గర్వము,***

***2. 'ప్రభువు చెప్పారు గనుక నన్నేమి చేయమంటారు'! అనే గర్వము.***

గనుక మన అనుభవము పెరుగుకొలది మన తగ్గింపుకూడ పెరుగుచుండ-వలెను. బైబిలులో ఉన్న ప్రతిఅంశము మన జ్ఞానానికి సరిపోతే తప్పక అనుసరించ-వలసినదే.

అట్లు అనుసరించి, గొప్ప ఆత్మీయానుభవమును పొందు ధన్యత ప్రభువు మీకెల్లరకు దయచేయునుగాక. ఆమేన్.[1]

---

**1. 16.5.1949వ సం॥లో దేవదాసు అయ్యగారు చేసిన ప్రసంగము.**

# ఆత్మ కుమ్మరింపు కూటములలోని ఎనిమిదవ దినము-శుక్రవారము

## పరిశుద్ధాత్మ త్రిత్వము - మూడు ఆఫీసులు

అపో.కార్య. 2:39.



**ప్రార్థన:-** దయగల తండ్రీ! మేము కొద్దిగా మాట్లాడుకొనినను, ఆ సంగతులను గ్రహించే శక్తి దయచేయుము. దయ్యములు రాకుండా కాపాడుము. నీ ఆత్మ వశములో మమ్మునుంచుకొని నేటిదిన నీ వర్తమానమిమ్మని యేసు నామమున వందించుచున్నాము. ఆమేన్.

'దేవుడు' అనుమాట లోకమంతటికి అక్కరకు వచ్చే మాట. 'యెహోవా' అనుమాట యూదులకు అక్కరకు వచ్చేమాట. 'క్రీస్తు' అనుమాట క్రైస్తవులకు అక్కరకు వచ్చేమాట. ఈ మూడును తెలిసికొనేటందుకు అవసరమైన మాట **'పరిశుద్ధాత్మ,'** ఆయన మీ వాడే. ఆయన మనలో లేకపోతే, దేవుడు అని అనలేము, యెహోవా అని అనలేము, క్రీస్తు అని అనలేము. ప్రాణములేని శవము ఏలాగు ఏమి చేయలేదో, అలాగే ఆత్మలేకపోతే మనమును వట్టి శవముతో సమానము. ***పరిశుద్ధాత్మ నిశ్శబ్దముగా ఎవరికి తెలియకుండా పనిచేయును.*** నాస్థికులలోకూడ పరిశుద్ధాత్మపని జరుగుచున్నది గాని అది వారికి తెలియదు. *అపో.కార్య. 2:39లో ఉన్న ఈ వాగ్దానముమీద కీర్తనలు వ్రాయవలెనని చాలాకాలమునుండి ఉన్నది. పరిశుద్ధాత్ముని యొక్క నిశ్శబ్ధకార్యమైనను లేని మనుష్యుడు ఇంకా పుట్టలేదు, పుట్టబోడు. అతనికి ఆ పని తెలియకపోవచ్చును.* అప్పుడే పుట్టినబిడ్డ మంచముమీద పరుండి నిద్రమీదే ఉండగా, తల్లి ప్రక్కనే కూర్చున్న సంగతి తెలియునా? తెలియకపోయినంత మాత్రమున తల్లి అక్కడ లేనట్లేనా? అలాగే పరిశుద్ధాత్మపని తెలియకపోయినంత మాత్రమున పరిశుద్ధాత్మ తండ్రి లేదని చెప్పగలమా? చెప్పలేము.

ఇక్కడ పేతురు మనస్సులో దేవుడు, యెహోవా, క్రీస్తు, పరిశుద్ధాత్మ ఉన్నారు. గనుకనే యోవేలు ప్రవచనము ఎత్తెను. పేతురు వారితో ఏ నామమున నిలువబడి మాట్లాడుచున్నాడనగా దేవుడు, యెహోవా, క్రీస్తు నామములో బోధించెను. ఆలాగున మనమును కాలమునకు తగినట్లు బోధచేయవలెను. ***దేవునిమతము అందరిది. యెహోవా మతము యూదులది. క్రీస్తుమతము క్రైస్తవులది. ఇది అంతా తెలియజేసినవారు పరిశుద్ధాత్మ తండ్రి.*** యోహాను 14:1. గనుక దేవుడు, క్రీస్తు సమానమన్నమాట.

Bible Mission HQ Guntur

లోకస్తులందరు దేవునిప్రక్క ఉన్నారు. క్రైస్తవులు క్రీస్తుప్రక్కన ఉన్నారు. ఆ దేవుడే క్రీస్తుగా వెలసిన సంగతి వారికి తెలియదుగాన వారు దేవుని ప్రక్కనే ఉన్నారు. క్రీస్తును తెలిసికొంటే, వారు క్రీస్తు ప్రక్కకు వత్తురు. అపో.కార్య. 2:36. గనుక ***క్రైస్తవబోధకుడు బైబిలు విషయములన్నియు, సందేహములేనంత రూఢిగా తెలిసికొనవలెను. అతడే గొప్ప బోధకుడు. అతడే సువార్త ప్రతినిధి.*** 1) సంగతులు తెలిసికొనుట వేరు, 2) వివరించుట వేరు. 3) రూఢిగా తెల్సుకొనుట వేరు. బైబిలుమిషను వారందరు ఆ రూఢి అనే సంగతి తెలిసికొనవలెను. బైబిలంతా చదువవచ్చును, కానీ రూఢీ తెలిసికొనలేము. **ఉదా:** *ఒక ముసలమ్మ ఉన్నది. ఆమెను ఒకాయన ఇలాగు అడిగెను. అమ్మా! నీకెంతమంది బిడ్డలు? అప్పుడామె నర్సమ్మ, సుబ్బమ్మ, వెంకమ్మ, గంగమ్మ అని చెప్పి, ఇంకా జ్ఞాపకములేదు. మా పెద్దమ్మను అడిగి వచ్చెదననెను.* నేడు క్రైస్తవ బోధకుల సంగతి ఇట్లే ఉన్నది. రాజమండ్రిలో మద్దా శాంతమ్మ ఉన్నది. ఆమె కుమారుడు మొదటి ఫారమ్ చదువుచున్నాడు. సండేస్కూలు జరుపుచున్నాడు. ఆ కానుక, అయ్యగారికి తొమ్మిదణాలు తెచ్చి ఇచ్చెను. బండిలో ఆర్య సమాజ బోధకుడు కనబడెను. ఆ బోధకుడు కుర్రవానిని ఒక ప్రశ్న వేసెను. ప్రశ్నవేయగా జవాబు చెప్పలేక యేడుస్తూ అయ్యగారి దగ్గరకు వచ్చెను. దానికి అయ్యగారు జవాబు చెప్పెను.

అపో.కార్య. 2:40. మనము (బైబిలుమిషనువారు) 1) రక్షణ సంకల్పన, 2) ప్రార్ధన మెట్లు చెప్పుచున్నాము. 3) బైబిలు గొప్పతనము, 4) క్రీస్తు చరిత్ర చెప్పవలెను. 5) సంఘ చరిత్ర, 6) రెండవరాకడ చెప్పవలెను. అందరు వీటిని చెప్పలేరు. ఎందుకంటే పూర్తిగా చెప్పిన వారికే సందేహము వచ్చును. పూర్తిగా చెప్పిన తరువాత, 'ఇంత కాలమైనది ఇంకా రాలేదేమని విన్నవారు అందురు. సంఘ చరిత్ర అనగా ప్రభువు మూడున్నర సం॥లు ఏమి చేసినారో, శిష్యులు వాటిని అభ్యాసములో పెట్టిరి, అనగా ప్రాక్టీస్ చేసిరి. అదే అపోస్తలుల కార్యములు. ఆత్మను పొందకముందు చేసిరి, పొందిన తరువాత చేసిరి. అపో.కార్య. 2వ అధ్యాయములో చెప్పినవి కాక అనేకములు పేతురు చెప్పెనుగాని లూకా వాటిని వ్రాయలేదు. అనేకవిధములుగా, వారికి సాక్ష్యములు ఇచ్చిరి. అపో.కార్య. 2:1-39. పేతురు ఈ పెంతెకొస్తు ప్రసంగము చేసి, అలసిపోయి, 'మూర్ఖులగు ఈ తరమువారినుండి వేరైయుండుడి' అని చెప్పెను. చెప్పవలసినవి చెప్పి వేరు కావలెనని పేతురు అనుచున్నారు. 'పెంతెకొస్తు ప్రసంగము మరియు అనేకమైన ఇతర సంగతులు చెప్పితిని గాని వినక, అనేకమంది ఎదురాడుచున్నారు.

ఎంత చెప్పినా విననివారు మూర్ఖులనెను'. ఆత్మను పొందిన ఆయన అంత మాట అనకూడదు. మూర్ఖులెవరనగా ఈ తరమువారు. గనుక వారికి వేరై రక్షణ పొందండి. వేరుకాకపోతే రక్షణ పొందలేరు. ***ఇప్పుడు పెంతెకొస్తువారు, సెవెంత్ డే వారు, భక్తసింగ్‌గారు మొ॥నవారు చెప్పేది ఏమనగా 'రక్షణ పొందండి' అనుచున్నారు. గాని వారు లోకమునుండి వేరయ్యే బోధ చేయుటలేదు.***

**మూడు ఆఫీసులు:–** 1. ప్రశ్న:– బైబిలులో సృష్టి ఆరంభమునుండి మలాకీ ఆఖరివరకు ఏమున్నది? జవాబు:– ఒక ఆఫీసు ఉన్నది. అందులో తండ్రి కూర్చున్నాడు. 2. ప్రభువు జన్మ:– తన ఇహలోకజన్మ బైబిలులో మొదట ఆరోహణమువరకు తన ఆఫీసులో కుమారుడు కూర్చున్నాడు. 3. సంఘస్థాపన మొదలు రేప్చర్‌వరకు పరిశుద్ధాత్మ తండ్రి తన ఆఫీసులో కూర్చున్నారు. ముగ్గురు కూర్చున్నారు.

**మొదటి ఆఫీసులో:–** మనకు దొరికేవి ఏవనగా, పండ్లు, నీరు, గాలి, మనిషి తినుటకు, త్రాగుటకు కావలసినవి. అవన్నీ అన్యులు, క్రైస్తవులు అను వివక్షత లేకుండా అందరకును ఇవ్వబడుచున్నవి. అలాగే వనమూలికలు అందరకును పనిచేయుచున్నవి. ఈలాగు తండ్రి ప్రేమ మొదటి ఆఫీసులో అందరకును ఇవ్వబడెను అన్యులకెందుకు ఆయన ప్రేమను ఇయ్యవలెనంటే ***'తండ్రి నీ కొరకును, అందరికొరకును'*** అని తండ్రి ఆఫీసునుండి స్వరం వచ్చును. 1. ఆహారము, 2. నీరు, 3. మూలికలు, 4. వెలుగు, 5. భూమి. ఇవన్నియు మొదటి ఆఫీసులో అనగా తండ్రి దగ్గర దొరుకును.

**రెండవ ఆఫీసులో:–** క్రీస్తు మనకొరకు చూపిన రక్తధార, ఇందులో తండ్రియొక్క ప్రేమ ఉన్నది. ఆయన జాలి, సంస్కారము, బాప్తిస్మము, బోధ, అద్భుతములు ఉన్నవి.

**మూడవ ఆఫీసులో:–** అనగా పరిశుద్ధాత్మ తండ్రి ఆఫీసులో అన్నీ ఉన్నవి. యోహానువలెను ఆత్మావేశులై యుండుటయు, ఆత్మవశులై ఉండుటయు; ఇవన్నీ ఆత్మ తండ్రి ఇస్తారు. మొదటి రెండు ఆఫీసు లోనివన్నియు, అవేకాకుండా తన ఆఫీసులో ఉన్న అన్నియు పరిశుద్ధాత్మ తండ్రి ఇస్తారు. ఎప్పుడు? ఆయన వశమైపోయినప్పుడు అనగా ఆత్మ వశమైపోయినప్పుడు. అవి, ఇవి అనే వివక్షతలేకుండా ఏది ఇవ్వమంటే అది ఇస్తారు. ఆత్మతండ్రి ఇవ్వకుండా ఉండరు. 1) పాతనిబంధన తండ్రి కాలము (ఆహారము), 2) క్రొత్త నిబంధన క్రీస్తులో తండ్రియొద్దకు వెళ్ళు మార్గము, 3) సంఘ కాలములో ఆత్మవశమై పోవడము. వీటిలో ఏది కావలెను? ***తండ్రీ! జబ్బుతీసివేయుమని ప్రార్థించకూడదు.*** అది వధువుకు సరిపోయిన స్థితికాదు. అయితే, తండ్రి దగ్గర అందరకు

తెలిసినది తీసికోవడమే. ఇశ్రాయేలీయులకు ఆహారము ఇచ్చిన తండ్రీ! ఏలీయా, ఎలీషాలకు ఆహారము ఇచ్చిన తండ్రీ! అని తండ్రి ఆఫీసుకు అందరు వెళ్ళుదురు. ఎందుకనగా ఆయన సృష్టించినారు గనుక వెళ్ళవచ్చును. గాని మనకు తెలియక వెళ్ళము.

1. అదే మొదటి ఆఫీసులో అందరకు హక్కు ఉన్నది. 2. క్రీస్తును నమ్మితేనే రెండవ ఆఫీసులో హక్కు. 3. అయితే, ఆత్మ ఆఫీసులో అన్నియు దొరుకును. ఈలోకములోనుండేవి, పరలోకములో నుండేవి దొరుకును. (ఎ) ***తండ్రి దగ్గర అన్నీ బొక్కేవారు పరలోకములోనికి వెళ్ళలేరు.*** (బి) కుమారుని విశ్వసిస్తేనే పరలోకములోనికి వెళ్ళెదరు. (సి) ఆత్మ వశమైయుంటే అన్ని దొరుకును. 'తండ్రి, కుమారుడు ఉంటే చాలు. ఆత్మ అక్కరలేదనే' వారు ఉంటారు. 'తండ్రి చాలు; కుమారుడు, ఆత్మలు అక్కరలేదనే' వారుకూడ ఉంటారు. ఆలాగే వద్దంటే వారికేదియు లేదు. మీరు ఆత్మను ఎదిరిస్తే ఈ యుగమందుగాని, రాబోవు యుగమందుగాని క్షమాపణలేదు. పరిశుద్ధాత్మ అక్కరలేదని లూథరన్ పాదిరిగారు పత్రిక అచ్చువేసిరి. అయితే, మనము మూడు ఆఫీసులను కలుపవలయును.

**పరలోకములో చేర్చే మెట్లు:–** బైబిలు ఏ ఆఫీసులో దొరుకును? ఆత్మ తండ్రి ఆఫీసులో. రేప్చర్ రోజున మేఘములోనికి ఆత్మతండ్రి తీసికొని వెళ్ళును. ఆత్మతండ్రి పెండ్లికుమార్తెను సిద్ధపర్చుచున్నారు. తండ్రి ఆత్మనుగూర్చి, అలాగే కుమారుడు ఆత్మనుగూర్చి చెప్పిన ఒకే మాటలున్నవి.

1) తండ్రి– కుమారుడు, ఆత్మ మీకేమి చెప్పునో అది చేయండి.

2) కుమారుడు– 'ఆయన మీకు చెప్పునది చేయండి'.

3) 'ఆత్మ మీతో చెప్పునది మీరు చేయండి'.

ఒక్కొక్కరు, వారివారి పని వేరు. కలిపితే ముగ్గురు పని ఒకటే.

(1) ఆది 27:8 అధ్యా॥లో రాహేలు 'ఆయన (తాను) ఏమి చెప్పునో, అది చేయుడి' అనెను. (2) యోహాను 2:5లో ఆయన మీతో చెప్పునది చేయుడి అని ఉన్నది. (3) ఆత్మ ప్రకటన 1వ అధ్యా॥ మొదలు 3వ అధ్యా॥ వరకు ఆత్మ చెప్పునది చేయుడి అని వ్రాయబడినది. ***1) తండ్రిని బైలుపర్చినది సృష్టి, 2) తండ్రిని, కుమారుని బైలుపర్చినది ఆత్మతండ్రి.*** "వరాత్మపితా పుత్ర.....వాస స్తోత్రము" తండ్రి ఇచ్చేవి, కుమారుడిచ్చేవి, ఆత్మతండ్రి ఇచ్చేవి; అన్నియు ఆత్మ తండ్రియే ఇచ్చును, అందించును.

పరిశుద్ధాత్మ ఫలములు ఏవనగా

1. వెలుగు, సంతోషము.

2. కీడు అంటే లెక్కలేని తనము.

3. భాషావరము; ఇది అవసరమునుబట్టి వచ్చును.

వరము ఉంటే ఎప్పుడు బడితే అప్పుడే భాషవచ్చును. కాని వేరే దేశము వెళ్ళినప్పుడు ఆ భాష మనకు రాకపోతే, 'ఆ భాష నాకు వస్తే బాగుండును, బోధింతును' అని నీవు అనుకుంటే, అప్పుడు అవసరమునుబట్టి పరిశుద్ధాత్మ నీతో ఆ భాషలో బోధ చెప్పించును. ఆ తరువాత ఆ భాష నీకురాదు. ఒక్క వరము మాత్రము మీలో స్థిరముగా నుండును అదేమనగా, ***'పరిశుద్ధాత్మ ఆవేశము కలిగి బోధించేవరము'*** ఇది అందరికి ఆయన ఇస్తారు. ***వాడుకోవాలి లేకపోతే తగ్గిపోతుంది.***

ఆలాగు పరిశుద్ధాత్మ వరములను పొంది, ఆయన వార్తను అందరకు అందించు ధన్యత పెండ్లికుమారుడు మీకు మెండుగా దయచేయునుగాక. ఆమేన్.[1]

---

**1. 30.5.1955 సం॥లో దేవదాసు అయ్యగారు చేసిన ప్రసంగము.**

# ఆత్మ కుమ్మరింపు కూటములలోని తొమ్మిదవ దినము-శనివారము

## ఆత్మ కుమ్మరింపు జరుగు విధానము

అపో.కార్య. 2:1-18.

కీర్తన: *'మనసానందము బొందుటకన్నను..........తీరైయుండును.'*



**ప్రార్థన:- ఓ తండ్రీ! లోకమునిండా పాపము. అందుచేత మనసానందము ఎలాగు కలుగును? అన్నీ కష్టాలే. మనసానందము ఎలాగు రావలెను? లోకమంతా దుష్టులే, లోకమునిండా దురాత్మలే. గనుక మనసానందము ఎలాగు రావలెను? అయినప్పటికిని 'ఎల్లప్పుడు ప్రభువునందు ఆనందించుడి' అని చెప్పినావు. గనుక ఎక్కడ చూచినా కలహాలే, చిక్కులే, అవస్థలే. ప్రతిరోజు మరణాలే, ఇబ్బందులే. ఈలాగు ప్రతిరోజు జరుగుచుంటే ఎలాగు మనసానందముగా ఉండగలము? ఆయా ప్రదేశములనుండి వచ్చిన ఈ బిడ్డలు మనసానందము కొరకు వచ్చారు. *"లోకములోని పాపముజోలి, దుష్టులజోలి, దయ్యాలజోలి, కష్టాల జోలి మాకెందుకు?* లోకములో పాపముంటే ఉన్నది. వ్యాధులు, దయ్యాలు, చెడ్డ బుద్ధులు అవి మాకెందుకు? వాటిని మేము లెక్కచేయము" అని ఇక్కడున్నవారు మనసానందము పొందే కృప దయచేయుము. పెంతెకొస్తు పండుగనాడు 120మంది పొందిన మనసానందము ఎవరు చెప్పగలరు? వారెవరు ఇక్కడకు వచ్చి, చెప్పలేదు. వారి భాషలు విన్నవారు త్రాగుబోతులు అంటే వారు లెక్కచేస్తారా? లెక్కచేయలేదు. *అలాగే మేము ప్రతిరోజు వింటున్న* పాపమును లెక్క చేయక, *నీయందు* (ఆ కూటమునకు హాజరైన ఈ 30మంది) ఎల్లప్పుడు ఆనందించే కృప దయచేయుము ఆమేన్.**

ఒక ఉపమానము వినండి. ఒక మిషను స్కూలు ఉన్నది. ఆ స్కూలులోని పిల్లలను మొదటిగా హాలులో సమకూర్చి కీర్తనపాడి, ప్రార్థనచేస్తారు. తరువాత ఎవరి తరగతిలోనికి వారు వెళతారు. ఆ హాలులోనున్న 100మంది విద్యార్థులలో ముగ్గురి కథ చెప్పుతాను. ఒక క్రైస్తవ విద్యార్థి కలడు. రెండవవాడుకూడా క్రైస్తవ విద్యార్థే. మూడవవాడు- క్రైసవుడు కాని విద్యార్థి. ఈ ఒక్కడు హైందవ విద్యార్థి. వారికి హెడ్‌మాస్టరు ఒక కథ చెప్పినారు. ఈ ముగ్గురు తెలివైనవారు. ఆ కథ ఏమిటంటే మనకందరికి తెలిసిన కథే. 1) క్రీస్తుప్రభువు పుట్టకముందే క్రీస్తుప్రభువు పుట్టునని చెప్పుకొన్న భక్తుల కథ. 2) క్రీస్తుప్రభువు పుట్టిన తర్వాత జరిగిన రెండవ కథ. 3)

Bible Mission HQ Guntur

ఆయన అనేక ప్రదేశములు తిరుగుచూ, బోధించి, రోగులను స్వస్థపరచి, ఆహారము లేనివారికి ఆహారము కల్పించి, చనిపోయిన వారిని బ్రతికించి, చనిపోయి బ్రతికి, మోక్షలోకమునకు వెళ్ళిపోయి, తిరిగి వస్తారను కథ మూడవది. పెంతెకొస్తు దినమందు ఆత్మను కుమ్మరించారను కథ, అందరికి చెప్పెను. ఆ వందమందిలో ఈ ముగ్గురు బాగా విన్నారు. బడిలో ఏమి నేర్చుకొన్నారు! అని అడిగితే కథ అంతా చెప్పారు. హెడ్‌మాస్టర్‌గారు చెప్పారు గనుక ఈ ముగ్గురు చెప్పారు. ఈ ముగ్గురు జ్ఞాపకముంచుకొని చెప్పారు. హెడ్‌మాస్టరుగారు పరిశుద్ధాత్మపొంది చెప్పారు. కథ ఒక్కటే. హెడ్‌మాస్టర్‌గారు, పేతురు, ముగ్గురు విద్యార్థులు చెప్పిన కథలు ఒక్కటే. (1) ముగ్గురు పిల్లలలో ఒకరు జ్ఞానమునుబట్టి చెప్పారు. (2) ఇద్దరు ఆత్మనుబట్టి చెప్పారు. హెడ్‌మాస్టర్‌గారు చెప్పినది బాగానే ఉంది. 1) అది జ్ఞానము. 2) ఇది ఆత్మ పరిపూర్ణత. పేతురు 120మందిలో ఉన్నప్పుడు పరిశుద్ధాత్మ అక్కడున్న వారిమీదికి, ఆయనకు వచ్చినది. ఆ ప్రేరణనుబట్టి అందరికి బోధించెను.

ఆ ప్రజలు అందరు యూదులే. పండుగకు వచ్చిన యూదులే. యెరూషలేము యూదులే కాదు, యూదయ యూదులేకాదు, అన్ని దేశములనుండి వచ్చిన యూదులు, అన్యులు ఉన్నారు. పండుగ గనుక అన్ని దేశములనుండి వచ్చిన యూదులు, భక్తిపరులు ఈ కథ విన్నారు. వింటే ఏమి జరిగినదంటే, ఇందులో క్రొత్త సంగతి ఏమిలేదు. “ఆయన వస్తాడని, పుట్టినాడని, బోధించినాడని, ఆ యూదులే ఆయనను చంపారని, అయితే, ఆయన తిరిగిలేచాడని, పరలోకమునకు వెళ్ళెనని” చెప్పెను. అది వారికి తెలిసినదే. అదే పేతురు చెప్పినాడు. క్రొత్తది కాదుగాని పరిశుద్ధాత్మ చెప్పినాడు గనుక వారికి క్రొత్తదైనది, అందువలన వారు మారినారు. ఆ ముగ్గురు పిల్లలు చెప్పారుగాని మారలేదు. ఇది ఆ కథే. వారు చెప్పినది ఆ కథే. తేడాలేదుగాని పేతురు పరిశుద్ధాత్మతో నిండుకొని చెప్పినాడు గనుక ఆ చరిత్ర 1) వినసొంపుగా నుండెను, 2) వారు పూర్తిగా మారిరి, 3) కలవరపడ్డారు. ముగ్గురు చెప్పినందువల్ల ఎవరూ కలవరపడలేదు. ఆ ప్రసంగములో ఒక్కమాటవల్ల వారు కలవరపడ్డారు.

“యేసుప్రభువును మీరే చంపారు” అనేమాట కలవరపరచినది. దేవుడు పంపిన యేసుప్రభువును మీరే చంపారు. అనగా పండుగేగాని కలవరపడ్డారు. అప్పుడు ఈ మాట వినగానే మేమేమి చేయవలెను? మేము చంపకపోయిన మా సంబంధికులు ఆయనను చంపివేసారు. అనగా అల్లరిఅయిపోయినది. అంతకుముందు మేడగదిలో,

పరిశుద్ధాత్మ వచ్చినప్పుడు అల్లరి అయినది. పరిశుద్ధాత్మ గాలి విసరినప్పుడు, గాలి శబ్ధమైనది. *ఆ శబ్ధము ఆత్మ వచ్చినందువల్ల కలిగినది. 120మంది కలవరపడలేదు గాని ఊళ్ళోవారు, ఎదుటనున్నవారు, పొరుగూరునుండి వచ్చినవారు కలవరపడ్డారు.* లోపలనున్నవారు బాగానే ఉన్నారు. రెండవసారి పేతురు బోధించినప్పుడు 'ఇదేమి, ఇదేమి' అని కలవరపడ్డారు. 1) ఆత్మనుపొందినప్పుడు అన్యభాషలు కలిగి లోపల ఉండలేక బైటికి వెళ్ళి చెప్పవలెనని వెళ్ళారు. 2) ఆత్మనుపొందినవారు ఎవరికి చెప్పకుండా ఉండగలరా? ఆత్మను పొందగానే తలుపులు తీసికొని బైటికి వచ్చి అందరికి వారివారి భాషలోనే చెప్పెను. వారు నానా దేశములనుండి వచ్చారు. ఉదా: అరవ దేశములో ఉండే ఒక భక్తురాలు, బట్లర్ గారి ఇంట్లో చిరకాలముంటే ఆ దొరగారి భాష అలవాటైపోతాది. భార్య, బిడ్డలు అందరు తెలుగే గనుక అలవాటైపోయినది. ఉదా:- రాజమండ్రినుండి ఒక అరవ అబ్బాయి దొరగారి ఇంట్లోకి వచ్చాడు. నెమ్మదిగా అతనికి తెలుగు అలవాటైపోయినది. అలాగే ఆ భాషలోనే వారు సువార్త చెప్పిరి. వారు ఎప్పుడు నేర్చుకున్నారు? అని విన్నవారు ఆశ్చర్యపడ్డారు. ఆ పండుగలోనికి ఎవరెవరు వచ్చారు. 1) పార్తీయులు 2) మాదీయులు మొదలుకొని 16 దేశములనుండి వచ్చినవారున్నారు. వారంతా అప్పుడు యెరూషలేమునుండి వచ్చినవారే (అ.కార్య. 2:9).

ఆ వచ్చినవారికి 1. శబ్ధమువలన కలత, 2. భాషలు మాట్లాడినందువలన కలత, 3. క్రీస్తునుగురించి చెప్పిచెప్పి, మీరే చంపారంటే కలత, 4. పేతురు- 'మీరు మారుమనస్సు పొందండి, పాపక్షమాపణ పొందండి, బాప్తిస్మము పొందండి. ఆత్మను పొందక ఎందుకు కలత పొందుతారు'? అని వారికి బోధచేసెను. నేర్పువలన చెప్పిన కథవేరు. అది జ్ఞానవాక్కు. అయితే, పేతురుది ఆత్మవాక్కు. గనుక ప్రియులారా! మీరందరు ఆత్మనుబట్టి చెప్పండి. పేతురుకు సంతోషమే. మీకును సంతోషమే. విన్నవారికి సంతోషమే. అప్పుడు గొప్ప మార్పుకలుగును. ఈ మార్పు అందరు పొందు నిమిత్తము అందరు ఆత్మను పొందండి అట్టి కృప అందరికి కలుగునుగాక! ఆమేన్.

**మరియమ్మ చివరి కథ:-** క్రైస్తవ సంఘములో మొట్టమొదటి కూటము యెరూషలేములోని భక్తురాలైన మరియమ్మ ఇంటిలో జరిగినది. 1. ఆ మరియమ్మ ఇంటిలో కూడుకొన్న 120మందితోపాటు యేసుతల్లియైన మరియమ్మ ఉన్నది. ఆమెను గురించి ఆ తర్వాత బైబిలులో ఎక్కడా వ్రాయలేదు. అదే ఆఖరి సంగతి. ఆ సంగతి ఏమంటే 'ఆమె, ఆ ప్రార్థన కూటములో ఉన్నది'. అది గొప్ప సంగతేగదా! అది

1. ప్రార్ధనాకూటము, 2. కుమ్మరింపు కూటము, 3. నూట ఇరువది మందితో కూడిన కూటము. అప్పటికి ఆమె వయసు గతించిపోయెనా? లేదు. అయితే బైబిలులో మరియమ్మ చరిత్ర ఆఖరి కూటములో జరిగిన సంగతితో ముగింపు. అలాగే మీ జీవితాన్ని ప్రార్ధనాకూటముతో ముగింపులో జరుపుకొనుచున్నారా? ఆమె ఒంటరిగా లేదు. పదిమందితో కలసినది. కాదు. 120మందితోకూడ ఉన్నది. ***ఆ సంఘము 850 మిషనులలో ఒక మిషనుకాదు, ఒక్క సంఘము, ఎంత ధన్యత!*** ఆమె ఆ మొదటి సంఘములోని మెంబరు. ఇప్పుడు సంఘము ఇన్ని శాఖలైపోయినది, 850 మిషనులు. ఇది చాలా విచారకరమైన సంగతి.

పెంతెకొస్తు పండుగరోజున 1. వారందరు కూడుకున్నారు, 2. అందరు ఒకచోటే కూడుకున్నారు. అందరు ఒకచోట కూడుకున్నారు కాబట్టి ఒక సంఘము. ఆ సంఘమే 16వందల సం॥ల వరకు పెరిగి, ఇప్పటికి నాలుగు వందల ఏండ్లకి 850 మిషనులుగా చీలిపోయినది. ఎందుకనగా ఐక్యతలేక. అందరు ఒకచోట కూడుకొనక, ఒక పనికే కూడుకొనక ఎవరిపనిలో వారు, ఎవరి పద్ధతిలో వారు ఉన్నారు. అయితే, ఆది సంఘ కూటములో ప్రభువు శిష్యులున్నారు, స్త్రీలు ఉన్నారు, ఇంకా ఇతరులున్నారు. ***మనుష్యులు 120మందిగాని, మనసులు 120 లేవు,*** ఒకటే. వారు ఫిలిప్పీ 4:2లో ఉన్నట్లు, క్రీస్తునందు ఏకమనస్సు గలవారైరి. వారు 120మంది లెక్క. అయితే ఒక్కటే సంఘము. ఒక్కటే మనసు, ఒక్కటే ప్రేమ. సంఘమంటే పురుషులు, స్త్రీలు ఉండవలెను. స్త్రీల కూటము వేరు, పురుషుల కూటము వేరు. అయితే పురుషులు, స్త్రీలు కలసిన కూటము. అపో.కార్య. 1వ అధ్యాయములో చూస్తున్నాము. అదే మొదటి సంఘము ! అది ఏ సంఘము? స్త్రీల సంఘము మరియు పురుషుల సంఘము. అట్టి సంఘమే అక్కడ కూడుకొన్న సంఘము. ***అట్టి సంఘము ఇంకను రాలేదు. ఆ సంఘము రాకడప్పుడు వస్తుంది.*** ఎందుచేత? ఇప్పుడు భేదములు వచ్చినవి. నేటి సంఘములో ఒకరు ఒకటి చెప్పితే, ఇంకొకరు ఇంకొక రీతిగా చెప్పుచున్నారు. నాలుగువందల సం॥ల నుండి ఇలాగు జరుగుచూనేయున్నది. తర్కం జరుగుచున్నది. ఆ ఏకమనస్సు పోయి ఇప్పటికి 850పైగా మిషనులు అయినవి. ఏమి బాగున్నది నేటి క్రైస్తవ సంఘము? అది పడిపోవుట చాలా విచారకరమైనది. అప్పటి పెంతెకొస్తు సంఘము చాలా సంతోషకరమైనది. అందులో ఒకరినిచూచి బాగున్నారా? అనగా బాగున్నాను అనును. క్రీస్తు మత సంఘము బాగున్నదా? లేదు. ఇప్పుడేమి చేయగలము? 850మిషనులను

ఏలాగు కలుపగలము? ఈ 20వందల ఏండ్లనుండి అందుకొరకు ఎవరూ గట్టి ప్రార్ధన చేయలేదు. వట్టిట్టి ప్రార్ధన చేస్తున్నారు. ఒకరు చేస్తే చాలదు, అపుడు అందరు చేయబట్టే ఆత్మ కుమ్మరింపు వచ్చినది. అందరు కలవకపోవుట బట్టే నేడు విడిపోయారు, ఇంకా విడిపోతూనే ఉన్నారు. ప్రార్ధన చేసికొందామంటే రారు. మరేమి చేయాలి? అనేక వందలమంది భక్తులున్నారు. వారే ఈ మిషనులన్నిటిని కలపటానికి ప్రయత్నము చేస్తున్నారు, కానీ కలుపలేకపోవుచున్నారు కారణము, వారిలో వారికి నేడు ఐక్యత లేదు.

'యేసుప్రభువా! మేము మీటింగు పెట్టుకుంటున్నాము. నిన్ను ఒక ప్రశ్న అడగాలని ఉన్నది; అది ఏమనగా మాకందరకు సమాధానము దయచేయుము' అని ప్రార్ధించవలెను! ***'మా మిషనుకంటే ఆ మిషనునే ఎక్కువచేయి' అనే ప్రార్ధన చేయగల్గుచున్నారా?*** అట్లు చేస్తున్నారా? అన్ని మిషనులవారు ఏమి చేయవలెనంటే, అన్ని మిషనులను ఒక్కటిగా చేయుము అని ప్రభువును అడుగవలెను. మీరు ప్రతి రోజు ఈ ప్రార్ధన చేస్తారా? ఈవేళ ఈ ప్రార్ధన చేస్తారా? 'యేసుప్రభువా! మా మధ్యకు రా! అన్ని మిషనులను కలుపుము' అని ప్రార్ధించాలి. అలాగే ఇంటివద్ద అడగండి. అడిగిన తరువాత జవాబువస్తే ఒక కార్డు వ్రాస్తారా? మీరు అలాగు చేస్తే, జవాబు వస్తే, మాకు కార్డువ్రాస్తే, నేను పత్రికలు వేయించి అందరికి పంపుతాను. 850 మిషనులుండగా ఆ చీలికలు చాలనట్లు బైబిలు మిషను వచ్చినది. అది మాత్రము ఏమి బాగుంది! మీరు అన్ని మిషనులలోనికి వెళ్ళితే బాగుండును. మరలా క్రొత్త మిషను ఎందుకు? మీరు వెళ్ళితే ఇతర మిషనుల వారు చేర్చుకుంటారా?తక్కిన మిషనులవారు వారిలో వారికి కీచులాట వచ్చినందువలన వేరైపోయిరి.

బైబిలుమిషనును దేవుడుచెప్పితే స్థాపించాను. మధ్యాహ్నము ఎండవేళ నా గదిలో పరుండియుండగా గాలిలో బైబిలుమిషను అని ప్రభువు వ్రాసారు, నేనే చూచాను. దగ్గర ఎవరైనా ఉన్నా వారికి కనబడదు, 30మంది ఉన్నా కనబడదు. నన్ను స్థాపించమన్నారు. ***లూథరన్ మిషనువారికి, నాకు ఎప్పుడు కీచులాట రాలేదు.*** తూర్పుగోదావరిజిల్లాలో సువార్త పనికి తిరిగాను. నేను పాదిరిని కాదు. నాకు బైబిలుమిషనును స్థాపించమనిచెప్పారు. వ్రాసి చూపించారు. రగులుకొనే పొయ్యిలో ఇంకొక పుల్లవేస్తే ఇంకా కాలిపోతుంది, అలాగే ఇప్పుడు కాలిపోతుంది. 17సం॥లనుండి ఇంకా కాలిపోతుంది. ***850 మిషనులను పిలిచి ఒకటి చేయాలని బైబిలుమిషనుయొక్క ఉద్దేశ్యము.*** ఇది నెరవేరుతుందా? ప్రార్ధనచేస్తే నెరవేరుతుంది. అందుకొరకు బోధించవద్దా!

**చెప్పనిదే ఎలాగు తెలుసుకుంటారు? ఏలాగు మారతారు? ఇప్పటికే ఆలస్యమైనది గనుక అందరికి చెప్పవలెను.** వెళ్ళగలమా? బర్మా, చైనా, పాలస్తీనా, జర్మనీ, డెన్మార్క్, నార్వే, అమెరికా, ఆస్ట్రేలియా వెళ్ళితే అందరితో మాట్లాడి చెప్పగలము. ఇప్పుడు వెళ్ళగలమా? అట్టి కార్యము కొరకు ఎంత శక్తి కావలెను? ఇప్పుడే ఆ పరిశుద్ధాత్మ శక్తి ఉంటే వెళ్ళగలము?

యేసుప్రభువు శిష్యులతో ఒకమాట చెప్పినారు. 'మీరు భూమియొక్క దిక్కుయొక్క అంతమువరకు వెళ్ళండి'. వారు ఆత్మను పొందినారు గనుక వెళ్ళారు. అలాగే ఇప్పుడుకూడా పొందితే వెళ్ళగలరు. ***మనకంత ఆత్మబలములేదు. అందువలన మనము వెళ్ళడానికి ఆత్మ పని చాలదు.*** గనుక దేశదేశాలకు పత్రికలద్వారా ఈ సంగతి అచ్చువేసి పంపవలెనంటే, మన ముందున్న చీరాలకు ఎన్ని పత్రికలు కావలెను? నాలుగువేలమంది చీరాలవారున్నారు. చీరాలవారు నెలనెలకు నాలుగు వేల పత్రికలు అచ్చువేసి పంపగలరా? ***భూదిగంతములవరకు వెళ్ళలేరు గనుక ఈ పత్రిక పని చేసి అది అందిస్తే బాగుండును.*** మీరే అచ్చువేసి పంచిపెట్టండి. మన్నవ ప్రకాశం లేచాడు గనుక నా మాటకు మన్నన చేస్తారన్నమాటే. చీరాల, పేరాల అంతా ప్రకటిస్తే వారిని రక్షించినవారగుదురు. అలాగుననే విశాఖపట్నం, కర్నూలు, నెల్లూరు పేపర్లు పంపితే వారుకూడా తెలిసికొంటారు. గనుక 'దేవా! నాకు కనబడుము. అందరికి కనబడుము! దేవా నాతో మాట్లాడుము, అందరితో మాట్లాడుము'. ***ఈ ప్రార్థనచేసి (గంటసేపు కనిపెట్టవలెను) కనిపెట్టి, కరపత్రములు పంచినయెడల పట్టణము అంతా మారును.*** ఒరియాలో, హిందీలో, ఇంగ్లీషులో అయ్యగారు ఈ పత్రికలు అచ్చువేస్తున్నారు. కాశీ, జెబల్పూర్, ఢిల్లీ, అయ్యగారు ఈ పేపర్లు పంపుచున్నారు.

**ప్రార్థన:-** దయగల తండ్రీ! ఎవరైతే ఇప్పుడు నడుము కట్టుకొని, చీరాలంతా పేపర్లు పంచిపెట్టుదామని అనుకుంటున్నారో వారికి పేపర్లు అచ్చువేయించి, పంచిపెట్టి, చెప్పేశక్తి ఇస్తావు. ప్రభువా! వారికి ఈ దీవెనను అనుగ్రహించుము. చీరాల కాపురస్తులకు దీవెన దయచేయుము. ఉదయము ఇచ్చిన వర్తమానము, ఇప్పటి వర్తమానము మా హృదయములో అచ్చువేసికొనునట్లు పిల్లలను, బంధువులను అందరిని దీవించుము ఆమేన్.

**అందరు ఆత్మనుపొందుట:-**

యోవేలు 2:28-29. ఇక్కడ ఆయన దృష్టి రాబోయేకాలమందు అనగా ఆయన రాక కాలమందు మనుష్యుల అందరి పక్షముగా యోవేలుద్వారా ఇచ్చిన

వాగ్ధానముమీద ఉన్నది. ఇప్పుడు అది నెరవేరును. 1. ఆ వాగ్ధానము ఏమంటే సర్వజనులమీద నా ఆత్మను కుమ్మరించెదను. 2. యేసుప్రభువు కడవరి కాలమందు ఈ వాగ్ధానమే శిష్యులకు చెప్పెను. తండ్రి కొరకు కనిపెట్టండి. అక్కడున్న ఆ మాట (యోవేలు 2:28), పేతురు మాటలలో మరింత వివరముగా ఉన్నది. 'అంత్యదినముల-యందు మనుష్యులందరి మీద' (అపో.కార్య. 2:17) అని పేతురు పలికెను. అది పూర్తిగా నెరవేరలేదు. ఇకముందుకు అనేకమందికి ఆత్మకుమ్మరింపు కలుగును. ఈ వాగ్ధానము మీకు అనగా, అక్కడున్నవారికి, వారికి జన్మించే పిల్లలకు, వారి సంతతివారికి; ఆ తరువాత ఇక్కడున్న వారికి అనగా దూరస్థులందరికి అని అర్థము. యోవేలులో అది లేదు, పేతురు కాలములో ఉన్నది. ఇప్పటికి రెండు వేల సం॥లు అయినది. ఆరోజు పేతురు దూరస్థులందరికిని అని పలుకుటద్వారా గీచినగీత 2005వ సం॥వరకును వచ్చియున్నది. ఈ గీతలో ఎంతమందో పరిశుద్ధాత్మను కలిగియున్నారు. మనకాలములోనుండి ఆయన ఇంకా పెద్దగీత గీచి ఉన్నారు. అనగా ఆయన ఎప్పుడు వస్తాడో తెలియదు. అప్పటివరకు అందరూ ఆత్మను పొంది ఈ గీతవరుసలోనికి వస్తూనేయుందురు. ఆ తరువాత ఏడేండ్ల శ్రమకాలము. అప్పుడుకూడ ఆత్మ కుమ్మరింపు జరుగును. 1) పేతురు కాలమునుండి మన కాలమువరకు, 2) మనకాలమునుండి ఏడేండ్ల శ్రమ కాలము వరకు. 3) యోవేలు వ్రాసిన వాగ్ధానము, అప్పటికాలము వారికి చాలా దూరము. మనకు చాలా దగ్గర. ఆ వాగ్ధానమే యోవేలు ప్రకటించిన వాగ్ధానము. అది తండ్రి పంపిన వాగ్ధానము. ఆ వాగ్ధానమునకే పేతురు ఇప్పుడు ఈ వాగ్ధానము అని చెప్పాడు. అది ఎంత దూరము సాగియున్నదో! ఎవరైతే తప్పించుకుంటారో వారికికాదు ఆ వాగ్ధానము. ఎవరైతే కావాలని కోరుకొంటారో వారికే ఆ వాగ్ధానము. అపో. 2:39 ***పిలువబడిన వారికి అనగా ప్రభువైన మన దేవుడు, మనము పిలిచినవారిని పిలుస్తున్నాడు.*** అమెరికాలో ఒక జనము ఉన్నది. అక్కడ కొంతమందిని దేవుడు పిలుస్తున్నారు. యూరప్‌లో, ఆసియాలో, ఆఫ్రికాలో కొంతమందిని పిలుస్తాడు. ***అన్ని దేశములలోనుండి అన్ని జనాంగములలో నున్న కొందరిని పిలుస్తాడు.*** అందరికిని ఇవ్వరు అనగా అందరికి ఆత్మ కుమ్మరింపు లేదు. అయ్యో! చీరాల జనాభాలెక్క అంతేనా (6వేలు)! రాయకుదురు జనాభా అంతేనా (3వేలు)! ఒక్కొక్క జనాభాలోనుండి, ఒక్కొక్క దేశములోనుండి, ఒక్కొక్క భాషలోనుండి కొందరికి కుమ్మరింపు ఇస్తారు. పిలువబడినవారంటే ఏర్పర్చబడినవారు.

1. అరవము ఒక జనాంగము
2. మళయాళము ఒక జనాంగము
3. బంగ్లా (బెంగాలి) ఒక జనాంగము
4. హిందీ ఒక జనాంగము
5. తెలుగు ఒక జనాంగము

ప్రతి జనాంగములోనుండి పిలిచెను. గనుక అందరిని పిలిచినట్లే.

అన్ని జనాంగములలోనుండి ప్రతినిధులు వస్తారు. ఆయన అందరిని పిలుస్తారు. అయితే, వారిలో ఏర్పర్చబడిన వారు కొందరే. పిలుపునకు వచ్చినవారెవరో వారే పిలువబడినవారు. మొదట అందరిని పిలిచారు. అందరు ఒప్పుకొనలేదు. కొందరే ఒప్పుకొనిన్నారు. వారే పిలువబడినవారు. వారే ఆయన 12మంది శిష్యులు.

మనందరిలో ఒక్కటే ప్రశ్న ఉన్నది. 'నేను నోరు నెత్తి బాదుకొన్నా ఆత్మ రావడములేదు' రాకపోవడానికి కారణము ఏదోయొక కళంకము ఉన్నది. శిష్యులు, యేసుప్రభువుతో మూడున్నర సం॥లు ట్రైనింగులో ఉన్నప్పటికిని, 10 దినములు ఉపవాసము ఉన్నారు. ***కళంకముంటే ఆత్మకుమ్మరింపు రాదు.*** ఆత్మ నడిపిస్తాడు. ప్రతి క్రైస్తవునిలో పరిశుద్ధాత్మ ఉన్నారు. అది కుమ్మరింపు కాదు. ఎవరైనా కుమ్మరింపు కావలిసివస్తే ***ప్రభువా! నాలోనున్న తప్పు చూపించుమంటే కుమ్మరింపు వస్తాది.*** దీనినిబట్టి అందరికి ఆ వాగ్ధానము ఇవ్వబడినది. 'నాకుకూడ కుమ్మరింపు వస్తే బాగుండును' అని అంటే అదే పిలుపు. శిష్యులు ఉపవాసము చేసినారు, కనిపెట్టినారు. అలాగే మనము చేస్తే పరిశుద్ధాత్మ కుమ్మరింపు వచ్చును. ***'అందరికి అని ఉన్నది కాబట్టి నాకు కుమ్మరింపు వస్తుంది' అని*** అనవలెను. ఉదా: ట్రైనింగ్ అయినది. ఎంత బోధించినా కొందరు పిల్లలు పాస్ అవ్వరు. అప్పుడు ' నా తోటివారు పాస్ అయినారు గనుక నేనును తప్పక పాస్ అవుదును' అని తలంచవలెనేగాని నిరుత్సాహపడకూడదు. ప్రయత్నము మానకూడదు.

మనిషిలో ఏ పాపమైనా ఉంటే, కుమ్మరింపురాదు. ఈ క్రింది విధముగా ఆలోచన చేయువారికి ఆత్మకుమ్మరింపు కలుగదు. 1) ఆలోచనలేనివారికి అనగా పరిశుద్ధాత్మ ఆలోచనలేనివారికి; 2) 'కుమ్మరింపు, అపోస్తలులకుగాని మనకు కాదు' అని అనుకొనువారికి; 3) 'పరిశుద్ధాత్మ కుమ్మరింపువస్తే అందరికి బోధ చేయాలంట' అని అనుకొనేవారికి కాదు. 4) తీరా పరిశుద్ధాత్మ కుమ్మరింపువస్తే ఒకరిని తిట్టకూడదంట, కొట్టకూడదట, సారా దుకాణమునకు వెళ్ళకూడదట' అని అనుకునే

వారికి, ఆత్మకుమ్మరింపురాదు, జరుగదు. 5) ఒక పాదిరిగారు వచ్చి ఒకరికి పరిశుద్ధాత్మ కుమ్మరింపు గురించి చెప్పితే, వారికి వచ్చింది. అయితే, వారు ఏదో లోపములో పడిపోతే, కుమ్మరింపు పోతుంది. అట్లు పోగొట్టుకొనిన ఇతరులనుచూచి, 'పోగొట్టుకొనటానికేనా కుమ్మరింపు పొందడము' అని కొందరు అంటారు. అట్టివారికి కుమ్మరింపు జరగదు. 6) 'ఆయమ్మకు కుమ్మరింపు పోయినది పడిపోయారు' అన్నట్టు విసుగుకొని, ఒకామె ప్రయత్నించినది. ఆ విసుగుదలవల్ల ఆమెకు కుమ్మరింపు రాలేదు. 7) 'యేసు నామములో బాప్తిస్మము పొందాము, గనుక అప్పుడే కుమ్మరింపు పొందాము మాకిక అక్కరలేదు' అని ఒకామె నవ్వేది. ఇటువంటివారు ఇక్కడను ఉన్నారు. మరికొందరు– 'ఇదివరకు పొందాములే, మరలా పొందాలేంటి?' అని మాకు వద్దంటారు. ఆత్మను ఆర్పకుడి (1థెస్స. 5:19). గనుక ఆ పైన చెప్పబడిన ఏడు అంశములు ఇపుడు మీరు మరచిపొండి. ఆయననుగూర్చి సాక్ష్యమివ్వటానికి అపోస్తలుల కాలములో పరిశుద్ధాత్మ అవసరము. "మేము యేసుప్రభువును చూచితిమి. ఆయన చరిత్ర అంతా మాకు తెలుసు. మేము ఆయనతోకూడ ఉన్నాము. ఆయనతో బసచేసాము" అని సాక్ష్యమిచ్చుటకు కుమ్మరింపు కావల్సివచ్చినది. వారు యేసుప్రభువు చరిత్రను చూచారు, మనము విన్నాము. 'వారివలె చూచాము' అని చెప్పటానికి, "సాక్ష్యమివ్వటానికి" కుమ్మరింపు కావలెను. ఎందుచేతనంటే

1) ఆయన అద్భుతాలు,
2) ఆయన మాటలు,
3) ఆయన ప్రవర్తన,

} నేను ఎరుగుదును అని ఎవరైనా, చెప్పగలరు గాని ఇతరులలోనికి వెళ్ళేటంత పవర్‌తో చెప్పలేరు.

బలముతో చెప్పలేరు. సామాన్యముగా చెప్పుదురు. అయితే, ఆత్మ కుమ్మరింపుగలవారు 'నేను చూచాను' అని రూఢీగాచెప్పుదురు (అపో.కార్య. 2:32). ***గనుక ప్రభువు సంగతులు రూఢిగా తెలియవలెను, నిశ్చయము తెలియవలెను.*** కుమ్మరింపు లేకపోతే రూఢీ తెలియదు. నిశ్చయము తెలియదు. ఇంటికి వెళ్ళి ప్రార్థనచేయండి. కుమ్మరింపు వచ్చును. అపోస్తలులకు ఎలాగు నిశ్చయము తెలిసినది? కనిపెట్టి నిరీక్షిస్తే తెలిసినది. అది అందరికి తెలియదు. కనిపెట్టి నిరీక్షించేవారికే తెలుస్తుంది. అనిశ్చయతలేని వారును పిలువబడిన వారే కాని వారు ఏర్పాటులోలేరు, అందుకు తెలియదు. ఉదా:– అన్నము తిన్నావా? అంటే తిన్నవారికే తెలుసు. ఆత్మశక్తినిబట్టి బోధించడము ఉండును. "మీరు బాప్టిస్టులా? మీరు పాపిస్టువాళ్ళు." ఈలాగు ఒకరినొకరు దూషించుకొనుటనుబట్టి

భేదములు వచ్చినవి. రాకడకు ఆ భేదముండదు. పరిశుద్ధాత్మ వస్తే ఆ భేదములు తీసివేయగలము. గనుక ఎంత పొందితే అంతమట్టుకు సంతుష్టిపొందవలెను. దేవుడు తన పరిశుద్ధాత్మను కొలతలేకుండా ఇస్తారు. 'ఇంత ఇస్తాను, అంత ఇస్తాను' అనిలేదు. అదివాడుకుంటే ఇంక ఇవ్వరేమో అనే భయములేదు. ఆయన ఇచ్చే కుమ్మరింపుకు అంతములేదు. ఒక మొండి మహాత్మునికి ఉదయము మొదలుకొని సాయంత్రము 6గం॥లవరకు ఉపవాస ప్రార్థన చేయవలసి వచ్చెను. అయినను, అతను పట్టువిడువక కనిపెట్టినందున కుమ్మరింపు కలిగెను.

ఆలాగు కనిపెట్టు పట్టులోనుండి కుమ్మరింపు పొందు ధన్యత పెండ్లి కుమారుడు నేడు మీకు దయచేయునుగాక! ఆమేన్.[1]


---

**1. 29.5.1955వ సం॥లో దేవదాసు అయ్యగారు చేసిన ప్రసంగము.**

**30.5.1955వ సం॥లో దేవదాసు అయ్యగారు చేసిన ప్రసంగము.**

# ఆత్మ కుమ్మరింపు కూటములలోని పదియవ దినము -ఆదివారము పెంతెకొస్తు పండుగ

లూకా 24 24:49.



**ప్రార్థన:-** పెంతెకొస్తు పండుగను అనుగ్రహించిన తండ్రీ! నీకు మా వందనములు. క్రిస్మస్ పండుగలో నీ కృప తెలుసుకొన్నాము. మంచిశుక్రవారము మేము సంతోషింపవలసిన విషయమైయున్నది. ఎందుకంటే సిలువ, మరణము, సమాధిపై మేముకూడా నీ జయము **పొందినాము. ఈ దినమున ఎవరు నీ శ్రమ, మరణ, పునరుత్థానము, ఆరోహణము, పెంతెకొస్తు, రాకడ విషయములు తలంచుదురో వారిపై నీ ఆత్మ కుమ్మరించుము. ఈ దినమునకు మేము ఏమి నేర్చుకొనవలెనో అట్టిది అందించుము. ఆమేన్.**

కీర్తన: పండుగ పెంతెకొస్తు పండుగ.

పాడిన సభ్యులారా! నేడు మాట్లాడే విషయములు పెంతెకొస్తునాడు జరిగిన అన్నీ విషయములుకాదు. క్రిస్మసు 7 దినములు, మంచిశుక్రవారము 7 దినములు, పెంతెకొస్తు 7 దినములుకాక, 10 దినములు పండుగ చేయవలెను. ఎందుకంటే ఈ పండుగ ఒక్క దినమునే చేయవీలులేదు. ***నిజవిశ్వాసులు మొదటినుండి చివరివరకు చేయగలరు.*** అప్పుడు సంతోషముతో నిజమైన పండుగ చేయగలరు. ఈవేళ మొదట జ్ఞాపకము చేసే విషయము:-

**1. పై నుండి:-** పైనుండి పరిశుద్ధాత్మ రావలెను. మన అనుభవములలో ఈ సంగతి తెలుసు. పైనుండి అనగా (1) జ్యోతులనుండి వెలుగు వచ్చును, (2) పైనున్న మేఘములోనుండి వర్షము వచ్చును, (3) పరిశుద్ధాత్మ అంతకంటే పైనుండి అనగా నీళ్ళపైనుండి, గాలి పైనుండి వచ్చును. ఎక్కడనుండి వచ్చునో, ఎక్కడికి పోవునో తెలియదు. ఆ విధముగా పరిశుద్ధాత్మ పైనుండి వచ్చును. ఇది ఒక అనుభవము. బోధకులు సంఘమును దీవించునప్పుడు చేతులెత్తి దీవించెదరు. గనుక దీవెనయు పైనుండే వచ్చును. బాప్తిస్మమిచ్చేటప్పుడు బోధకుడు నీళ్ళు పైనుండే పోస్తారు. ఇవన్నియు మనకు పైనుండే వస్తున్నవి. భూమి అనుభవించేవన్నియు పైనుండే వచ్చును. పైనుండి వస్తేనేగాని ఇవన్నీ మనకులేవు, అలాగే భూమికి లేవు (హోషేయ 2:21,22).

నేడు పంటలకు, సరియైన ఫలితములు లేవుగాన ఇవన్నీ తలంచి తండ్రిని స్తుతించాలి. మన రెండు చేతులెత్తి పైనున్న తండ్రిని స్తుతించాలి. చేతులు, కన్నులు ఎత్తి అందరు స్తుతించాలి. స్తుతి ఎప్పుడు పైకే వెళ్ళును. సుంకరి ఒప్పుదలలో ఉన్నాడు గాన తలవాల్చి స్తుతించెను. ఆయన తన వాక్కును పంపి వారిని బాగుచేసెను. కీర్తన

Bible Mission HQ Guntur

107:20. ఆ వాక్కు బైబిలులో ఉన్నది. గాన బైబిలుకూడ పైనుండే వచ్చెను. వెలుగు కలుగునుగాక! అని పైనుండి వాక్కు వచ్చి, ఆ వాక్కులోనుండి, వెలుగు కలిగెను. వీటన్నిటిలో ముఖ్యమైనది పరిశుద్ధాత్మ గనుక ఆయనకొరకు వేడుకొనండి.

**2. మీదికి వ్రాలుట:-** అనగా క్రుమ్మరించుట. 'మీ మీదికి నా ఆత్మను పంపుదును, నేను పంపిస్తాను' అని ఆయన చెప్పెను. పైనుండి వచ్చేదిగాన 'మీదికి' అని ప్రభువు అన్నారు. 1. ప్రభువు తన ఆత్మను మీదికి పంపెను. 2. ఆ ఆత్మ వ్రాలెను అనగా పైనుండి వచ్చి వ్రాలెను. పక్షి వ్రాలెననగా పైనుండి వ్రాలెను అని అర్ధము. 3 కుమ్మరింపు: పేతురు ప్రసంగములో ఈ చిన్నమాట దొరికెను. దేవుడు పరిశుద్ధాత్మను కుమ్మరించెను. బిందెతో పైనుండి క్రిందికి నీళ్ళను దిమ్మరించినట్లు, పైనుండి దేవుడు పరిశుద్ధాత్మను కుమ్మరించెను. ఈ మూడు మాటలు, 'ఆత్మ' పైనుండి వచ్చెనను వృత్తాంతమును తెలుపుచున్నవి. పైనుండి అనగా గౌరవము ఎక్కువ. **ఉదా:-** అమెరికానుండి ఏదైనా వస్తువువస్తే, దానిని గొప్పగా చూస్తారుగదా! అయితే అమెరికా నుండి వచ్చిన వస్తువుకంటే, ఆత్మకు ఎక్కువ గౌరవము అని జ్ఞాపకము ఉంచుకొనండి. 4. ఆ మూడు మాటలు కలిపితే ఎంతో, 120మందిపైకి వ్రాలుట మరియు కుమ్మరింపబడుట అంత. ఐతే ఏమిపని జరిగినది? బిందెతో నీళ్ళు క్రుమ్మరించగా కుండ నిండును. ***అట్లే ప్రభువు, తన ఆత్మను క్రుమ్మరిస్తేనేగాని హృదయము నిండదు.*** అ.కా. 2వ అధ్యా॥లో వారి హృదయములనిండా ఆత్మ నిండెను అని వ్రాయబడినది. ఈ మూడు కార్యాలవల్ల నిండుటతో సమానమైన మాటగా, 'ఇల్లంతయు నిండెను' అని ఉన్నది. ***ఇది ఆత్మయొక్క పరిపూర్ణతకు, నివాసమునకు గుర్తు.*** హృదయమంతా, ఇల్లంతా, జీవితకాలమంతా నిండెను. ఇవి తలంచి దేవుని స్తుతించండి.

**3.** ఈ పరిశుద్ధ చరిత్రలో ఉన్న మూడవ అంశము: ***వ్యాపించుట:-*** మనము మన పట్టణములో, ఈ ఆవరణమంత బావి త్రవ్వితే, అందులో నీళ్ళు ఊరును. మన కంటికి కనబడేవరకు, మన్ను కనబడేవరకు త్రవ్వి, మైదానము కనబడేవరకు త్రవ్వితే ఎన్ని లక్షలైనా ఖర్చుపెట్టి బహులోతుకు త్రవ్వితే, త్రవ్వేవారికి ఆహారముకూడ పంపితే, చివరకు ఆ గొయ్యి నిండి గాలి లోపల ఉండును. ఆ నీళ్ళు తోడితే చివరకు వచ్చేది మన్నే. ***అయితే, గాలిమాత్రము మనిషికూడా వెళ్ళును.*** గాలియొక్క పని వ్యాపించుటే చెప్పుట. ఈ మూడవ భాగము. నదిలోనికి వెళ్ళుదుము, దానిలో నీళ్ళున్నవి. అవితీస్తే, మధ్య ఖాళీస్థలములో గాలి ఉన్నది. ***అడుగున గాలి లేనియెడల చేపలేలాగు బ్రతుకును? ఆ గాలి చాలక కొన్ని చేపలు, కొన్నిసార్లు బైటికి వచ్చి గాలిపీల్చి, మరలా లోనికి వెళ్ళును.*** కత్తితో సగము చెట్టును నరకగా, ఆ గాటులో గాలియే ఉండును. భోజనం

చేసేటప్పుడు మెతుకుమెతుకు మధ్యను గాలే. గాలి అనేది ఎక్కడబడితే అక్కడేయుండును. నీళ్ళు, ఆహారము లేనియెడల కొంతకాలము ఉంటాముగాని గాలిలేనిదే ఒక్క నిమిషమైనా ఉండలేము. అథోలోకములోను, చెట్లలోను, ఆహారములోను, నీళ్ళలోను ఉండే గాలియొక్క వురవడి కొన్నిసార్లు చిన్నగాను,పెద్దగాను, ఎక్కువగాను, తక్కువగాను ఉండును. గాని తుఫానులోని గాలివేగము, బలము, వురవడి వేరుగాయుండును. **అలాగే పరిశుద్ధాత్మ లేని స్థలములేదు.** గాని శిష్యులున్న గదిలో పరిశుద్ధాత్మ కుమ్మరింపు జరుగగా ఓరు వినబడెను. వెలుపల ఉన్న అవిశ్వాసులు, ఆ ఓరునుబట్టి మామూలు గాలే వచ్చినదనుకున్నారు. గాలియొక్క పని ఓరుపెట్టుట. అనగా గాలి వేరు, గాలియొక్క పనివేరు. **నేను వేరు, నేను వ్రాసిన పుస్తకము పనివేరు.** అలాగే ఆయన పనిని నరులు అడుగరు. "పరిశుద్ధాత్మ తండ్రీ! నీ పనికాదు, నీవే మాకు కావాలి. చిన్నతనమునుండి నీ పనిమాకు తెలుసు. అయితే, ఇపుడు మాకు నీవే కావాలి" అని ఆయనను అడుగవలెను.

చిన్నపుడు బడిలోనున్నప్పుడు పాఠములపై ఏమి శ్రద్ధలేదు. అయితే వయసు పెరిగినపుడు, చదువులపై శ్రద్ధ అధికమగును. అలాగే, ఈ బైబిలు చదువుట, సంగతి నేర్చుకొనుట పరిశుద్ధాత్మ పని. ఒక యౌనస్థుని అబ్బాయి! ఈ ఊరు వచ్చి బోధిస్తున్నావు. నీవే వచ్చావా? లేక పరిశుద్ధాత్మ నడిపింపా? అని అంటే 'లేదు, నేనే వచ్చితిని' అంటాడు. ఇంకొకరిని అడిగితే, 'ప్రార్థనలో ఉండగా పరిశుద్ధాత్మ నడుపుదల ఇచ్చెను' అంటారు. అనగా సేవలో ముందుకు వెళ్ళుకొలది ఆత్మపై శ్రద్ధ అధికమగును. మంచి ప్రసంగము పరిశుద్ధాత్మ పనే. కష్టము, కీడు, ఆపద పై ఆపద మొదలైన ఈ కుమ్మరాలను వెళ్ళగొట్టుటకు పరిశుద్ధాత్మ కుమ్మరింపు అవసరముగాన ఆ కుమ్మరింపే మనకు అవసరము. వాక్యము చదువగా అర్థమగును. అది పరిశుద్ధాత్మ వెలిగింపు. మంచిపని పరిశుద్ధాత్మ పని. ఊరు వెళ్ళుట పరిశుద్ధాత్మ నడిపింపు. మీరు పరలోకపు తండ్రిని ప్రార్థించిన యెడల **"ఆయన పరిశుద్ధాత్మనే ఇస్తారు కాని నడిపింపు, వెలుగింపు, ఉద్రేకము కాదు"** మీరు అడిగితే కొలతలేకుండా ఆత్మను ఇస్తారు. **పరిశుద్ధాత్మకు ఆది, అంతములేదు. తీసికొంటూ, వాడుకుంటూ ఉండాలి.** పరలోకము వెళ్ళిన పిదప అంతములేని బ్రతుకు బ్రతుకుదుము. భూలోకములో ఆత్మజీవనము, పరలోకములో అంతములేని మహిమజీవనములో యుగయుగములు జీవింతుము.

అట్టి జీవభాగ్యము పెండ్లికుమారుడు నేడు మీకు దయచేయునుగాక. ఆమేన్.[1]

---

**1. 1.6.1952వ సం॥లో దేవదాసు అయ్యగారు చేసిన ప్రసంగము.**

మొదటి ముద్రణ 2005 ప్రతులు 5000

ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బైలుపరచిన

# బైబిలుమిషను ప్రచురణ

**ముద్రణ:** బైబిలుమిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు-522509.

ఫోన్: 0863-2556644; 2556149.